శుక్రవారం
31-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 130
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రెప్పపాటులో ఘోరం

67 మంది దుర్మరణం

- గాల్లోనే విమానం-హెలికాప్టర్ ఢీ
- నదిలో కుప్పకూలిన వైనం
- అమెరికాలో దుర్ఘటన: మృతుల్లో ముగ్గురు సైనికులు
- ఇది నివారించదగ్గ ప్రమాదం: ట్రంప్

8లో

సైనిక బ్లాక్ హాక్ హెలికాప్టర్.. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం గాల్లోనే ఢీకొన్నాయి. అప్తై పొటామక్ నదిలో విమానం కూలిపోయింది. విమానంలోనూ, హెలికాప్టర్‌లో గల మొత్తం 67 మందిలో ఏ ఒక్కరు ప్రాణాలతో లేరని అధికారులు ప్రకటించారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు విశాఖలోని మంత్రీస్ హోటల్‌లో గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. ముందుగా ప్రధాన కార్యదర్శి డి.రాజా దేశ రాజకీయ పరిస్థితులు, సీపీఐ నిర్వహించాల్సిన కర్తవ్యం తదితర అంశాలను వివరించారు.

జాతిపితకు ఘన నివాళి

విశాలాంధ్ర-హైదరాబాద్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం బాపు ఘాట్ సమాధి వద్ద ప్రముఖులు ఘన నివాళులర్పించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

భగవంత్‌మాన్ ఢిల్లీ నివాసంలో సోదాలు?

న్యూఢిల్లీ: ఢిల్లీలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు చెందిన అధికార నివాసంపై పోలీసులు దాడి చేసినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆరోపించింది. కపుర్తలా హౌస్‌లోకి వెళ్లేందుకు పోలీసులు అక్కడకు చేరుకున్నారని పేర్కొంది. ఢిల్లీ సీఎం అతిశీ ఈ మేరకు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌ను బీజేపీ లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. 'ఢిల్లీలోని భగవంత్ మాన్ ఇంటిపై దాడి చేయడానికి పోలీసులు చేరుకున్నారు. బీజేపీ వ్యక్తులు పట్టపగలే డబ్బులు, బూట్లు, బెడ్ షీట్లను బహిరంగంగా

- మిగతా 2 లో

నేటి నుంచి పార్లమెంటు

వక్ఫ్ సహా 16 బిల్లుల ప్రవేశానికి కేంద్రం సిద్ధం

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభవుతాయి. కేంద్రాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రతిపక్షాలు... తాము అనుకున్నది సాధించేందుకు అధికార పక్షం సిద్ధమయ్యాయి. తమకున్న అస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. ఈసారి బడ్జెట్ సమావేశాలు వాడీ వేడిగా జరగనున్నట్లు అంచనాలు ఉన్నాయి. తాజాగా మహా కుంభమేళలో తొక్కిసలాట, వీఐపీ సంస్కృతి, వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశం వంటి పరిణామాల క్రమంలో ఉభయ సభలు దద్దరిల్లబోతున్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. వక్ఫ్ ప్యానల్ తీరును ప్రతిపక్ష సభ్యులు ఇప్పటికే తీవ్రస్థాయిలో విమర్శించారు. రిజర్వేషన్లను బుల్డోజ్ చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని దుయ్యబట్టారు. కమిటీలో ప్రతిపక్ష సభ్యుల విషయంలో అనుచిత ప్రవర్తన, ప్రజాస్వామ్యానికి అవమానం, బూటకపు ప్రక్రియ వంటి విమర్శలు గుప్పించారు. ఇదిలావుంటే, పార్లమెంటు సమావేశాల ప్రారంభం రోజున ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మిగతా 2 లో

విద్యుత్ సామర్థ్యం పెంపులో మరో ముందడుగు

- హిమాచల్‌ప్రదేశ్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై తెలంగాణ ఆసక్తి
- ఎంఓయూ కోరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనలతో అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం బూట్ (బిల్డ్ ఓన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఆహ్వానించగా... తెలంగాణ విద్యుత్ అధికార బృందం ఆ రాష్ట్రాన్ని సందర్శించి, ఆ ప్రతిపాదనను అధ్యయనం చేసి 100 మెగావాట్లకు పైబడి సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. తెలంగాణ అధికార బృందం హిమాచల్ ప్రదేశ్ విద్యుత్ శాఖ కార్యదర్శితో చర్చలు జరిపింది. సెలీ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు (400 మెగావాట్లు), మియర్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు (120 మెగావాట్లు)లను పరిశీలించారు. 100 మెగావాట్లకు పైబడి సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తి వ్యక్తం చేయాలని సిఫారసు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సఖుతో గురువారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ భేటికి ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. 400 మెగావాట్ల సెలీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు. వాటికి సంబంధించిన ముసాయిదాను పంపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హిమాచల్ ప్రదేశ్ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ ఒప్పందంపై తెలంగాణ ప్రభుత్వం తగిన పరిశీలన చేసి త్వరితగతిన ఎంవోయూపై సంతకం చేసే విధంగా చర్యలు చేపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్ తెలంగాణ రాష్ట్ర అవసరాలు, భవిష్యత్ డిమాండ్లను తీర్చేందుకు విద్యుత్ సరఫరా సామర్థ్యం మరింత బలపడేందుకు ఉపయోగపడుతుంది.

కుంభమేళాలో మరో అగ్నిప్రమాదం

- ప్రయాగ్‌రాజ్‌లో వాహనాలకు నో ఎంట్రీ
- పరిస్థితి చక్కదిద్దేందుకు ఐదుగురు అధికారుల నియామకం

8లో

'విశాఖ ఉక్కు' ప్రైవేటుపరం కాబోదు

ప్లాంట్ పున:నిర్మిస్తాం

90 రోజుల్లో కార్మికుల సమస్యల పరిష్కారం

కేంద్ర మంత్రి కుమారస్వామి

విశాలాంధ్ర -గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ప్లాంట్‌ను పునర్ నిర్మిస్తామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి తెలిపారు. గురువారం విశాఖపట్నం వచ్చిన మంత్రి... విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. అనంతరం మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రమంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సాధించుకోడానికి సుమారు 30 మంది ప్రాణాలర్పించారన్నారు. పరిశ్రమ ప్రారంభంలో ఉత్పత్తి బాగా ఉండేదని, 2013-14 వరకు ఉక్కు పరిశ్రమ పనితీరు బాగానే ఉందన్నారు. 2014లో నవరత్న హోదా కూడా సాధించిందని చెప్పారు. ఉక్కు ఉత్పత్తి పెంచాలని నిర్ణయించినప్పటి నుండి నష్టాల్లోకి వెళ్లిందన్నారు. తాను కేంద్రమంత్రి అయ్యాక స్టీల్‌ప్లాంట్‌పై

- మిగతా 2 లో



వక్ఫ్ బిల్లుపై స్పీకర్‌కు జేపీసీ నివేదిక

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై నివేదికను పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జేపీసీ) గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేసింది. జేపీసీ చైర్మన్ జగదాంబికా పాల్ పార్లమెంటు హౌస్‌లోని కార్యాలయంలో ఓం బిర్లాతో భేటీ అయి ఈ నివేదికను అందజేశారు. మొత్తం 44 సవరణల్లో 14ను జేపీసీ ఆమోదం తెలిపింది. ముసాయిదా శాసనంపై ఓటింగ్‌లో 15-11 లెక్కన ఓట్లు వచ్చాయి. అయితే నివేదికపై ప్రతిపక్ష సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అధికార బీజేపీ సభ్యుల

- మిగతా 2 లో

జీహెచ్‌ఎంసీ సమావేశం రసాభాస

నలుగురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల సస్పెన్షన్

విశాలాంధ్ర- హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. బడ్జెట్ ఆమోదం తర్వాత ప్రజా సమస్యలపై చర్చించాలని బీఆర్‌ఎస్ పట్టుబట్టడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో నలుగురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీన్ని నిరసిస్తూ ఆ పార్టీకి చెందిన మిగతా కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న కార్పొరేటర్లను తిరిగి తీసుకువచ్చి సభను నిర్వహించాలన్నారు. ప్రశ్నోత్తరాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించాలని చెప్పారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. మేయర్ ప్రజా సమస్యలపై చర్చిద్దామని సర్దిచెప్పినా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పట్టువీడలేదు. ఈక్రమంలో ఆమె అసహనం వ్యక్తంచేస్తూనే మార్షల్స్ తీసుకెళ్లిన కార్పొరేటర్లను తిరిగి సభలోకి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. మరోవైపు ఆ నలుగురు కార్పొరేటర్లు లోనికి రావడానికి నిరాకరించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లందరినీ మేయర్ సస్పెండ్ చేశారు. వారిని మార్షల్స్ బయటికి పంపించగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి

- మిగతా 2 లో

రైతన్న కలవరం!

- విరబూయని మామిడి పూత
- మంచుతో ప్రతికూలం
- తెగుళ్లతో ఇక్కట్లు
- దిగుబడిపై దిగాలు
- లభించని మద్దతు ధర
- పట్టించుకోని ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రకృతి ప్రకోపానికి తోడు చీడపీడల ఉధృతి అధికమవడంతో మామిడి రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దాదాపు ఐదేళ్లుగా అన్నదాతలను ప్రకృతి దెబ్బతీస్తూనే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జిల్లాలో చలి వాతావరణం నెలకొనడంతో మామిడి పంటకు ప్రతికూలంగా మారింది. జనవరి మాసం ముగుస్తున్నా ఆశించిన మేర పూత రాలేదు. ఏటా డిసెంబరు నుంచి జనవరి తొలి, మలి వారం నాటికి పూర్తిస్థాయిలో పూత వస్తుంది. చెట్లుపూతతో కళకళలాడుతుంటాయి. కొన్ని ప్రాంతాలలో పూత ఆశాజనకంగా ఉన్నా అది నిలిస్తేనే కాపు బాగుంటుంది. జనవరి తర్వాత ఉష్ణోగ్రతలు పెరిగితే పూత, పిందె రాలిపోతుంది. ఏలూరు జిల్లాలో 80 వేల ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు 40 శాతం తోటల్లో 50 శాతానికి పైగా పూత వచ్చింది. మరో 50శాతం తోటలలో 30శాతం వరకే పూత వచ్చింది. 10శాతం తోటలలో ఇంకా పూత రాలేదు. పూత హెచ్చుతగ్గులకు వాతావరణ పరిస్థితులే కారణమని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మామిడిలో పూతదశ ఫిబ్రవరి వరకు కొనసాగుతోంది. చలి తీవ్రత వల్ల తేనె మంచు, పురుగుల బెడద, ఎర్ర నల్లి, కాయ తొలుచు పురుగు, తామర పురుగు పిందే దశలో రాతి మంగు తెగులు రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుంది. దీని ప్రభావంతో మామిడి రైతులు కలవరం చెందుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలైనా మంచు ప్రభావం ఉంటుంది. మంచు తెగులు ప్రభావం అధికంగా ఉండడంతో రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి దాపురించింది. అయినా పూత పిందెగా మారడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్ల క్రితం వరకు మామిడి తోటలలో సీజన్ మొత్తంగా మూడుసార్లు పురుగుమందులు పిచికారీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వెనక్కి తగ్గిన ఇంటర్ బోర్డు

- సంస్కరణలపై తల్లిదండ్రులు, విద్యావేత్తల తిరుగుబాటు
- 26వరకు బోర్డు అభ్యంతరాల స్వీకరణ
- ప్రథమ పరీక్షలు యథాతథం
- ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌కు ఆమోదముద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు రద్దు చేయాలన్న నిర్ణయంపై ఇంటర్మీడియట్ విద్యామండలి ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నుంచి పెద్దఎత్తున తిరుగుబాటు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్స పరీక్షలను రద్దు చేస్తూ, ద్వితీయ సంవత్సర పరీక్షలను నిర్వహించాలని ప్రతిపాదించినట్లు బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా వెల్లడించారు. ప్రథమ సంవత్సర పరీక్షలు కళాశాలలో ఇంటర్నల్‌గా నిర్వహిస్తామని, ద్వితీయ సంవత్సర మార్కులను పరిగణలోకి తీసుకుంటామని స్పష్టంచేశారు. అదే సమయంలో దేశ వ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించడంలేదంటూ ఆమె ఉదహరించారు. దీంతోపాటు ఇంటర్ సిలబస్ మార్చాలని కీలక ప్రతిపాదన చేశారు. ప్రస్తుత బోర్డు సిలబస్ స్థానంలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టే ప్రతిపాదనలకుగాను ప్రజాభిప్రాయాన్ని ఈనెల 26వ తేదీ వరకూ

- మిగతా 2 లో

సాయుధ పోరాట సేనానులు - 3

రాజకీయాలు, సాహిత్యం కలగలిసిన మనిషిని మఖ్దూం మొహియుద్దీన్ అంటారు. రాజకీయాలు, కార్మికోద్యమం మధ్య ఊపిరాడని స్థితిలో ఉన్న మఖ్దూం మదిలో మెదిలిన ఆలోచనలు కవిత్వంగా జాలువారాయి. చరిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చిన ముగ్గురిలో మఖ్దూం ఒకరు. మిగతా ఇద్దరూ రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లా రెడ్డి. హైదరాబాద్‌లో, తెలంగాణాలో కార్మిక సంఘాలను నెలకొల్పడంలో మఖ్దూం కృషి అపారమైంది. ఆయన కవిగానే కాక కార్మిక నాయకుడిగా కూడా ప్రసిద్ధుడు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

'నోబెల్ శాంతి' రేసులో ఎలన్ మస్క్

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు, టెస్లా, ఎక్స్, స్పేస్‌ఎక్స్, సంస్థల అధినేత ఎలన్ మస్క్.. నోబెల్ శాంతి పురస్కారం-2025 రేసులో నిలిచారు. ఇందుకోసం ఆయన పేరును అమెరికా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈమేరకు యూరోపియన్ పార్లమెంటు సభ్యుడు బ్రాంకో గ్రిమ్స్ ధ్రువీకరించారు. నార్వేజియన్ నోబెల్ కమిటీకి మస్క్ నామినేషన్ ఈనెల 29న అందిందన్నారు. మానవహక్కులు, వాక్ స్వేచ్ఛ పరిరక్షణకుగాను చేసిన కృషికి గుర్తింపును మస్క్ కోరుకుంటున్నారని ఫేస్‌బుక్‌లో గ్రిమ్స్ పోస్టు పెట్టారు. నోబెల్ శాంతి పురస్కారాల కోసం నామినేషన్ల గడువు ఫిబ్రవరి 1తో ముగియనుంది. అక్టోబరులో విజేతలను ప్రకటిస్తారు. నార్వే, ఓస్లోలో డిసెంబరు 10న నోబెల్ శాంతి పురస్కారాన్ని బహూకరిస్తారు. మస్క్ గతసారి కూడా శాంతి బహుమతి కోసం ప్రయత్నించారు. నార్వే పార్లమెంట్ సభ్యుడు మారియస్ నీల్సన్ ఆయన పేరును ప్రతిపాదించారు. అయితే మస్క్‌కు ఈ గౌరవం దక్కలేదు.

అమ్మాయిల కోసం డ్రగ్ వినియోగించా

బిల్ గేట్స్

వాషింగ్టన్: తాను యువకుడిగా ఉన్నప్పుడు చాలా ప్రయోగాలు చేశానని, అమ్మాయిల్ని పడేసేందుకు నిషేధిత ఎల్‌ఎస్‌డీ డ్రగ్ కూడా రుచి చూశానని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ చెప్పారు. ఈ మేరకు తన పుస్తకం 'సోర్స్ కోడ్'లో చాలా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాను చిన్నతనంలో ఎదుర్కొన్న ఆటిజం సమస్యతోపాటు, ఎదురైన అనేక సవాళ్ల గురించి ఆ పుస్తకంలో ప్రస్తావించినట్లు పీపుల్స్ మేగజైన్ వెల్లడించింది. ఫిబ్రవరి 4న ఈ పుస్తకం మార్కెట్‌లోకి విడుదల కానుంది. 'సోర్స్ కోడ్ - మై బిగినింగ్స్' పేరిట బిల్ గేట్స్ ఈ పుస్తకం తీసుకొస్తున్నారు. అందులో తన చిన్ననాటి జీవితంలోని కీలక అంశాలను ప్రస్తావించారు. బిల్ గేట్స్ చిన్నతనంలో ఆటిజంతో బాధపడేవారు. దానికి ఎలాంటి వైద్యం అందించాలో ఆయన తల్లిదండ్రులకు తెలియదు. వివిధ ఆస్పత్రుల చుట్టూ తిరగడం, తనని మామూలు బాలుడిగా చేసేందుకు తన అమ్మానాన్నలు పడిన ఆరాటాన్ని పుస్తకంలో బిల్ గేట్స్ వివరించారు. చిన్ననాటి స్నేహితుడు ఓ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం తనను కలచివేసిందని నాటి సంగతులను గేట్స్ వివరించారు. 'సోర్స్ కోడ్'ను మూడు పుస్తకాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్-1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలు మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్‌లో ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు దీనిలో చోటు కల్పించలేదు. భవిష్యత్‌లో విడుదల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశం ఉంది.

సెనేట్ ముందుకు జన్మత: పౌరసత్వం బిల్లు

వాషింగ్టన్: తాత్కాలిక వీసాలపై తమ దేశానికి వచ్చే వారితో పాటు అక్రమ చొరబాటుదారుల పిల్లలకు పుట్టుకతో లభించే అమెరికా పౌరసత్వాన్ని రద్దు చేసే బిల్లును సెనేట్‌లో రిపబ్లికన్ సభ్యులు ప్రతిపాదించారు. సెనేటర్లు లిండ్‌సే గ్రాహం, టెడ్ క్రజ్, క్యాటీ బ్రిట్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దేశ భద్రతకు విఘాతం కలిగిస్తున్నందునే ఇకపై జన్మతో లభించే పౌరసత్వం విధానాన్ని రద్దు చేయాలని తెలిపారు. పుట్టుకతో వచ్చే పౌరసత్వంపై ఆంక్షలు లేని 33 దేశాల్లో అమెరికా ఒకటిగా వెల్లడించారు. చట్టం అమల్లోకి వచ్చాక పుట్టే పిల్లలకు మాత్రమే ఇది వర్తిస్తుందని సెనేటర్లు చెప్పారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే దేశ సార్వభౌమత్వానికి రక్షణ, అక్రమ వలసవాదం నియంత్రతో పాటు అమెరికా పౌరసత్వాన్ని మరింత పటిష్ఠపర్చుకోవచ్చు అని సెనేటర్లు వెల్లడించారు. పౌరసత్వం క్లాజుకు 14వ సవరణతో కొత్త బిల్లును తీసుకు వచ్చారు. అధ్యక్ష పగ్గాలు చేపట్టిన మొదటిరోజే ఈ బిల్లుపై ట్రంప్ సంతకం చేయడం విదితమే.

వియత్నాంతో బంధం మరింత పటిష్ఠం: పీసీసీ

హవానా: వియత్నాం కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలను మరింత పటిష్ఠ పర్చుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు క్యూబా కమ్యూనిస్టు పార్టీ (పీసీసీ) కార్యదర్శి రాబర్టో మొరేల్స్ ఉద్ఘాటించారు. వియత్నాం, ఆ దేశ ప్రజలకు లూనార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రెండు పార్టీల అగ్ర నాయకత్వం మధ్య ఏకాభిప్రాయంపై దృష్టి సారిస్తామని, కలిసి ముందుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తామని హామీనిచ్చారు. దక్షిణ వియత్నాం ప్రాదేశిక విప్లవ ప్రభుత్వాన్ని గుర్తించిన మొదటి దేశంగా క్యూబా నిలిచింది. 1969 నుంచి రెండు దేశాల మధ్య సంఘీభావం తెలుపుకుంటూ, పరస్పరం గౌరవించుకుంటున్నాయి. ఆసియా, ఓషియానియా నుంచి క్యూబాకు అతిపెద్ద పెట్టుబడిదారీ దేశంగా వియత్నాం ఉంది.

లాటిన్ అమెరికా ఐక్యతకు కట్టుబడి ఉన్నాం: క్లాడియా

మెక్సికో: లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల మధ్య ప్రాదేశిక ఐక్యతకు కట్టుబడి ఉన్నట్లు మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్‌బాన్ తెలిపారు. ఈ విషయంలో తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని చెప్పారు. తమ చరిత్ర ఇందుకు నిదర్శనమని అన్నారు. ఐక్యతనే తాము ఎల్లప్పుడూ కోరుకున్నట్లు వెల్లడించారు. అమెరికాకు వాణిజ్య భాగస్వామిగా మెక్సికో ఉందని, ఆ దేశంతో పటిష్ఠ బంధం ఉందని విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నలకు క్లాడియా బదులిచ్చారు. లాటిన్ అమెరికాతో ఉన్న పటిష్ఠ సంబంధాలు ఇలానే కొనసాగుతాయని మెక్సికో ప్రజలు, ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నట్లు క్లాడియా షెయిన్‌బాన్ అన్నారు.

పెట్టుబడుల వరద

- రూ.44,776 కోట్లతో 15 ప్రాజెక్టులు
- 19,580 ఉద్యోగాల కల్పన
- చంద్రబాబు అధ్యక్షతన ఎస్‌ఐపీబీ ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ రంగాలకు చెందిన పారిశ్రామి కవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయ ంలో గురువారం జరిగిన రాష్ట్ర పెట్టుబడుల అభివృద్ధి బోర్డు మూడో సమావేశంలో 15 ప్రాజె క్టులకు ఆమోదం తెలిపారు. దీంతో ఎస్‌ఐపీబీ ఇప్పటివరకు ఆమోదం తెలిపిన పెట్టుబడుల విలువ రూ.3 లక్షల కోట్లు దాటాయి. వీటితో పాటు ఆర్సెల్లార్ మిత్తల్, ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ వంటి భారీ ప్రాజెక్టులకు ఇప్పటికే మార్గం సుగమం అయిం ది. రూ.1.36 లక్షల కోట్లతో ఏర్పాటయ్యే అర్సెల్లార్ మిత్తల్ స్టీల్ పరిశ్రమకు, రూ. 96 వేల కోట్లతో ఏర్పాటయ్యే బీపీసీఎల్ వంటి ప్రాజెక్టులకు మరో మూడు నెలల్లో శంకుస్థాపన చేయను న్నారు. ఈ మేరకు అన్ని అనుమతులు పూర్తి చేసి ప్రాజెక్టు లను గ్రౌండ్ చేయాలని అధికారు లను సీఎం ఆదేశించారు.

ఏడు నెలల్లో మూడుసార్లు ఎస్‌ఐపీబీ సమావేశాలు

రాష్ట్ర ప్రభుత్వం గడిచిన ఏడు నెలల కాలంలో తీసుకువచ్చిన పాలసీలు, అందిస్తున్న సహకారంతో పెట్టుబడుల రాక ఆశాజనకంగా సాగుతోంది. మొదటి ఎస్‌ఐపీబీ సమావేశంలో రూ.83,987 కోట్లు, రెండో ఎస్‌ఐపీబీలో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మూడవ సమావేశంలో మరో రూ.44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. తాజాగా ఆమోదం పొందిన 15 ప్రాజెక్టుల ద్వారా 19,580 మందికి ఉపాధి లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు రూ.3,10,925 కోట్ల పెట్టుబడు లకు ఎస్‌ఐపీబీ ఆమోదం తెలిపింది. వీటిద్వారా మొత్తం 3,12,576 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

ప్రాజెక్టుల పురోగతిపైనా సమీక్ష

పెట్టుబడులు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా అధికారులు ట్రాకింగ్ చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. రూ.10 కోట్లకు పైగా పెట్టుబడు లు పెట్టే ప్రతి ప్రాజెక్టు పురోగతిని తప్పనిసరిగా ట్రాకింగ్ చేయాలని ఆదేశించారు. గత రెండు సమావేశాల్లో ఆమోదం తెలిపిన ప్రాజెక్టుల పురోగతిపైనా చంద్రబా బు చర్చించారు. ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతరం చర్చలు జరుపుతూ సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూడాలని సీఎం చెప్పారు. అధికారులు, మంత్రులు పెట్టుబడులను ట్రాక్ చేయడం ద్వారా త్వరితగతిన ఫలితాలు చూపించాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేటి పరిస్థితుల్లో ఫలితాలు రావాలంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి చూపాలని స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయిలో అనుమతులు, క్షేత్రస్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష జరపాలని ప్రధాన కార్యదర్శికి సీఎం సూచించారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థలు, జాతీయ-అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల నుంచి వస్తున్న స్పందన సంతృప్తికరంగా ఉందన్నారు.

ఇక ప్రజల చేతిలో పాలన

వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పౌర సేవలు ఇకపై అత్యంత సులభం కానున్నాయి. ధృవపత్రాలు, ఇతర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా పౌర సేవలను వేగవంతంగా అందజేసేందుకు 'వాట్సాప్ గవర్నెన్స్'కు కూటమి ప్రభుత్వం నాంది పలికింది. దేశంలో తొలిసారిగా 'మన మిత్ర' పేరుతో ఈ సేవలను ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అధికారిక వాట్సప్ నెంబర్ 9552300009ను రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం కేటాయించింది. లోకేశ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో తనకు ఈ ఆలోచన వచ్చిందని చెప్పారు. 'బటన్ నొక్కి సినిమా చూస్తున్నాం, భోజనం, క్యాబ్ వంటి సేవలు లభిస్తున్నాయి. అదే విధంగా ఒక బటన్ ద్వారా ప్రభుత్వం ఎందుకు ప్రజల వద్దకు రాదనే ప్రశ్న ఉత్పన్నమైంది. దీనిని సవాల్‌గా తీసుకున్నా. అందుకోసం కసరత్తు చేశా. ప్రజల చేతిలో పాలన, మాది ప్రజాప్రభుత్వం నినాదంతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించగలిగాం' అని లోకేశ్ అన్నారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటుపరం కాబోదు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నో సమీక్షలు చేశానని కుమారస్వామి తెలిపారు. 2021లో విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రతిపాదించారని, ప్రస్తుతం ఈ ప్లాంట్‌కు రూ.35 వేల కోట్ల అప్పు ఉందని, 2030లోపు 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సాధించాలని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించారన్నారు. కార్మికుల సమస్యలను 3 నెలల్లో కొలిక్కి తెస్తామన్నారు.

దీక్షా శిబిరం వద్ద ఆగిన కేంద్ర మంత్రి

విశాఖ ఉక్కు సందర్శనకు వచ్చిన కేంద్ర మంత్రి కూర్మన్నపాలెం ప్రధాన కూడలిలో కొంతసేపు ఆగారు. కూటమి కార్యకర్తలు మంత్రికి అభినందనలు తెలిపేందుకు కాన్వాయ్‌ని దీక్ష శిబిరం ఎదురుగా 15 నిమిషాల పాటు ఆపారు. ప్లాంటును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తున్నట్లు ప్రధాని ప్రకటన చేయాలని, సొంత గనులు కేటాయించాలని పోరాట కమిటీ సభ్యులు నినాదాలు చేశారు. విశాఖ ఉక్కుకు సహాయ ప్యాకేజీ ప్రకటించిన ఉక్కు మంత్రి పర్యటనను స్వాగతిస్తామని అయితే శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు శాశ్వత పరిష్కారం కల్పించాలని పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదని కమిటీ నాయకులు పేర్కొన్నారు. 100% వ్యూహాత్మక అమ్మకాన్ని ఆపాలని, సెయిల్ లో విలీనం చేయాలని, సొంతగనులు కేటాయించాలని, ఉద్యోగుల కుదింపు ఆపాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని. ఉక్కు భూములు బదలాయించాలని, 2021 జనవరి 27 నుండి విధించిన కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ఆంక్షలు ఇప్పటికైనా ఉపసంహరించాలని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజల హక్కు విశాఖ ఉక్కు అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి. శ్రీనివాసరావు, ఎస్.రామారావు, వెంకటేశ్వరరావు, మసేనురావు, ట్రిప్ట్ మూర్తి, ప్రసాద్, సీహెచ్ సన్యాసిరావు, దేవిడ్, దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వెనక్కి తగ్గిన ఇంటర్ బోర్డు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ఈ నిర్ణయం ప్రకటించిన రోజే విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, తల్లిదండ్రుల నుంచి పెద్దఎత్తున తిరుగుబాటు వచ్చింది. దీంతో అదే రోజు సాయంత్రానికల్లా ప్రథమ సంవత్సర పరీక్షలను రద్దు చేయడంలేదని, సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశం తదితర అంశాలపై ప్రతిపాదనలపై అభిప్రాయాల్ని స్వీకరించనున్నట్లు బోర్డు కార్యదర్శి కృత్రికా శుక్లా మరొక ప్రకటన విడుదల చేశారు. తాజాగా ఇంటర్ విద్యలో ప్రతిపాదిత సంస్కరణలపై వచ్చిన సూచనల మేరకు ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు యథాతథంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్సీఈఆర్టీ సిలబస్ అమలు, అంతర్గత మార్కులు, పరీక్షల నిర్వహణ తదితర ప్రతిపాదనలను ఇటీవల ఇంటర్ విద్యామండలి ప్రతిపాదించింది. ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనల మేరకు...పరీక్షలు నిర్వహించకపోతే విద్యార్థులు చదవుపై దృష్టి పెట్టబోరని, అభ్యసన సామర్థ్యాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో అంతర్గత మార్కుల విధానం ప్రతిపాదనలను బోర్డు విరమించుకున్నట్లు సమాచారం. జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సిలబస్ అమలు చేస్తూ... ప్రస్తుతం ఉన్న విధానంలోనే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

మ్యాథ్స్, బయాలజీలో కీలక మార్పులు

కొన్ని ఇంటర్ పేపర్లలో కీలక మార్పులు చేయనున్నారు. వృక్ష, జంతు శాస్త్రాలు కలిపి ఒకే పేపర్‌గా ఉంటుంది. మ్యాథ్స్ ఏ, బీ పేపర్లను రెండింటినీ కలిపి ఒకే పేపర్‌గా రూపొందించనున్నారు. రెండు భాషా సబ్జెక్టుల్లో ఆంగ్లం తప్పనిసరిగా ఉంటుంది. మరో భాషా సబ్జెక్టును విద్యార్థులు ఐచ్ఛికంగా ఎంపిక చేసుకునే వీలుంది. ఆయా అంశాలపై బోర్డు సమావేశం నిర్వహించి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మొత్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి వచ్చిన తిరుగుబాటులో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల రద్దు చేయాలన్న ప్రతిపాదన్ని బోర్డు విరమించుకున్నట్లు సమాచారం. ఈ సంస్కరణలు అమలైతే.. మొత్తం ఇంటర్ విద్యా వ్యవస్థ కార్పొరేట్ యాజమాన్యానికి అనుకూలంగా మారే ప్రమాదముంది. ఇప్పటికే ఇంటర్ బోర్డులో సభ్యులుగా నారాయణ విద్యా సంస్థల కళాశాల ప్రిన్సిపాల్‌ను నియమించడం వివాదస్పదంగా మారింది. అలాంటి వారిని సభ్యులుగా చేర్చడంతోనే ఈ తరహాగా నిర్ణయాలను బోర్డు తీసుకోవాల్సి వస్తుందన్న విమర్శలున్నాయి. వాస్తవంగా తెలుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్ విద్యపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడంలేదు. ఇంటర్‌తోపాటు జేఈఈ, నీట్ కోర్సులను ఇంటిగ్రేటెడ్‌గా బోధిస్తూ... వివిధ పేర్లతో ప్రవేశాలు ఆహ్వానిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రవేశాలు కల్పించడం, మొదటి నుంచి జేఈఈ, నీట్ కోర్సుల సిలబస్‌నే బోధించడం, ఇంటర్ విద్యను నిర్వీర్యం చేయడం పరిపాటిగా మారింది. కేవలం పరీక్షల షెడ్యూలు వచ్చాకనే ఇంటర్ విద్యను హడావుడిగా బోధించడంతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఒక వైపు జేఈఈ, నీట్, ఏపీఈఏపీసెట్ పరీక్షలకు సన్నద్ధం కావడం, మరోవైపు ఏడాదిపాటు ఉన్న ఇంటర్ సిలబస్‌ను రెండు నెలల్లోపే చదివేలా వత్తిడి ముందుకు రావడం వెరసి విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలున్నాయి. ఇంటర్‌లో మార్కులూ సరిగ్గా విద్యార్థులకు రావడంలేదు. కేవలం బట్టీ చదువులతోనే కాలం వెళ్లబుచ్చాల్సిన పరిస్థితి దాపురించింది. ఏ ప్రభుత్వాలు ఈ విధానానికి చెక్ పెట్టలేకపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమూ అదే పంథాలో నడుస్తోంది. మార్చి ఒకటి నుంచి 20 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి. ప్రతేటా విద్యా సంవత్సరం ఆరంభం నుంచే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర సిలబస్ బోధించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతన్న కలవరం!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తే సరిపోలేదని, ప్రస్తుతం ఎనిమిది నుంచి 12 సార్లు పిచికారి చేస్తున్నా ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. పురుగుమందుల నాణ్యతా లోపంతో పిచికారి చేసిన ఐదు రోజుల లోపే మరో రకమైన పురుగులు కాని, లేదా ఎర్ర నల్లి విస్తారంగా కనిపిస్తోందని అంటున్నారు. పెట్టుబడులు భారంగా మారుతున్నాయని, ప్రస్తుత సీజన్లో ఎర్రనల్లి ప్రభావంతో పూత పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోందని రైతులు అంటున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఉద్యానవన పంటలపై ఎర్రనల్లి ప్రభావం ఉధృతంగా ఉండగా... దాని నివారణ చర్యలపై ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించడం లేదని ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నారు. జిల్లాలో ప్రతి ఏటా కోట్లాది రూపాయల మామిడి వ్యాపారం జరుగుతుంది. ప్రతి ఏడాది 1.35 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. ఇక్కడ నుంచి మామిడికాయలను ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది. విరబూసిన పూతను బట్టి జిల్లాలో మామిడి కొనుగోలు యత్నాలు జరుగుతాయి. పూత బాగా నిలిస్తే బంగినపల్లి మామిడి రకం ఎకరాకు నాలుగు నుంచి ఐదు టన్నులు, తోతా పురి ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మామిడిలో కొమ్మ కత్తిరింపు, నీటి తడులు, రసాయన ఎరువులు, పురుగు పిచికారికి ఎకరాకు రూ.30 వేల పైగా ఖర్చు అవుతుంది. టన్ను మామిడికాయ కోత మార్కెట్ కు తరలించేందుకు దాదాపు రూ.నాలుగు వేల వరకు ఖర్చుతో కలిపి రూ.34 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు తెలిపారు. గత ఏడాది బంగినపల్లి మామిడి రకం టన్ను రూ.50 వేల నుంచి 15 వేలకు, తోతాపురి మామిడి రకం టన్ను ధర కేవలం రూ. 15 వేలు నుంచి రూ.ఐదు వేలకు ధరలు పడిపోయాయని, ఈసారి వాతావరణం మామిడి పంటకు అనుకూలంగా లేకపోవడంతో భారీగా దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేక వ్యయ ప్రయాసలకోర్చి మామిడిని మార్కెట్ కు తీసుకువెళ్తే గిట్టుబాటు ధర లభించని పరిస్థితి నెలకొంది.

మామిడికి మద్దతు ధరను ప్రకటించమని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. దీంతో ప్రతి సంవత్సరం మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. దిగుబడి ఆశాజనకంగా ఉండి మద్దతుధర లభిస్తేనే మామిడి రైతు అప్పుల ఊబి నుంచి బయటపడే అవకాశం ఉంది.

వక్ఫ్ బిల్లుపై స్పీకర్‌కు జేపీసీ నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదనల ఆధారిత సవరణలను జేపీసీ ఆమోదించింది. విపక్ష సభ్యుల ప్రతిపాదనలు అన్నింటినీ తిరస్కరించింది. దీంతో వక్ఫ్ బోర్డు వినాశానికి చర్యలకు జేపీసీ పూనుకున్నట్లు ప్రతిపక్షాలు విమర్శించాయి. బీజేపీ ప్రతిపాదనలతో బిల్లుకు సవరణలను ఆమోదించిందని దుయ్యబట్టారు. పాల్ కమిటీ ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడి చేయడమే కాకుండా వక్ఫ్‌బోర్డుల పనితీరులో ప్రత్యక్ష జోక్యం కోసం ఈ బిల్లును తీసుకొచ్చారని విపక్ష సభ్యులు ఆరోపించారు. గతేడాది ఆగస్టులోనే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని బీజేపీ సభ్యులు ఒత్తిడి తెచ్చారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనానికి ఇది దోహదమవుతుందని వారు అనడం తెలిసిందే.

భగవంత్‌మాన్ ఢిల్లీ నివాసంలో సోదాలు?

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీ చేస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు వాటిని గమనించరు. ఎన్నికైన ముఖ్యమంత్రి నివాసంపై దాడిని వారు ఎంచుకుంటారు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు ఆప్ ఆరోపణలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. ఢిల్లీ ఎన్నికల కోసం ప్రచారం చేస్తున్న ఆప్ నేత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అధికారిక నివాసం కపుర్తలా హౌస్‌పై రైడ్ చేయలేదని స్పష్టం చేశారు. సీ విజిల్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదును దర్యాప్తు చేయడానికి రిటర్నింగ్ ఆఫీసర్ నేతృత్వంలోని బృందం అక్కడకు చేరుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. అయితే భద్రా సిబ్బంది లోనికి అనుమతించలేదని చెప్పారు.

నేటి నుంచి పార్లమెంటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగిస్తారు. ఆర్థిక సర్వే 2024/2025తో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. మొదటి సెషన్ ఫిబ్రవరి 13వ తేదీతో ముగుస్తుంది. ఆపై మార్చి 10 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు రెండవ సెషన్ జరుగుతుంది. వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు, ఆర్థిక బిల్లు-2025తో సహా 16 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. బ్యాంకింగ్ చట్టం, భారతీయ రైల్వే విలీనం, భారతీయ రైల్వేల బోర్డుల చట్టాలు కూడా పార్లమెంటు ముందరకు రానున్నాయి. విపత్తు నిర్వహణ, చమురు క్షేత్రాల నియంత్రణ, అభివృద్ధి చట్టాలకు సవరణతో పాటు కోస్తా- రవాణా నౌకలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్‌కు త్రిభువన్ సహకారి యూనివర్సిటీగా పేరు మార్పు, దేశానికి కీలకమైన వ్యవస్థగా దీనిని ప్రకటించడం వంటి 13 ఇతర బిల్లులనూ కేంద్రం ప్రవేశపెట్టనుంది. గోవాలో షెడ్యూల్డ్ తెగలకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రాధాన్యత బిల్లునూ ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆమె మరో రెండు సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టగలిగితే... మొరార్జీ దేశాయ్ (10సార్లు) రికార్డును అధిగమించగలరు.

ఏకపక్ష నిర్ణయాలు తగవు: విపక్షం

కేంద్ర ప్రభుత్వ అన్ని వ్యవహారాల్లో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు తేల్చి చెప్పాయి. స్థాయి సంఘాల్లో విపక్షాల కంటే అధికార పక్ష సభ్యులు ఎక్కువగా ఉండటాన్ని వామపక్ష సభ్యులు దుయ్యబట్టారు. ప్రజాస్వామానికి విఘాతం కలిగించే విధంగా పాలక పక్షం వ్యవహరిస్తోందని సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. పద్ధతి మార్చుకోవాలని కేంద్రానికి హితవు పలికారు. బడ్జెట్ సమావేశాలకు ముందు ఆనవాయితీ ప్రకారం అఖిలపక్షం గురువారం భేటీ అయింది. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్ అధ్యక్షత వహించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు హాజరయ్యారు. మొత్తం16 బిల్లులను చట్టసభల్లో ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర మంత్రులు తెలిపారు. సంబంధిత జాబితాను అఖిలపక్షానికి అందజేశారు. సమావేశానికి హాజరైన వారిలో గౌరవ్ గొగోయ్, జైరాం రమేశ్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే), పి.సంతోశ్ కుమార్ (సీపీఐ), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓ బ్రెయిన్ (టీఎంసీ), ఎన్‌కే ప్రేమచంద్రన్ (ఆర్‌ఎస్‌పీ), శాస్మిత్ పాత్రా (బీజేడీ), రామ్‌గోపాల్ యాదవ్ (ఎస్‌పీ), మహువా మాజీ (జేఎంఎం) తదితరులు ఉన్నారు. ఎన్‌డీఏ మిత్రపక్షం జేడీయూ సభ్యులు 'ఒక దేశం, ఒక ఎన్నిక' బిల్లును ప్రస్తావించారు. దీనిపై హడావిడి చర్యలు వద్దని, విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరపాలని సూచించారు. ఈ బిల్లు 39 మంది సభ్యుల జేపీసీ పరిశీలనలో ఉన్నది. ఎన్‌డీఏకు మరొక మిత్రపక్షం అయిన తెలుగు దేశం పార్టీ ప్రతినిధి... కొత్త లోక్‌సభలో స్థానాల కేటాయింపును ప్రశ్నించారు. తొలుత ఈ అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ లేవనెత్తారు. చట్టసభల్లో ఎవరు ఎక్కడ కూర్చోవాలన్న నిర్ణయం ఏకపక్షంగా జరిగిందని మరి కొందరు ఎంపీలు కూడా వ్యాఖ్యానించారు. స్థాయి సంఘాల్లో విపక్షాల కంటే అధికార పక్ష ఎంపీలు ఎక్కువగా ఉండటంపై వామపక్ష ఎంపీలు గళం వినిపించారు. స్థాయి సంఘాల్లో 29 మంది పాలక పక్ష సభ్యులకు బహుళ సభ్యత్వాలు కల్పించడాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత జైరాం రమేశ్ కూడా ఇదే విషయంపై స్పందించారు. 1990 సమయంలో ఒక ఎంపీ, ఒక స్థాయి సంఘం విధానం ఉండేదని, ఇప్పుడు 26 మంది బీజేపీ ఎంపీలకు రెండు స్థాయి సంఘాల్లో సభ్యత్వం ఉన్నదని గుర్తుచేశారు.

దీనిని బట్టి అధికార పక్షం ఏ విధంగా స్థాయి సంఘాలను నియంత్రిస్తున్నదో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశం అనంతరం కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగడానికి సహకరించాలని అఖిలపక్షాన్ని కోరినట్లు తెలిపారు. ఈనెల 31న ఆర్థిక సర్వే, ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెడతారని, తొలుత రాష్ట్రపతి ప్రసంగంపై, అనంతరం బడ్జెట్‌పై చర్చలు జరుగుతాయని చెప్పారు.

జీహెచ్‌ఎంసీ సమావేశం రసాభాస

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు.

రూ.8,440 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఆమోదంపై జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రతన్ టాటాకు కౌన్సిల్ నివాళులు అర్పించింది. మేయర్ విజయలక్ష్మి బడ్జెట్ ప్రవేశపెట్టారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మేయర్ పోడియాన్ని ముట్టడించేందుకు యత్నించారు. వారిని కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకొని ప్లకార్డులను చించివేశారు. దీంతో రెండు పార్టీల కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో చర్చ లేకుండానే రూ.8,440 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

బీజేపీ కార్పొరేటర్ల భిక్షాటన

భిక్షాటన చేస్తూ బీజేపీ కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చారు. గోషామహల్ స్టేడియాన్ని కూల్చొద్దని.. అక్కడ ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించొద్దంటూ నినాదాలు చేశారు. ఉస్మానియా ఆసుపత్రి వెనక ఉన్న ప్రాంతంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిధులు అడిగితే గెంటేస్తారా? కేటీఆర్

జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల అరెస్టును ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. హైదరాబాద్‌ను పట్టించుకోలేదని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అని 'ఎక్స్' వేదికగా నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. నిధులు ఇవ్వట్లేదని అడిగితే బయటకు గెంటేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

"గత సంవత్సరం కేటాయించిన బడ్జెట్ నిధులను కనీసం ఖర్చు చేయకుండా, మరోసారి అవే కాగితాలపై అంకెలు మార్చి కాంగ్రెస్ గొప్పలు చెబుతోంది. దీన్ని అడ్డుకున్నందుకు మా ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతారా? పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస సౌకర్యాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్‌ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే ఈ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోందన్నారు.

చర్చ లేకుండా బడ్జెట్ ఆమోదం అప్రజాస్వామికం: హరీశ్‌రావు

బడ్జెట్‌పై ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదిస్తున్నట్లు ప్రకటించడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేస్తున్న వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహాత్మాగాంధీ ఆదర్శాలు అనుసరణీయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఇల్లందు : మహాత్మా గాంధీ బాపు ఆదర్శాలు అనుసరణీయమని బాపూ బాటతోనే మన దేశం సమగ్రంగా, శాంతియుతంగా ఉంటుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ప్రతీ ఒక్కరూ బాపు చూపిన మార్గంలో పయనిద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ స్వాతంత్రాలు గాంధీజీ ప్రసాదించినవే అన్నారు. బానిస సంకెళ్ళ విముక్తికి మహాత్మా గాంధీ అనుసరించిన శాంతియత, అహింస మార్గమే కీలక పాత్ర పోషించిన్నట్లు చెప్పారు. అలాంటి గాంధీని కొన్ని శక్తులు వక్రీకరించి విలన్ లా చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నేటితరం యువత దేశ స్వాతంత్ర పోరాట చరిత్ర చదవాలని ఎమ్మెల్యే కనకయ్య కోరారు. అనంతరం పారిశుద్ధ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. సమాజంలో వాసవి క్లబ్,ఆర్యవైశ్య సంఘం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మడుగు సాంబమూర్తి, జాఫర్, వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బోనగిరి రవి కిరణ్, కటకం సత్యేందర్, తీర్దాల నాగరాజు, ఆర్యవైశ్య సంఘం మండల పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలు

విశాలాంధ్ర - ఖమ్మం : కమ్యూనిస్టు కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాడతాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలే పేద, మధ్యతరగతి ప్రజలకు రక్షా అని కమ్యూనిస్టు పార్టీలు మరింత పురోగమించేలా కృషి చేయాలన్నారు. గురువారం ముస్తఫానగర్ లోని అల్లిపురం క్రాస్ రోడ్డు వద్ద సిపిఐ కార్యాలయాన్ని హేమంతరావు ప్రారంభించారు. కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని కార్పొరేటర్ బిజి క్లైమెంట్ ఆవిష్కరించారు. మాడుగుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ నిరంతరం కమ్యూనిస్టు కార్యాలయాలు పనిచేస్తుంటాయని ఎన్నికలప్పుడు మాత్రమే పనిచేసే కార్యాలయాలకు, నిరంతరం ప్రజల కోసం పనిచేసే కార్యాలయాలకు మధ్య తేడాను గమనించాలన్నారు. దేశంలో అవకాశవాద రాజకీయాలు పెరిగిపోతున్నాయని అవకాశవాద రాజకీయాలతో ప్రజాస్వామ్యంలో పెనుప్రమాదం చోటు చేసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పేదలకు సైతం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో వచ్చిన ఒడుదొడుకుల కారణంగా వేలాది కుటుంబాలు కుటుంబ పోషణార్థం పట్టణాలకు వలస వచ్చాయని, అడ్డా కూలీలుగా చాలా మంది పనిచేస్తున్నారని వీరిని విస్మరించడం తగదన్నారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని పట్టణ పేదలకు వర్తింపజేయాలని అందులో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను పట్టణ పేదలకు అందించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా, సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఏఐటియుసి అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, వరదా నర్సింహారావు, ముద్రబోయిన అప్పారావు, పార్టీ నాయకులు సిద్ది శ్రీనివాస్, మాలకొండయ్య, ప్రతాసపు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

బండరాళ్లు పడి ఇద్దరు ఉపాధి కూలీల మృతి

విశాలాంధ్ర - హుస్నాబాద్ : బండరాళ్లు పడి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిచేస్తున్న ఇద్దరు కూలీలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాల్లోకి వెళితే సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన కందారపు సరోజన (45), అన్నాజీ మమత (28) ఇద్దరూ తల్లి కూతుర్లు రోజువారిగనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనికి వెళ్లారన్నారు. మట్టిని తవ్వుతున్న క్రమంలో పైన ఉన్న పెద్ద బండరాళ్లు సరోజన మమత మీద ఒక్కసారిగా పడడంతో ఘటన స్థలంలోనే తల్లి కూతుర్లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురి ఉపాధి కూలీ కాళ్లు విరుగగా మరి కొంతమందికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హుటాహుటిన గాయపడిన ఉపాధి కూలీలను హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సిఐ శ్రీనివాస్ తెలిపారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యేలు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, వొడితల సతీష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ,హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోతి సంపత్ రెడ్డి అన్నారు. గురువారం జాతీయ భద్రత మాసోత్సవాలలో భాగంగా హుజూర్ నగర్‌లోని లారి ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణం నందు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. ద్విచక్ర వాహరదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తద్వారా ప్రమాదాల బారిన పడకుండా రక్షణ పొందవచ్చు అని తెలిపారు. ప్రతి ఒక్కరు వారి వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, తద్వారా ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే, కుటుంబ సభ్యులకు ఆసరాగా ఉంటుందన్నారు. తదనంతరం మాజీ వార్డు కౌన్సిలర్ బొల్లెద్దు ధనమ్మ జైలు ఆధ్వర్యంలో ఉచితంగా 9 మందికి హెల్మెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మర్రెడ్డి, కాకి శ్రీధర్ గౌడ్,ప్రేమ్ సాగర్ భూపాల్ రెడ్డి, దొంతి రెడ్డి సంజీవరెడ్డి, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్లుగా అవతారమెత్తిన రిపోర్టర్లు...

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జర్నలిజం ముసుగులో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ రిపోర్టర్ల ఉదంతం జిల్లాలో తీవ్ర చర్చానియాంశమైంది. ప్రెస్ స్టిక్కర్లు తగిలించుకొని అక్రమ దందాలకు పాత్రికేయులు కూడా ఇటీవల కాలంలో అధికమైందని విమర్శలు వస్తున్నాయి. ఎలాంటి అర్హతలు లేనివారుకూడా జర్నలిస్టులని చెప్పుకుంటూ పవిత్రమైన వృత్తికి కళంకం తెస్తున్నారు. గురువారం అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముఠాను భద్రాచలం చెక్ పోస్ట్ వద్ద నార్కోటి డిపార్ట్మెంట్ సిబ్బంది పట్టుకున్నారు. చెక్పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా హుండాయ్ బ్రాండ్ ఐటమ్ ఆస్తా కారులో తరలిస్తూ ముగ్గురువ్యక్తులు దొరికారు. కారులో 81 కేజీల పైబడి గంజాయి దొరికింది. ఖరీదు రూ 20 లక్షల పాతిక వేలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. అన్నదమ్ములైన రిపోర్టర్లు పండగ వెంకటేశ్వర్లు, పండగ రాములుతోపాటు చతిస్గడ్ సుక్మా జిల్లాకు చెందిన అడవి నందలను కారుతోపాటు అదుపులో తీసుకున్నారు. రిపోర్టర్లు పట్టుబడ్డారానే ఉదంతం సోషల్ మాధ్యమాల్లో పాకింది. విచారణ కోసం భద్రాచలం టౌన్ పోలీసులకు నిందితులతోపాటు కారు, గంజాయిని అప్పగించారు.

నీటి వనరుల ఆక్రమణలపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : ఫిబ్రవరి 12 లోపు నీటి వనరుల ఆక్రమణల పై నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నీటి వనరుల ఆక్రమణ, భూసేకరణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్నెరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ప్రతి 45 మీటర్లకు ఒక విభాగంగా పరిగణించి వాల్ నిర్మించడానికి ఒక బే యూనిట్ అంటారని, మొత్తం 17 కిలో మీటర్ల స్ట్రెచ్ లో 345 పైగా బే యూనిట్‌లుగా నిర్మించాల్సి ఉంటుందని తెలిపారు. వీటిలో 8.5 కిలో మీటర్ వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, మిగిలిన పట్టా భూమి సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములలో పనులు వెంటనే జరిగేలా చూడాలన్నారు. పట్టా భూముల సేకరణకు పట్టాదారు వారీగా మ్యాపింగ్ చేసి వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నీటి వనరుల వద్ద ఆక్రమణకు గురైన భూముల వివరాలను రెవెన్యూ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్ మ్యాపింగ్లను రికార్డులను గుర్తించి ఫిబ్రవరి 12 లోపు వివరాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఇరిగేషన్, రెవిన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పని చేయ్యాలి : సాబీర్ పాష

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల కోసం పాటుపడే నాయకులు, కార్యకర్తలకు సమాజంలో గుర్తింపు ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాష అన్నారు. సిపిఐ పార్టీకి చెందిన 10 వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ, వెంకటేశ్వర్లు, 11 వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్ దేవి దంపతులను స్నేహితులు, బస్తీ వాసులు పదివి విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో సాబీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆ దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఉన్నందాసు గడ్డలో జరిగిన ఈ కార్యక్రమంలొ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఉన్నంతవరకు సిపిఐ ప్రజాప్రతినిధులు పనిచేస్తూనే ఉంటారన్నారు. వార్డుల కౌన్సిలర్లుగా పద్మ, శ్రీనివాసులు అనునిత్యం ప్రజల్లో ఉండి స్థానికుల ఆదరాభిమానాన్ని పొందడం సిపిఐని వరుసగా మూడుసార్లు గెలిపించటం గర్వించదగ్గ విషయమన్నారు. మన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో శక్తి వంచన మేరకు కృషి చేశారని కొనియాడారు. ఉన్నం దాస్ గడ్డ శాఖ కార్యదర్శులు సూరీమేని జనార్ధన్, ఎస్కే జలీల్, నాయకులు బానోత్ చందర్, గుగులోతు శంకర్, తోగరు నరేందర్, భూక్య మహేష్, వ్యాపారవేత్త పల్లపోతు సాయి, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా నాయకురాలు రత్నకుమారి, షాహిన్, విజయలక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఖయ్యూం, రసూల్ దిలీప్, శ్రీనివాస్ నాయక్, మల్లేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చర్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా మురళీకృష్ణ, నాగవర్మ

విశాలాంధ్ర - చర్ల : మండల కేంద్రంలో ఉన్న ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా జువ్వాది మురళీకృష్ణ, దొడ్డి హరినాగ వర్మలు ఎంపికయ్యారు. గురువారం క్లబ్‌లొ సభ్యుల సమావేశం జరిగింది. ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ ప్రభుదాస్, ముఖ్య సలహాదారులు కోడి రెక్కల వెంకటేశ్వరరావులతోపాటు కోశాధికారిగా ఎస్. కిషోర్ కుమార్ లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అలవాల సత్తిబాబు, మచ్చ రాజా, బొబ్బిలి కిరణ్ కుమార్, లక్ష్మణ్ కుమార్, రాజేష్, సునీల్, శ్రావణ్, దారిశెట్టి శ్రీను, రామ లక్ష్మణ్, మోహన్‌రావు, పవన్ కుమార్, గూబ సురేష్, బలుసు పాటి వినోద్, భాను ప్రకాష్‌ను ఎన్నుకున్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర (మహబూబాబాద్) తొర్రూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించి, పట్టణ కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 హామీలను ప్రకటించినా నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్దిని ప్రసాదించమని గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తి అవుతున్న, ఆచరణలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫమయ్యిందని ఆరోపించారు.

మైనారిటీ మహిళపై మూకుమ్మడి దాడి కేసుపై నిర్లక్ష్యం

నిందితులను కాపాడే ప్రయత్నాలు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గణతంత్ర దినోత్సవం రోజె మైనార్టీ మహిళపై జరిగిన దాడి ఘటనలొ నిందితులపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు మీనా మేషాలు లెక్కేస్తున్నారని విమర్శలోస్తున్నాయి. దాడి జరిగి ఐదు రోజులు దాటినా నిందితులపై ఆమెరకు కఠిన చర్యలు ఇసుమంత కూడా కనిపించడం లేదు. చిన్న ఘటనగా పరిగణించి కేవలం కేసు పెట్టి చేతులు దులుపుకున్నట్లు తెలుస్తుంది. రౌడీ మూకల్లా ఘోరంగా నడిరోడ్డు పై పడేసి కొట్టిన దాడి సిసి ఫుటేజ్ వీడియోలొ ఆ రోజే వైరల్ అయింది. ఈ పరిణామాలు మైనార్టీ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. బాధితుల కథనం ప్రకారం ఉదంతం వివరాలు ఇలా వున్నాయి. జిల్లాలోని చంద్రుగొండ మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన షమీమ్ అనే వివహిత తోపాటు అతని అల్లుడు యాకుబ్, వీరి బంధువు మరొకరిని అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన దుబాకుల వెంకటేశ్వర్లు, ఇతని అనుచరులు రిపబ్లిక్ డే రోజు తీవ్రంగా కొట్టారు. జామాయిల్ కలప వ్యాపారంలొ భాగంగా షమీమ్, ఈమె భర్త ఎస్కే నజీర్ 5 నెలల క్రితం వెంకటేశ్వర్లు దగ్గర రూ. 25 వేలు తీసుకున్నారు. నజీర్ కుటుంబంలో కొన్ని ఇబ్బందుల వల్ల ఒప్పందం ప్రకారం వెంకటేశ్వర్లు కు కలప అందించలేకపోయారు. డబ్బులు తిరిగి ఇవ్వమని వెంకటేశ్వర్లు ఒత్తిడి చేస్తుంటే గతంలోనె రూ.14 వేలు చెల్లించారు. మరో 11వేలు ఇవ్వాల్సి ఉండగా కొంత జాప్యం జరిగింది. దీంతో ఈ మధ్యకాలంలో వెంకటేశ్వర్లు ఆ కుటుంబాన్ని బెదిరిస్తూ ప్రతిరోజు పత్రికలో వాడలేని భాషతో దుర్భాషలాడుతూ వెంటాడుతున్నాడు. ఈ క్రమంలోనే రిపబ్లిక్ డే రోజు కూడా ఫోన్ చేసి తిడుతూ షమీమ్‌ను ఎక్కడైనా పడుకొని తన డబ్బులు కట్టాలని వెంకటేశ్వర్లు అనరాని మాటలు అన్నాడు. తీవ్ర వేధింపులతో మానసికంగా కృంగిపోతున్న ఈ కుటుంబం రూ.11 వేలు వేరే చోట అప్పుతీసుకొని అతనికి కట్టెందుకు సిద్ధమైయ్యారు. డబ్బులు రెడీ అయ్యాయి తమ గ్రామానికి రమ్మంటే అతను రాకుండా ఇదే మండలంలోని ఎర్రగుంట గ్రామానికి రమ్మన్నాడు. ఎర్రగుంటలోని కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు వేముల నరేష్ పురుగుమందుల షాపుకు ఆ డబ్బులు కట్టెందుకు భార్యాభర్తల తోపాటు అల్లుడు యాకుబ్, మరో బంధువు రిపబ్లిక్ డే 26న షాపుకు వెళ్లారు. డబ్బులు చెల్లించే సమయంలో షమీమ్ తనను బూతులు తిట్టిన విషయం పెద్ద మనుషుల ముందు ప్రస్తావించింది. అప్పుడు కాదు ఇప్పుడూ తిడతానని మళ్లీ అవే పాడు తిట్లను వెంకటేశ్వర్లు అందరి ముందు పలికాడు. దీంతో ఆగ్రహం ఆపుకోలేని షమీమ్ అతని చెంప మీద ఒక దెబ్బ కొట్టింది. దీంతో రెచ్చిపోయిన వెంకటేశ్వర్లు అతనితో వచ్చిన అనుచరులు పదిమంది షాపు నుంచి బయటికి ఈడ్చుకోచ్చి అందరూ చూస్తుండగానే మహిళ అనికూడా చూడకుండా షమీమ్ ను చితక బాదారు. అడ్డువచ్చిన అల్లుడు యాకుబ్, మరో బంధువు ను కూడా నడిరోడ్డుపై కింద పడేసి కొట్టారు. ఈ దృశ్యాలన్నీ సీసీ ఫుటేజ్‌లో నమోదయి ఉన్నాయి. పొట్ట, నడుం భాగంలో తీవ్రంగా దెబ్బలు తగలడంతో షమీమ్‌ను వెంటనే ఆసుపత్రి కి తరలించి చికిత్స చేయించారు. అక్కడి నుండి వెంటనే పరారైన రౌడీ మూకలపై అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లో అదే రోజు ఫిర్యాదు చేసినట్టు బాధిత కుటుంబం వెల్లడించింది. తనను చంప మీద కొట్టిందని వెంకటేశ్వర్లు కూడా ఫిర్యాదు చేయడంతో పోలీసులు విరుపాక్షాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు పేరా జాప్యం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. బుధవారం బాధిత కుటుంబం తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నట్లు తెలుస్తుంది.ఈ రెండు మండలాల్లో రౌడీ మూకలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఇటీవలే జరిగిన మరికొన్ని ఉదంతాలు విమర్శలకు కారణమౌతున్నాయి.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఆర్ నాగేశ్వరావు గారు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి వారి సొంత నిధులతో పదవ తరగతి పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రేఖ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థులు రాబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి మండలానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేమన్ రెడ్డి, వెంకటయ్య, జితేందర్, సురేష్, మంగ్య నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : దట్టమైన అటవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పూర్తి చేస్తామని, మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతాలలోగల కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలంలోని ఐలాపూర్, కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండాయి గ్రామంలో సమ్మక్క సారక్క వనదేవతలను కలెక్టర్ దర్శించుకున్నారు. అమ్మవార్ల పూజారి కాక వెంకటేశ్వర్లు గిరిజన సాంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడానికి వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా ప్రత్యేక అంబులెన్స్ 24 గంటలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సత్వర వైద్య సేవలను అందించడానికి స్థానికంగా ఉండే వారితో విధులను నిర్వహిస్తామని, గ్రామాలలో చిన్న చిన్న సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అన్ని సమస్యలు ఒకేసారి పరిష్కరించడానికి సాధ్యపడదని అన్నారు. ఏజెన్సీ గ్రామాలలో రోడ్ల సమస్యను పరిష్కరించడానికి కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తామని, ఈ నెల 12 నుండి కొండాయి గ్రామంలో జరిగే మినీ మేడారం జాతర సందర్భంగా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని వివరించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గవర్నర్ దత్తత తీసుకున్న కొండపర్తిని సందర్శించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఆయా శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కలెక్టర్ జిల్లా త్రిపాఠి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరులైన వారి స్మృత్యర్థం 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మోతిలాల్, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమరులకు అంజలి ఘటించి మౌనం పాటించారు.

మరింత సరసంగా హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో ఆప్టిమా లైట్

ముంబయి: భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, సరసమైన ప్రీమియంతో కవరేజీని అందించే ఒక ప్రత్యేకమైన ఆరోగ్య బీమా పరిష్కారంగా ఆప్టిమా లైట్‌ను అందుబాటులోకి తీసుకువచినట్లు ప్రకటించింది. ఈ పథకం ద్వారా, ఆరోగ్య బీమాను మరింత సరసమైనదిగా, దేశ పౌరులకు అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఆప్టిమా లైట్ అనేది హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో ప్రధాన ఆరోగ్య బీమా ఉత్పత్తి - మై: ఆప్టిమా సెక్యూర్ వేరియంట్ కాగా, ఇది భారతదేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన ఆరోగ్య బీమా పథకాలలో ఒకటి. ఆప్టిమా లైట్ పథకం కింద, బీమా చేయబడిన ప్రాథమిక మొత్తం రూ.5, రూ.7.5 లక్షలు. ఈ పథకం కింద, అవయవ దాత ఖర్చులు, ఇంట్లో ఆసుపత్రిలో సేవలు పొందడం, అత్యవసర అంబులెన్స్ (రోడ్డు, వాయు మార్గం రెండూ), ఏడాదిలో బీమా చేయబడిన బేస్ మొత్తాన్ని అపరిమితంగా పునరుద్ధరించడం వంటి ప్రయోజనాలను కూడా వినియోగదారులు పొందవచ్చు.

టిక్ టాక్ కొత్త బ్రాండ్ ఫిల్మ్ విడుదల

హైదరాబాద్: తమ పునరుత్తేజం కలిగించే మింట్, నోరూరించే రుచులకు పేరు పొందిన, ఫెరేరో గ్రూప్‌లో భాగంగా ఉన్న దిగ్గజ బ్రాండ్ టిక్ టాక్, 'టిక్ టాక్ ఫ్రెష్, వైబ్ రిఫ్రెష్' నినాదంతో తమ సరికొత్త బ్రాండ్ ఫిల్మ్‌ను విడుదల చేసింది. రోజూవార జీవితంలో ఉండే విసుగు, గందరగోళం నుండి తప్పించుకోవాలని కోరుకోవడం ప్రపంచవ్యాప్తంగా సమస్యగా నిలిచింది. ఇదే విషయం గురించి ఈ కొత్త ఫిల్మ్ సందేశాన్ని అందిస్తోంది. రోజూవారీ ఒత్తిడి, ట్రాఫిక్ జామ్స్, లేదా నగర జీవితంలో ఉండే అంతులేని శబ్ద కాలుష్యాలతో తరచుగా ప్రజలు కొంచెంసేపు మనశ్శాంతి మరియు పునరుత్తేజం పొందాలని కోరుకుంటారు. ఈ కొత్త బ్రాండ్ ఫిల్మ్ హాస్యం, ఉల్లాసం, పునరుత్తేజం కలిగించే దృశ్యాలు ద్వారా ప్రజలు కోరుకునే ఆందోళనరహితమైన జీవితాన్ని చూపిస్తుంది, ఇది టిక్ టాక్ పునరుత్తేజం కలిగించే సానుకూలమైన భావాలతో సరిగ్గా అనుసంధానమైందని ఫెరేరో ఇండియా పిల్స్ అండ్ గమ్స్ మార్కెటింగ్ హెడ్ జోహర్ కపుస్వాల తెలిపారు.

అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ 100 కొత్త షోల స్లేట్ విడుదల

ముంబై: అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ మొదటి ఎడిషన్-స్ట్రీంనెక్స్ట్ ఈవెంట్‌లో సర్ మార్టిన్ సోరెల్, బెనెడిక్ట్ ఇవాన్స్ వంటి విశ్వవ్యాప్త నాయకులు, ప్రముఖ వినోద పరిశ్రమ ప్రముఖులు ఉన్నారు. ప్రముఖ వ్యక్తులు హాజరు అయిన ఈ ఈవెంట్, భారతదేశంలో ఆవిర్భవిస్తున్న కంటెంట్ వినియోగం పరిస్థితిని, శక్తివంతమైన, చిరస్మరణీయమైన బ్రాండ్స్ నిర్మించుటకు ప్రకటనదారులకు అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ ఒక పరివర్తనాత్మక భాగస్వామి ఎలా అయింది అనేది ప్రదర్శించింది. బాబి డియోల్ (ఆశ్రం 3), సునీల్ శెట్టి, జాకీ శ్రాఫ్ (హంటర్ 2), రెమో డి'సూజ, మలైకా అరోరా (హిప్ హాప్ ఇండియా 2), అష్నీర్ గ్రోవర్ (రైజ్ అండ్ ఫాల్), మరెంతోమంది తార అమ్మ, అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ 2025 కొరకు తన 100 పైగా కొత్త షోల స్లేట్‌ను ప్రదర్శించింది.

తెలంగాణ స్వయం ఆదాయ వర్గాలకు డిజిట్ గ్లో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్

హైదరాబాద్: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన తరం డిజిటల్ లైఫ్ ఇన్సూరర్లలో ఒకటైన గో డిజిట్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (డిజిట్ లైఫ్), ప్రత్యేకంగా సెల్ఫ్-ఎంప్లాయెడ్ వర్గాల భారతీయుల కోసం రూపొందించిన తన మొదటి వ్యక్తిగత శుద్ధ జీవిత భీమాపాలసీ 'డిజిట్ గ్లో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్'ను ప్రారంభించింది. అంతరాయంలేని కస్టమర్ సర్వీసింగ్, ఏజెంట్లను త్వరగా ఆన్ బోర్డింగ్ చేయడానికి, డిజిట్ లైఫ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్ (తెలంగాణ)లోని బేగంపేటలో కార్యాలయాలను ప్రారంభించింది. సెల్ఫ్- ఎంప్లాయెడ్ వ్యక్తులలో ఆర్థిక చేరికను పెంచాలనే లక్ష్యంతో, డిజిట్‌లైఫ్, తన ఇన్-హౌస్ నిర్మిత టెక్-ఎనేబుల్డ్ మోడళ్ల ద్వారా, మెరుగైన ఆర్థిక అండర్ రైటింగ్ కోసం వివిధ ప్రత్యేకమైన డేటా పాయింట్లు, ప్రత్యామ్నాయ క్రెడిట్ పరిమితులను ఉపయోగిస్తుంది. ప్రభుత్వ డేటా ప్రకారం, తెలంగాణలో 55.9% మంది ప్రజలు సెల్ఫ్- ఎంప్లాయెడ్ వర్గాలకు చెందినవారు. భారతదేశంలో 300 మిలియన్లకు పైగా సెల్ఫ్- ఎంప్లాయెడ్ వ్యక్తులు ఉన్నట్లు అంచనా.

ఢిల్లీ దిల్‌వాలేపై హైదరాబాద్ సూపర్‌స్టార్స్ విజయం

హైదరాబాద్: ప్రపంచ పికిల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ సూపర్‌స్టార్స్ 4-1 తేడాతో ఢిల్లీ దిల్‌వాలేపై తిరుగులేని విజయం సాధించింది. ఎడ్వర్డో ఇరిజారీ పురుషుల సింగిల్స్‌లో మెరుపు ఆరంభాన్ని అందించారు. మాక్స్ ఫ్రీమాన్‌పై 24-9తో విజయం సాధించి వెనక్కి తిరిగి చూసుకోలేదు. మహిళల డబుల్స్‌లో సూపర్‌స్టార్లు ఎదురుదెబ్బ కొట్టారు. ఇక్కడ కరోలినా ఓవ్‌జారెక్‌తో కలిసి లుడోవికా స్కియాకీ అరంగేట్రం చేసింది. హైదరాబాద్‌కు తక్కువ స్కోరింగ్ అయినా 14-7 విజయాన్ని సాధించింది. పురుషుల డబుల్స్ హోరాహోరీ పోరులో హైదరాబాద్ తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఢిల్లీ నుంచి సెకండ్ హాఫ్‌లో పోరాటం ఉన్నప్పటికి, రాస్ విట్టేకర్, మాక్స్ ఫ్రీమాన్ 10-8తో కెంటా మియోషి, లియాండర్ లాజారోలను అధిగమించారు. లైన్‌లో టై కావడంతో.. మహిళల సింగిల్స్‌లో మదలీనా గ్రిగోరియు తన శక్తిని ఉపయోగించి అలెక్సా షుల్‌ను 22-8తో ఓడించి, హైదరాబాద్‌కు విజయాన్ని అందించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మరో గట్టి పోటీ కనిపించింది. ఢిల్లీ ప్రయత్నాలు చేసినప్పటికి హైదరాబాద్ 11-9తో తమ ఆధిపత్యాన్ని చూపిస్తూ విజయాన్ని సొంతం చేసుకుంది.

మార్చి 4న నథింగ్ (3ఏ) సిరీస్ విడుదల

ముంబయి: లండన్‌కు చెందిన టెక్నాలజీ కంపెనీ 'నథింగ్' గురువారంనాడు తన అత్యాధునిక కమ్యూనిటీ త్రైమాసిక అప్‌డేట్ వీడియోలో మార్చి 4 వ తేదీన భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఫోన్ (3ఏ) సీరీస్‌ని విడుదల చేయనున్నట్లుగా ప్రకటించింది. రాబోయే ప్రారంభ ఆవిష్కరణ గురించి తెలియజేయాలని ఆసక్తి ఉన్నవారు ఫ్లిప్‌కార్ట్‌లో సైన్-అప్ చేయవచ్చు. 'నథింగ్' సహ-వ్యవస్థాపకులు అకిస్ ఎవాంజిలిడిస్ మాట్లాడుతూ, (3ఏ) సీరీస్ కోసం మేము విభిన్నమైన వాడుకదారుల ఆకాంక్షలకు అనుగుణమైన మార్పులను ఎంచుకున్నట్లు చెప్పారు. ఈ (3ఏ) సిరీస్ కెమెరా, స్క్రీన్, ప్రాసెసర్, డిజైన్ విషయంలో వాడుకదారుల ముఖ్య అవసరాలపై దృష్టి సారించామన్నారు. అక్టోబర్ 2020లో, అనగా కేవలం నాలుగు సంవత్సరాల క్రితం స్థాపించబడినప్పటి నుండీ కంపెనీ తన జీవితకాల రాబడిలో 1 బిలియన్ డాలర్లను అధిగమించిందని 'నథింగ్' వెల్లడించింది.

కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ అడ్మిషన్లు ప్రారంభం

హైదరాబాద్: కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ తమ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో 2025-26 విద్యా సంవత్సరానికి అధికారికంగా అడ్మిషన్‌లను ప్రారంభించింది. విస్తృత శ్రేణి అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. విద్యార్థులు యూనివర్సిటీ అధికారిక అడ్మిషన్ల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రెండవ దశ దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా డిజిటల్, సౌకర్యవంతమైన అనుభవాన్ని అందిస్తుంది. రూ. 1,000 తిరిగి చెల్లించబడని దరఖాస్తు రుసుము అవసరం. కరస్పాండెన్స్ కోసం అభ్యర్థులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఇమెయిల్ ఐడిని అందించాలి. ఎన్ఆర్ఐ, పీఐఓ, ఓసీఐ దరఖాస్తుదారులు కూడా అర్హులు. దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారులు ప్రోగ్రామ్ ప్రాధాన్యతలను సూచించవచ్చు, తుది కేటాయింపు కౌన్సెలింగ్ సమయంలో చేయబడుతుంది. ప్రవేశ పరీక్ష తేదీలు, కౌన్సెలింగ్ షెడ్యూల్‌లు, కోర్సు ప్రారంభ వివరాలు ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తాయి.

'ఇండియామేడ్' జిమ్నీ 5-డోర్ కారు జపాన్‌లో విడుదల

న్యూఢిల్లీ: 'ఇండియాలో తయారు చేయబడిన' జిమ్నీ 5-డోర్ కారును గురువారం జపాన్‌లో ఆవిష్కరించారు. ఈ ఐకానిక్ మోడల్‌ను భారతదేశంలో జరిగిన ఆటో ఎక్స్‌పో 2023లో మొదటిసారి ప్రదర్శించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మారుతి సుజుకి నుండి అత్యధికంగా ఎగుమతి చేయబడిన రెండవ మోడల్ ఇది. జిమ్నీ 5-డోర్ కారును హర్యానాలోని గురుగ్రామ్‌లోని మారుతి సుజుకి తయారీ కేంద్రంలో ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఇది గ్లోబల్ ఆఫ్-రోడర్‌గా బలమైన వారసత్వాన్ని కలిగి ఉంది. దాదాపు 100 దేశాలకు ఎగుమతి చేయబడుతుంది. జపాన్‌లో ఈ లెజెండరీ 4డబ్ల్యుడీ ఎస్‌యూవీని ప్రవేశపెట్టడం మారుతి సుజుకి ఎగుమతి ప్రయాణంలో ఒక ముఖ్యమైన అడుగు అని మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ హిసాషి టకేయుచి తెలిపారు.

శామ్సంగ్ బెస్పోక్ ఏఐ విండ్‌ఫ్రీ ఏసీ శ్రేణి ప్రారంభం

గురుగ్రామ్: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శామ్‌సంగ్ గురువారంనాడు అత్యాధునిక ఏఐ సాంకేతికత, ప్రీమియం డిజైన్ కలయిక అయిన 'బెస్పోక్ ఏఐ విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్ల 2025 లైనప్‌ను ప్రారంభించింది. తెలివైన శీతలీకరణ, శక్తి సామర్థ్యం, అనుసంధాన జీవనంపై దృష్టి సారించి, 19 మోడళ్ల కొత్త శ్రేణి భారతీయ వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న డిమాండ్‌లను తీరుస్తుంది. ఈ ఎయిర్ కండిషనర్లు భారతదేశంలోని తీవ్రమైన వేసవికాలపు సవాళ్లను ఎదుర్కొంటూనే సౌకర్యం, సౌలభ్యం, ఆవిష్కరణలను అందించడానికి ఆలోచనాత్మకంగా రూపొందాయి. ఈ శ్రేణి ఏఐ-ఆధారిత ఆవిష్కరణలను వివిధ వాతావరణ పరిస్థితులకు సజావుగా అనుగుణంగా ఉపయోగించుకుంటుంది. స్థిరమైన సౌకర్యం, గరిష్ట సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది. విండ్‌ఫ్రీ కూలింగ్ టెక్నాలజీ ప్రత్యక్ష డ్రాఫ్ట్‌లను తొలగిస్తుంది. 23,000 మైక్రో హోల్స్ ద్వారా గాలిని సున్నితంగా చెదరగొడుతుంది.

86 ఏళ్ల వృద్ధుడి స్వాలోయింగ్ రుగ్మతకు మణిపాల్ చికిత్స

విజయవాడ: విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ వైద్యపరంగా మరొక అద్భుతమైన విజయం సాధించింది. 86 ఏళ్ల వ్యక్తికి చాలా కాలంగా మింగడంలో ఇబ్బందిగా ఉండేది, మింగిన ఆహారం నోటిలోకి తిరిగి రావడం, రాత్రిపూట దగ్గు కూడా ఉన్నాయి. వీటి వల్ల ఆ వ్యక్తి బరువు తగ్గి పోవడం, గణనీయమైన బలహీనత ఏర్పడింది. ఈ సమస్యలతో మణిపాల్ హాస్పిటల్ విజయవాడకి వచ్చారు. చాతిలో గానీ కణితులు ఏమి లేవని తెలిసిన తర్వాత హై-రిజల్యూషన్ ఎసోఫాజియల్ మానోమెట్రీ ద్వారా పరీక్షల్లో అతనికి అకలేసియా కార్డియా ఉందని నిర్ధారించబడింది. అకలేసియా కార్డియా అనేది ఒక అరుదైన వ్యాధి. దీనిలో అన్నవాహిక నరాలు దెబ్బతినడం వల్ల అన్నవాహికలో ఆహారం క్రిందికి కదలడానికి కష్టమవుతుంది. ప్రతి చికిత్సలో నష్టాలు, ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, రోగి వయస్సు, శస్త్రచికిత్సలో ఉండే అధిక ముప్పు అవకాశాల కారణంగా అధునాతన (ఎండోస్కోపీ) విధానం ద్వారా చికిత్స చేయడానికి నిర్ణయించామని డాక్టర్లు తెలిపారు. మణిపాల్ హాస్పిటల్‌లో మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీలో కన్సల్టెంట్లు డాక్టర్ బత్తిని రాజేష్, డాక్టర్ రాజేష్ చంద్ర నిర్వహించారు.

సంపాదకీయం

1600 రోజులు

జనవరి 30, 2025 నాటికి హిందూ మతత్వవాది నాథూరాం గోడ్సే మహాత్మాగాంధీని హతమార్చి 77 ఏళ్లు అయింది. జీవితాంతం శాంతి అహింసలకోసం పోరాడిన మహాత్మాగాంధీనే సంఘ్ పరివార్ భరించలేకపోయింది. ఆయన ప్రాణాలు తీసింది. ఇదే సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్రకారుడు, సామాజిక కార్యకర్త ఉమర్ ఖాలిద్ గత 1600 రోజులుగా తీహార్ జైలులో మగ్గుతున్న అంశాన్ని గుర్తు చేసుకోవడం ప్రజాస్వామ్యం, పౌరహక్కుల్లో విశ్వాసం ఉన్న వారి కర్తవ్యం. సమకాలీన పరిస్థితిలో బాపూజీ హత్యకు, ఉమర్ ఖాలిద్ ఎలాంటి విచారణ లేకుండా నిరవధికంగా జైలులో మగ్గిపోవడానికి ఉన్న సామ్యాన్ని గుర్తించిన 160 మంది మేధావులు, రచయితలు, ప్రజాస్వామ్య వాదులు, చరిత్రకారులు ఉమర్ ఖాలిద్‌ను, ఆయనతో పాటు అరెస్టు చేసిన ఇతరులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఒక బహిరంగ విజ్ఞప్తి చేశారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించిన అనేక మందిని మోదీ ప్రభుత్వం ఖైదు చేసింది. "ఇది మహాత్మాగాంధీ పాటించి, బోధించిన విలువలను ధ్వంసం చేయడమేనని ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉన్నవారు ఈ విజ్ఞాపనలో పేర్కొన్నారు. భారత్‌ను విడదీయాలని అధికారంలో ఉన్న వారు భావిస్తూ ఉంటే దేశాన్ని సమైక్య పరచడానికి పాటు పడుతున్న వారూ ఉన్నారని ఈ విజ్ఞాపన మీద సంతకాలు చేసిన ప్రముఖులు స్పష్టంగా తెలియజేశారు. ఉమర్ ఖాలిద్ కూడా సరిగ్గా ఇవే అభిప్రాయాలు వ్యక్తం చేసినందుకు మోదీ సర్కారు ఆయనను అరెస్టు చేసి అయిదేళ్లకు పైనుంచి నిర్బంధంలో ఉంచింది. వీరి మీద ప్రభుత్వం మోపిన ఆరోపణలన్నీ నిరాధారమైనవే. ఉమర్ ఖాలిద్, ఆయనతో పాటు అరెస్టైన వారు హింసను ప్రోత్సహించమని ఎవరినీ ప్రేరేపించలేదు. శాంతి, న్యాయం కోసం నిలబడడమే వారు చేసిన పాపం అయింది. అన్యాయమైన "చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (సి.ఎ.ఎ.)" కిరాతకమైందని భావించి నిరసన వ్యక్తం చేసినందుకే వారు కటకటాలు లెక్కిస్తున్నారు. ఉమర్ ఖాలిద్ చేసిందల్లా సి.ఎ.ఎ. చట్టాన్ని నిరసిస్తూ భారత రాజ్యాంగ పీఠికను పది మందిలో చదవడమే. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లను ప్రేరేపించాడన్న ఆరోపణతో ఉమర్ ఖాలిద్, తదితరులను అరెస్టు చేశారు. కానీ ఉమర్ ఖాలిద్‌ను అరెస్టు చేసిన నెల రోజుల తరవాత ఈశాన్య ఢిల్లీలో అల్లర్లు జరిగాయి. ఈ అల్లర్లలో మరణించిన 53 మందిలో 38 మంది ముస్లింలేనన్న వాస్తవాన్నీ గుర్తించాలి. ఉమర్‌తో పాటు గుల్ఫిషా, మీరాన్ హైదర్, అథర్ ఖాన్, షిఫా ఉర్ రహమాన్ తదితరులను అరెస్టు చేశారు. వీరంతా ముస్లింలేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పౌరసత్వ సవరణ చట్టాన్ని కేవలం ముస్లింలు మాత్రమే వ్యతిరేకించలేదు. చాలా మంది హిందువులు కూడా ఈ కిరాతక చట్టంపై నిరసన వ్యక్తం చేశారు. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో జరిగిన మత కలహాలకు అసలు బాధ్యులైన వారి మీద కేంద్ర ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. కానీ సామాజిక కార్యకర్తలను, ప్రజాస్వామ్యం కోసం నిలబడేవారిని అన్యాయంగా అరెస్టు చేసింది. వారి మీద యు.ఎ.పి.ఎ. చట్టం కింద కేసు నమోదు చేశారు. అసలు ఈ చట్టాన్ని తయారు చేసిందే ముస్లింలను వేధించడానికి అని అర్థం అవుతోంది. ఉమర్ ఖాలిద్ ప్రసంగాలలో బహుళత్వం, సెక్యులరిజం, రాజ్యాంగ విలువల గురించి మాత్రమే ప్రస్తావించారు. అవే ఈ ప్రభుత్వానికి కంటకప్రాయంగా కనిపించాయి. పైగా ఉమర్ ఖాలిద్ లాంటి వారి నిరసన ఎప్పుడూ శాంతియుతంగానే కొనసాగింది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కు. హక్కులను కాలరాయడమే పనిగా పెట్టుకున్న బీజేపీ ప్రభుత్వానికి హక్కుల కోసం పోరాడేవారు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టే లెక్క. హింసను రెచ్చగొట్టడానికి ప్రేరేపిస్తున్నట్టే లెక్క. ఉమర్ ఖాలిద్ హింసను రెచ్చగొట్టారని వాదిస్తున్న ప్రభుత్వానికి ఆయన నిజంగా ఏమన్నారో సహజంగానే పట్టదు. ఆయన ఇలా అన్నారు: "మేం హింసను హింసతోనే ఎదుర్కోం. వారు విద్వేషం రెచ్చగొడ్తే మేం ప్రేమ పంచుతాం. వారు మమ్మల్ని లాఠీలతో బాదితే మేము రాజ్యాంగాన్ని చేతబూని త్రివర్ణ పతాకం ఎగరేస్తాం". ఈ మాటలు వినిపించుకోవడం ఇష్టం లేని, ధైర్యం లేని మోదీ ప్రభుత్వం ఈ మాటలను, వాస్తవాలను వక్రీకరించి ఉమర్ ఖాలిద్ తదితరులను నిర్బంధంలో ఉంచింది.

ఉమర్ ఖాలిద్‌కు, ఆయనతో పాటు అరెస్టయిన వారికి అనేక సార్లు బెయిలు నిరాకరించారు. ఆయన కేసు సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. కానీ వాయిదాల మీద వాయిదాలు పడ్డాయి తప్ప విచారణ ఊసేలేదు. అప్పుడు విధిలేక ఉమర్ ఖాలిద్ మళ్లీ కింది కోర్టును ఆశ్రయించవలసి వచ్చింది. ఆ కేసు ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టు విచారణలో ఉంది. ఇటీవల ఆ కేసు విచారణకు వచ్చినప్పుడు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు ఉమర్‌ను ఇంకెన్నాళ్లు జైలులో పెడ్తారు చెప్పండి అని నిలదీసింది. దీనికి ప్రభుత్వ పక్షం ఇంకా సమాధానం చెప్పాల్సే ఉంది. ఇదే కేసులో అరెస్టయిన ముగ్గురికి 2021లో బెయిలు మంజూరు చేసినప్పుడు ఢిల్లీ హైకోర్టు ప్రభుత్వ పక్షం చేసిన వాదనలపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. అయినా ప్రభుత్వం చలించలేదు. "అసమ్మతిని అణచి వేయడానికి ప్రభుత్వం రాజ్యాంగబద్ధతకు, తీవ్రవాదానికి మధ్య గీతను చెరిపేస్తోందని చెప్పక తప్పడం లేదు. ఇదే భావన ప్రభుత్వం కొనసాగిస్తే అది ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుంది" అని కూడా హైకోర్టు వ్యాఖ్యానించింది. అయినా కేంద్ర ప్రభుత్వం యు.ఎ.పి.ఎ. లాంటి కిరాతక చట్టాలనే ఆశ్రయిస్తోంది. ఈ చట్టం కింద బెయిలు రావడం అత్యంత దుర్లభం. బెయిలు హక్కు, విధిలేనప్పుడే జైలు అని పదే పదే చెప్తున్న సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు ఉమర్ ఖాలిద్ లాంటి వారికి బెయిలు మంజూరు చేయడానికి కాళ్లీడుస్తూ తామే చెప్పిన మాటను తుంగలో తొక్కుతున్నాయి. ఉమర్ ఖాలిద్ లాంటివారిని ప్రభుత్వం నిందితులుగా భావించడం లేదు. ఎలాంటి విచారణా లేకుండానే వారిని దోషులుగా భావించి దీర్ఘ కాలం జైలులో ఉంచుతోంది. విచారణ నిర్వహించకుండా నిరవధికంగా జైలులో ఉంచి వ్యక్తుల స్వేచ్ఛను మోదీ ప్రభుత్వం హరిస్తోంది. ఈ రకంగా విచారణ లేకుండా జైలులో ఉంచడం ప్రజాస్వామ్యాన్ని మంటగలపడమేనని బహిరంగ విజ్ఞాపనపై సంతకాలు చేసిన ప్రముఖులు భావిస్తున్నారు. ప్రసిద్ధ నవలా రచయిత అమితావ్ ఘోష్, మహాత్మా గాంధీ మనవడు రాజ్ మోహన్ గాంధీ, చరిత్రకారుడు రామచంద్ర గుహ, చరిత్రకారిణి రొమిలా థాపర్, సినీ నటుడు నసీరుద్దీన్ షా, రంగస్థల నటి రత్నా పాఠక్, కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ అకీల్ బిల్‌గ్రామి లాంటి వారు సంతకాలు చేశారు.

నాయకులు ప్రజల నుంచి రావాలి

నేను భరించలేను ఈ నాయకులను. నేను అంగీకరించను అసలు మనది ప్రజాస్వామ్య దేశమా లేక రాజుల పాలనా! ఏంటి బావ, ఏకంగా నాయకుల మీద పడ్డావు. ఇప్పుడేమయింది నీకు. ఏంటయ్యా ఏమీ తెలియనట్లు తీరిగ్గా ఏమయిందంటావేమిటి. మనం దండలేసి వేదికపై కూర్చోపెట్టే నాయకులంతా మన కోసమే పనిచేస్తున్నారా లేక వారి వ్యాపారాలు పెంచుకోవడానికి పని చేస్తున్నారా? గతంలో ఒకసారి రైతు నాయకుడుగా పేరుగాంచిన ఎన్జీ రంగా ఒక మంత్రిని పట్టుకొని ఈయనెవరు అని అడిగాడట. అలాగే ఒక ఎంపీని పట్టుకొని ఈయన్ని ఎప్పుడూ చూడలేదన్నాడట. నిజమె బావ ఆయన అన్నట్లు చాలామంది శాసనసభ్యులను ప్రజలు ఎరగరు. అలాగే పార్లమెంటు సభ్యుల పేర్లు కూడా తెలియదు. దానికి కారణం వాళ్లు తరచుగా ప్రజలను కలవకపోవడమే. అసెంబ్లీలోను, పార్లమెంటులోను అయిదేళ్లలో ఒకసారి కూడా మాట్లాడని వారున్నారంటే నమ్మలేని నిజం. ఎన్నుకున్న ప్రజలు వారిని ఎరుగరు. ఎన్నికైన ప్రజాప్రతినిధి ప్రజల దగ్గరకి వెళ్లడు.

నిజమేనయ్యా గతంలో ఒక ఎంపీని ఒక విలేకరి మీరెప్పుడూ నియోజక వర్గంలోకి వెళ్లరెందుకని అడిగాడు. ఆయన ఎక్కువగా ఢిల్లీలోను, హైదరాబాదులోనే ఉండేవాడు. అప్పుడా ఎంపీ ఇచ్చిన సమాధానం ఏమిటో తెలుసా బావ. ప్రజల దగ్గరకు వెడితే పనులు అడుగుతారు. చెయ్యకపోతే వ్యతిరేకంగా మారతారు. ఒక వర్గానికి చేస్తే మరొక వర్గం వ్యతిరేకంగా మారుతుంది. వెళ్లకపోతే ఏ బాధ

లేదన్నాడట. అయితే మరల ఎన్నికలలో ఎలా గెలుస్తారని అడిగితే. ఎందుకయ్యా తిరగటం. ఇందిరమ్మ గెలిస్తే నేను గెలుస్తా. ఆమె ఓడిపోతే నేను పోతా. దానికోసం ఎందుకయ్యా లేనిపోని అవస్థ అన్నాడట ఆ ఎంపీ. నలభై సంవత్సరాల తరువాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పులేదు. ప్రస్తుతం ప్రజల కోసం ప్రజల నుంచి వచ్చే నాయకులు అతి తక్కువగా ఉన్నారు. అందుకే ప్రజలు వాళ్లను గుర్తించి గౌరవించడంలేదు. అదేకాక ఒకవేళ ఎవరో ఒకరు ఎంపీ ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ప్రజలను కలవాలన్నా ఆయా నియోజక వర్గాల శాసనసభ్యులు విముఖత చూపుతున్నారు. కొంతమంది ఆయా నియోజకవర్గాలు తమవేనని ఇతరులు రావడం ఎందుకనే ఆలోచనలో ఉన్నారు. అక్కడున్న ప్రజల నిరసన ఎంపీలకు, మంత్రులకు తెలియడం వారికిష్టం ఉండదు. దానివల్ల మంత్రులకు, శాసనసభ్యులకు సమన్వయ లోపం కనబడుతోంది. మంత్రులొచ్చి ప్రజలు అడిగినవన్నీ చేసేస్తాం అని వెళ్లి అవి గాలికొదిలేస్తే జవాబు చెప్పవలసిన పరిస్థితి శాసనభ్యులదే కనుక వారు రావడం కొంత ఇబ్బందిగా భావిస్తున్నారు.

అసలు ప్రజల సమస్యలు ప్రజల నుంచి వచ్చిన నాయకులకు తెలిసినంత ఎక్కడ నుంచో వూడిపడిన నాయకులకు ఎలా తెలుస్తాయి. గతంలో ఎన్నో ఏళ్లు ప్రజలతో మమేకమై వారితో కలిసి వారి సమస్యల కోసం పని చేసిన వారికి శాసనసభకు పోటీ అవకాశం లభించేది. గతంలో పాతిక ముప్పయి సంవత్సరాలు నిత్యం ప్రజలతో కల్సి పనిచేస్తేగాని కమ్యూనిస్టు పార్టీలో ఆ అవకాశం వచ్చేదికాదు. కాని రోజులు మారాయి. ఓట్లు కొనుగోలు మొదలైన దగ్గర నుంచి అసలు ప్రజల ముఖం చూడని వ్యక్తులు చట్టసభలలో అడుగుపెడుతున్నారు. పరిశ్రమాధిపతులు, సినిమా యాక్టర్లు, ఏలేవారి బంధువులు, అవినీతిపరులను భయపెట్టేవారు ఈ రకంగా పార్టీ అధినాయకుల నుంచి పార్టీ టికెట్లు సంపాదించి అందలమెక్కుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రికమెండేషన్లతో రాష్ట్రానికి సంబంధించని వారిని కూడా రాజ్యసభకు పంపవలసిన పరిస్థితి నెలకొంది. తమకు అనుకూలంగా ఉన్నవారికే కేంద్ర నిధులు లభించడం వలన రాష్ట్ర ప్రభుత్వాలు వారి మాట వినవలసిన అగత్యం నిధుల కోసం తప్పడంలేదు. రాష్ట్రాలలో ఉన్న సమస్యలను బట్టి నిధులివ్వకుండా తమ అనుకూలురకు నిధులివ్వడం కేంద్ర పక్షపాత వైఖరికి నిదర్శనం. అన్ని రాష్ట్రాలలో తమ పార్టీని పెంచుకునే ప్రయత్నంలో భాగమే నిధుల విడుదల కూడా ఉంటోంది. కేంద్రానికిది తగని పని అని తెలిసినా నోరు మెదపలేక రాష్ట్ర అధినేతలు మిన్నకుండి పోవలసిన పరిస్థితి ఏర్పడింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్రాలలో కూడా అధికారంలోకి రావడానికి ఆలోచించినంతగా ప్రజల సమస్యలు తీర్చడం కోసం ఆలోచన చెయ్యడంలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ దేశాన్ని హిందూ రాష్ట్రగా మార్చడానికి చేసే ఆలోచనలో తమకు అనుకూలంగా రాష్ట్ర ముఖ్యమంత్రులను మార్చుకుని నిధులు విడుదల చేస్తోందనడంలో సందేహంలేదు. పార్లమెంటులో పార్టీ ఆలోచనలకు తలొగ్గి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే వాటిపై రాజ్యసభలో చర్చ జరిపి వాటిని నిలిపివేయవచ్చు. అవసరమయితే రాష్ట్రపతి నిర్ణయానికి పంపవచ్చు. అందుకే రాజ్యసభకు నిష్ణాతులైన వారిని ఎంపిక చేయాలి. కాని బడా వ్యాపారస్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు సమకూర్చే వారిని, సినిమా వారిని రాజ్యసభకు పంపుతున్నారు. ఇది చూస్తే రాజ్యాంగ నిర్మాత అంబేద్కరు మనసు క్షోభించక మానదు.

సెల్: 9885569394

బ్యాంకు రుణం ప్రాథమిక హక్కు

సి. హెచ్. వెంకటాచలం

బ్యాంకింగ్ రంగం ఆర్థిక రంగానికి అత్యంత పెద్ద అండగా నిలిచింది. సమ్మిళిత బ్యాంకింగ్ వ్యవస్థ మనుగడ కొనసాగేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు బ్యాంకుల నిర్ణయాలపై ప్రజలకు రుణాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకుల సేవలు తప్పనిసరి హక్కు చేయాలని, బ్యాంకు రుణం ప్రాథమిక హక్కుగా చేయాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఎ.ఐ.బి.ఇ.ఏ) కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ను డిమాండ్ చేసింది. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగం వాణిజ్య బ్యాంకులలో, కో-ఆపరేటివ్ బ్యాంకులలో, ఆర్ఆర్ బ్యాంకులలో మొదలైన వాటిలో డిపాజిట్లు బీమా పథకం కింద డిపాజిట్లు ఉన్నాయి. ఈ పథకం 1961 లో ఏఐబీఈఏ ఒత్తిడి మేరకు తీసుకువచ్చారు. ఆనాడు ప్రైవేటు రంగం బ్యాంకుల యాజమాన్యాల తప్పుడు నిర్వహణ మూలంగా అనేక ప్రైవేటు బ్యాంకులను మూసివేశారు. డిపాజిటర్లు బ్యాంకులలో చేసిన డిపాజిట్లను కోల్పోయారు. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న పథకానికి సంబంధించిన చట్టాన్ని పార్లమెంటు చేసింది. బ్యాంకుల రెగ్యులేషన్ చట్టంలోని 45 వ సెక్షన్ ప్రకారం సవరించిన అంశాల కింద దెబ్బతిన్న బ్యాంకులు మరో బ్యాంకులో విలీనం కావడానికి అవకాశం ఆర్బీఐ కల్పించింది. అందువల్ల వాణిజ్య బ్యాంకులు ఏవైనా మూసివేసేందుకు అవకాశం లేకుండా పోయింది. అయితే ప్రభుత్వం అండగా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులు డిపాజిట్ ఇన్స్యూరెన్స్ పథకం కింద కొనసాగాయి. వాణిజ్య బ్యాంకులు భారీ ప్రీమియంను చెల్లించాయి. (2023-24 లో 22 వేల 543 కోట్లు ప్రీమియంగా చెల్లించారు.) కేవలం సహకార బ్యాంకులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తే ఇంత మొత్తం చెల్లించవలసిన అవసరం ఉండదు.

ప్రస్తుతం కూడా ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు చెల్లించవలసిన భారీ మొత్తాలను అనేక మంది వాణిజ్యవేత్తలు, పారిశ్రామివేత్తలు, కుబేరులు చెల్లించకుండా ఎగవేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఐబీఈఏ తరపున ప్రభుత్వానికి అసోసియేషన్ క్రింది సూచనలు చేశాం.

ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించరాదు. ప్రభుత్వ వాటాలు ఎల్లవేళలా 51 శాతం ఉండాలి. ఐడీబీఐ బ్యాంకును విక్రయించాలనే నిర్ణయాన్ని తక్షణం రద్దు చేసుకోవాలి. పార్లమెంటు హామీ ఇచ్చినట్టుగా ఐడీబీఐ బ్యాంకు పెట్టుబడి కనీసం 51 శాతం ఉండేలా ప్రభుత్వం చూడాలి. బ్యాంక్ ఆఫ్ బరోడాలో తాను సహాయంగా ఉన్న నైనిటాల్ బ్యాంకును విలీనం చేయాలి. లేదా మరేదైనా ప్రభుత్వ రంగ బ్యాంకులో విలీనం చేయాలి. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం తర్వాత అనేక బ్రాంచీలను మూసివేశారు. మూసివేసిన బ్రాంచీల లైసెన్సులను గ్రామీణ, బ్యాంకులు లేని ప్రాంతాలలో బ్యాంకులు ఏర్పాటు చేసేందుకు ఉపయోగించుకోవాలి. ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే ప్రైవేటు బ్యాంకుల శాఖలను ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. ఇది అవసరంలేదు. ప్రభుత్వరంగ బ్యాంకుల బోర్డుల ఆఫీసు డైరెక్టర్ల పోస్టులను పదేళ్లుగా భర్తీ చేయలేదు. వీటిని తక్షణం భర్తీ చేయాలి. పొదుపు బ్యాంకు డిపాజిట్ల వడ్డీ రేట్లను పెంచాలి. ఇప్పుడు ఇస్తున్న ఆరుశాతం కంటే మించి రెండుశాతం పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల (సీనియర్ పౌరులు)కు పెంచాలి. సీనియర్‌పౌరుల డిపాజిట్ల మీద ఆదాయం పన్నుపై వడ్డీరేటును మినహాయించాలి. ప్రభుత్వరంగ బ్యాంకులలో సేవలను వేగంగా అందించడానికి వీలుగా అన్ని కేటగిరీల ఉద్యోగులను పెంచాలి. కోవిడ్ మహమ్మారి విజృంభించిన కాలంలో దెబ్బతిన్న చిన్న, మధ్యతరగతి పారిశ్రామిక రంగానికి (ఎంఎస్ఎంఇ) ప్రత్యేక ప్యాకేజీని అందించి ఈ రంగం మొత్తం తిరిగి పుంజుకునేందుకు సహాయపడాలి. ఈ రంగానికి పన్ను రాయితీలను ఇవ్వాలి. చిన్న వ్యాపారులకు ఆరు శాతం వడ్డీకి మాత్రమే రుణాలు ఇవ్వాలి.

కావాలని బ్యాంకు రుణాలను ఎగవేసిన వారిని నేరస్థులుగా పరిగణించాలి. వీరిని స్థానిక సంస్థలు, అసెంబ్లీలు, పార్లమెంటు తదితర సంస్థల ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించాలి. మంత్రి పదవులు స్వీకరించకుండా నిషేధం పెట్టాలి. బ్యాంకులకు చెల్లించవలసిన భారీ మొత్తాలను చెల్లించని వారి వద్ద తిరిగి వసూలు చేసేందుకు ట్రిబ్యునళ్లను ఏర్పాటు

> కావాలని బ్యాంకు రుణాలను ఎగవేసిన వారిని నేరస్థులుగా పరిగణించాలి. వీరిని స్థానిక సంస్థలు, అసెంబ్లీలు, పార్లమెంటు తదితర సంస్థల ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించాలి. మంత్రి పదవులు స్వీకరించకుండా నిషేధం పెట్టాలి. బ్యాంకులకు చెల్లించవలసిన భారీ మొత్తాలను చెల్లించని వారి వద్ద తిరిగి వసూలు చేసేందుకు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేసి బకాయిలు చెల్లించవలసిన వారి నుంచి వసూలు చేయడానికి మరిన్ని అధికారాలు కల్పించాలి. కార్పొరేట్‌లు చెల్లించవలసిన రుణాల భారాన్ని సామాన్య ఖాతాదారులపైన ఛార్జీల రూపంలో మోపరాదు. కార్పొరేట్లు చెల్లించవలసిన రుణాలను ఎట్టి పరిస్థితులలోను రద్దు చేయరాదు. భారీ రుణ బకాయిదార్ల పేర్లను రిజర్వుబ్యాంకు ఆరునెలలకు ఒకసారి ప్రకటించాలి. వ్యవసాయదారులకు, విద్యార్థులకు ఇచ్చే రుణాలపై ఏడాదికి రెండు శాతం వడ్డీని మాత్రమే వసూలు చేయాలి. పేద వర్గాలకు 5 శాతం వడ్డీకి మాత్రమే రుణాలు ఇవ్వాలి.

చేయాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేసి బకాయిలు చెల్లించవలసిన వారి నుంచి వసూలు చేయడానికి మరిన్ని అధికారాలు కల్పించాలి. కార్పొరేట్‌లు చెల్లించవలసిన రుణాల భారాన్ని సామాన్య ఖాతాదారులపైన ఛార్జీల రూపంలో మోపరాదు. కార్పొరేట్లు చెల్లించవలసిన రుణాలను ఎట్టి పరిస్థితులలోను రద్దు చేయరాదు. భారీ రుణ బకాయిదార్ల పేర్లను రిజర్వుబ్యాంకు ఆరునెలలకు ఒకసారి ప్రకటించాలి. వ్యవసాయదారులకు, విద్యార్థులకు ఇచ్చే రుణాలపై ఏడాదికి రెండు శాతం వడ్డీని మాత్రమే వసూలు చేయాలి. పేద వర్గాలకు 5 శాతం వడ్డీకి మాత్రమే రుణాలు ఇవ్వాలి. అభివృద్ధి ఆర్థిక సంస్థలకు (డిఎఫ్ఐ) ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్టును ఏర్పాటుచేసి వారి అవసరాలను తీర్చాలి. గ్రామాలు, గ్రామీణ ప్రాంతాలు, కుగ్రామాలలో ఇళ్ల వద్దకు వెళ్లి బ్యాంకు కార్యకలాపాలను నిర్వహించటానికి బ్యాంకు మిత్రలు, బ్యాంకు కరస్పాండెంట్‌లు లేదా బిజినెస్ కరస్పాండెంట్‌లు నేరుగా వెళ్లి కార్యకలాపాల నిర్వహణకు అనుమతించాలి. అలాగే వీరికి ఈఎస్ఐ సౌకర్యం, ప్రసూతి ప్రయోజనాలు కల్పించాలి. బంగారంపై రుణాల సౌకర్యాన్ని మరింత పెంచాలి. ప్రభుత్వరంగ బ్యాంకులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం లేకుండా స్వతంత్రంగా నిర్వహించేందుకు అనుమతించాలి. వైద్యనాథన్ కమిటీ సిఫారసుల మేరకు అవసరమైన చోట సహకార బ్యాంకింగ్ సంస్థలకు తిరిగి పెట్టుబడులు పెట్టి వాటిని పటిష్టం చేయాలి. వైద్యనాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు బడ్జెట్‌లో కనీసం 20 లక్షల కోట్లను కేటాయించాలి. ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంటలు దెబ్బతిన్న చిన్న, సన్నకారు రైతులు బకాయిలను చెల్లించలేకపోతే సహకార బ్యాంకింగ్ సంస్థలకు తిరిగి పెట్టుబడులు సమకూర్చేందుకు ప్రతి సంవత్సరం 2 లక్షల కోట్ల నిధులను కేటాయించాలి. రైతులు రుణాలు చెల్లించలేనప్పుడు భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను సమకూర్చాలి. బ్యాంకు రెగ్యులేషన్ (సవరణ) చట్టం 2020 లోని 12(1) వ సెక్షన్ ప్రకారం సహకార బ్యాంకులు ప్రజల నుంచి సమీకరించిన పెట్టుబడి మొత్తాన్ని రద్దు చేయాలి. బంగారుపై రుణాలు తీసుకున్న వారికి వడ్డీలు చెల్లించేందుకు నెలసరి, మూడునెలలకు ఒకసారి లేదా ఆరునెలలకు ఒకసారి చెల్లించటానికి అవకాశం ఇవ్వాలి. ఇది ప్రభుత్వరంగ బ్యాంకుల విషయంలో అమలుచేయాలి. అన్ని ప్రాథమిక సహకార బ్యాంకుల వివరాలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలి. సూక్ష్మ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలపైన వడ్డీ రేటు మీద ఒక పరిధిని నిర్ణయించాలి. గ్రాట్యూటీ చట్టం 1972 కింద ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని 25 లక్షలకు పెంచాలి.

ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకులను (ఆర్ఆర్‌బీఎస్) స్పాన్సర్ బ్యాంకులుగా విలీనంచేసి గ్రామీణ ప్రజలు, వ్యవసాయ రంగంలో పనిచేసే రైతులకు తప్పనిసరిగా సకాలంలో రుణాలు అందించాలి. సహకార బ్యాంకింగ్ సంస్థలు, సహకార సంఘాలకు లభించే లాభాలను ఆదాయం పన్ను పరిధి నుంచి మినహాయించాలి. బ్యాంకు ఉద్యోగులకు, పదవీ విరమణ చేసిన బ్యాంకు ఉద్యోగులకు తగిన సౌకర్యాలను కల్పించాలి. పన్ను మినహాయింపు పరిధిని 10 శాతం నుంచి 14 శాతానికి పెంచాలి. పదవీ విరమణ తరువాత పొందే ప్రయోజనాలపై ఆదాయం పన్నును మినహాయించాలి. పదవీ విరమణ తరువాత సెలవులపై పొందే 3 లక్షల సీలింగ్‌ను తొలగించాలి. ఇంకా అనేక సూచనలను అసోసియేషన్ చేసింది.

ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి

సాయుధ పోరాట సేనానులు-3

ఆర్వీ రామారావ్

రాజకీయాలు, సాహిత్యం కలగలిసిన మనిషిని మఖ్దూం మొహియుద్దీన్ అంటారు. రాజకీయాలు, కార్మికోద్యమం మధ్య ఊపిరాడని స్థితిలో ఉన్న మఖ్దూం మదిలో మెదిలిన ఆలోచనలు కవిత్వంగా జాలువారాయి. చరిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చిన ముగ్గురిలో మఖ్దూం ఒకరు. మిగతా ఇద్దరూ రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లా రెడ్డి. హైదరాబాద్‌లో, తెలంగాణాలో కార్మిక సంఘాలను నెలకొల్పడంలో మఖ్దూం కృషి అపారమైంది. ఆయన కవిగానే కాక కార్మిక నాయకుడిగా కూడా ప్రసిద్ధుడు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో మఖ్దూంను అరెస్టు చేశారు. పోరాటం తరవాత కూడా మఖ్దూం అజ్ఞాతవాసం గడపవలసి వచ్చింది. 1952లో ఆయన హైదరాబాద్ రాష్ట్ర శాసన మండలి సభ్యుడయ్యారు. 1956 నుంచి 1969 లో మరణించేదాకా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. భారత కార్మికవర్గ విప్లవకర పోరాటంలో మఖ్దూం పాత్ర అద్వితీయమైంది. కార్మిక నేతగా ఆయన జాతీయ స్థాయిలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి.) సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. ప్రపంచ కార్మిక సమాఖ్య ఉపాధ్యక్షుడిగా కూడా వియన్నాలో పని చేశారు. ఫాసిజానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడారు. ఆయన రచనల ప్రధాన ఇతివృత్తం దోపిడీని, పీడనను వ్యతిరేకించడమే. జీవితాంతం మార్క్సిస్టు సిద్ధాంతానికి నిబద్ధమైన వ్యక్తి.

బుద్దెరిగిన తరవాత ఆయన ఎన్నడూ ఇస్లాం మతాన్ని అనుసరించలేదు. కానీ ఏ మతాన్ని కించపరచలేదు. చిన్ననాట మాత్రం మతానుయాయిగానే ఉన్నారు. సొంత గూడు లేదు కనక మసీదులోనే ఉండేవారు. మసీదు ఊడ్చేవారు. నీళ్లు తెచ్చి పోసేవారు. ముస్లింల మత విధికి తగ్గట్టు రోజుకు అయిదు సార్లు నమాజ్ చేసేవారు. తినడానికి తిండి కూడా దొరకని రోజుల్లో ఒక పైసా పెట్టి తందూరీ రోటీ కొనుక్కుని తిని గుక్కెడు నీళ్లు తాగి కడుపు నింపుకున్నాడు. ఉర్దూలో ఎం.ఎ. డిగ్రీ సంపాదించిన మఖ్దూం కొంత కాలం లెక్చరర్‌గా పని చేశారు. 1940 ప్రాంతంలో ఆ వృత్తి వదిలేసి కమ్యూనిస్టు పార్టీలో పూర్తి కాలం పని చేశారు. నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించడంలో, విశాలాంధ్ర రాష్ట్ర సాధనకు జరిగిన పోరాటంలో ముందున్నారు.

నిజాం సంస్థానంలో రాజకీయ పార్టీ స్థాపించడమే ఘోర అపరాధమైన రోజుల్లో 1929లో కామ్రేడ్స్ అసోసియేషన్, ఆ తరవాత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటులో మఖ్దూం కీలక పాత్ర పోషించారు. నిజాం రాజ్యంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో భాగంగా వందకు పైగా కార్మిక సంఘాలను స్థాపించి వాటి అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ ఫెడరేషన్, ఆజం జాహీ మిల్స్ వర్కర్స్ ఫెడరేషన్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్, నిజాం స్టేట్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ ఏర్పాటులో ప్రధాన పాత్ర ఆయనదే.

1952లో నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ నుంచి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఏర్పాటైన నాటి నుంచి 1969 ఆగస్టు 25వ తేదీ రాత్రి గుండె పోటుతో మరణించేదాకా శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. హైదరాబాద్‌లో ఉర్దూ అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసింది కూడా మఖ్దూమే. ఆయన రాసిన జంగే జంగ్ ఆజాదీ అనే గేయాన్ని రిక్షావాలాలు, టాంగావాలాలు కూడా పాడుకునే వారు. ఆయన కవితలను దాశరథి, రాంభట్ల, గజ్జెల మల్లారెడ్డి మొదలైన వారు తెలుగులోకి అనువదించారు. చిన్నప్పుడే రాసిన నాటికను ప్రదర్శించినప్పుడు రవీంద్రనాథ్ ఠాగోర్ ఆ నాటికను చూశారు. అందులో మఖ్దూం నటించారు కూడా. ఇది చూసి ఠాగోర్ ఆయనను శాంతినికేతన్‌కు వచ్చి చదువుకోవాలని కోరారు. మఖ్దూం కవిత్వంలో విప్లవాగ్ని ఎంతగా ప్రజ్వరిల్లేదో సున్నితమైన భావుకత కూడా అంతే ఉండేది. అందుకే కె.ఎ.అబ్బాస్ మఖ్దూం కవిత్వంలో "తుపాకి మందు వాసన, మల్లెపూల పరిమళం ఉంటాయి" అనే వారు.

అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్టు

లక్నో: అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్‌ను యూపీ పోలీసులు అరెస్టు చేశారు. సీతాపూర్ ఎంపీగా ఉన్న ఆయనపై అత్యాచార ఆరోపణలపై కేసు నమోదు కావడంతో అదుపులోకి తీసుకున్నారు. సీతాపూర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. భారీ పోలీసు భద్రత నడుమ ఆయనను కోర్టుకు తీసుకెళ్లారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఓ మహిళ జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో మాట్లాడిన కాల్ రికార్డింగ్‌ను పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయమే ఎంపీ రాథోడ్ అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా... న్యాయస్థానం తిరస్కరించింది. రెండు వారాల్లోగా సెషన్స్ కోర్టులో లొంగిపోవాలని సూచించింది. అంతకముందు ఇదే కేసులో ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినా తిరస్కరణకు గురైంది.

ఖాలిస్థానీ ఉగ్రవాది పన్నూపై 104 కేసులు: కేంద్రం

న్యూఢిల్లీ: ఖాలిస్థానీ ఉగ్రవాది, 'సిఖ్స్ ఫర్ జస్టిస్' ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూపై భారత్‌లో 104 కేసులు నమోదయ్యాయి. 'పంజాబ్, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, అసోం రాష్ట్రాల్లో ఎస్ఎఫ్‌జేపై 96 కేసులు ఉన్నాయి. మిగతా ఎనిమిది కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ విచారిస్తోంది' అని కేంద్ర ప్రభుత్వం తన గెజిట్‌లో పేర్కొంది. ఎస్ఎఫ్‌జేపై ఉన్న ఐదేళ్లపాటు నిషేధాన్ని పొడిగించినట్లు దిల్లీ హైకోర్టుకు చెందిన ట్రిబ్యునల్ ధ్రువీకరించింది. ఈ విషయాన్ని కేంద్రం తెలిపింది. ప్రభుత్వంలో అగ్రస్థానాల్లో ఉన్న వ్యక్తులను ఉద్దేశించి ఆ గ్రూప్ చేసిన బెదిరింపులు, ఇతర విధ్వంసకర కార్యకలాపాలను ప్రస్తావించింది. ఇదిలాఉంటే... అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం సందర్భంగా ప్రముఖులతో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో పన్నూ ప్రత్యక్షమవడం ఆందోళనలకు కారణమైంది. ఈ పరిణామంపై స్పందించిన భారత్... తమ దేశ భద్రతకు సంబంధించిన అంశాలను అమెరికా వద్ద లేవనెత్తుతూనే ఉంటామని స్పష్టం చేసింది. 'భారత వ్యతిరేక కార్యకలాపాలు ఎప్పుడు జరిగినా అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. మా దేశ భద్రతపై ప్రభావం చూపే, భారత్ వ్యతిరేక అజెండాలపై ఆందోళనలను అక్కడి ప్రభుత్వం వద్ద లేవనెత్తడాన్ని కొనసాగిస్తాం' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

కుంభమేళ తొక్కిసలాటపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ తాజాగా సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్ దాఖలైంది. విశాల్ తివారీ అనే న్యాయవాది ఈ వ్యాజ్యాన్ని వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ వ్యాజ్యం నేపథ్యంలో తొక్కిసలాటపై యూపీ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్ సమర్పించాల్సి ఉంటుంది. జనవరి 13న ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరగనుంది.

క్లాసులో విద్యార్థితో ప్రొఫెసర్ పెళ్లి

కోల్‌కతా: ఒక మహిళా ప్రొఫెసర్, విద్యార్థి తరగతి గదిలోనే పెళ్లి చేసుకున్నారు. వివాహ తంతుకు సంబంధించిన అన్ని ఆచారాలను వారు పాటించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై విమర్శలు రావడంతో కాలేజీ యాజమాన్యం దర్యాప్తునకు ఆదేశించింది. పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. స్థానిక హరింఘట టెక్నాలజీ కాలేజీలోని సైకాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పాయల్ బెనర్జీ పని చేస్తున్నది. పెళ్లి కూతురుగా ముస్తాబైన ఆమెకు క్లాసులోని ఒక విద్యార్థితో పెళ్లి జరిగింది. హల్దీ, దండలు మార్చుకోవడం, వెలుగుతున్న క్యాండిల్ (అగ్ని) చుట్టూ ఏడుసార్లు తిరగడం, నుదుటపై సింధూరం పెట్టడం వంటి హిందూ వివాహ సంప్రదాయ ఆచారాలను వారు పాటించారు. కాలేజీ లెటర్ ప్యాడ్‌పై సాక్షుల సమక్షంలో పెళ్లికి సంబంధించి సంతకాలు చేశారు. ఈ తతంగంపై కాలేజీ యాజమాన్యం స్పందించింది. ప్రొఫెసర్ పాయల్ బెనర్జీని సెలవుపై పంపింది. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు ఇది ఉత్తుత్తి పెళ్లి అని ప్రొఫెసర్ పాయల్ బెనర్జీ తెలిపారు. సైకాలజీ అధ్యయనంలో భాగంగా క్లాస్‌లో పెళ్లి నాటకం ప్రదర్శించినట్లు చెప్పారు. చాలాకాలంగా మనస్తత్వశాస్త్రం బోధిస్తున్న తనను కించపరచడానికి, తన పరువు తీయడానికి ఈ వీడియోను లీక్ చేశారని ఆమె ఆరోపించారు.

యమునా నీటిని తాగే దమ్ముందా?

ఈసీకి కేజ్రీవాల్ సవాల్



న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘానికి దిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. 'ఇప్పుడే నేను మీకు ఓ మూడు బాటిళ్ల యమునా నది నీటిని పంపిస్తా. ప్రెస్ మీట్ పెట్టండి. ఆ ప్రెస్‌మీట్‌లో ఆ నీటిని తాగండి. అలా చేస్తే...మేం తప్పు చేశామని ఒప్పుకుంటాం' అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. హర్యానా ప్రభుత్వం యమునా నదిలోకి వ్యర్థాలు వదులుతోందని కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలపై స్పందించిన ఈసీ కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటల కల్లా వివరణ ఇవ్వాలని సూచించింది. అయితే ఈసీ నిర్ణయంపై కేజ్రీవాల్ గురువారం మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశంలో ఓ మూడు బాటిళ్ల యమునా నది నీటిని ఉంచారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ 'అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బులు వెదజల్లుతున్నాయి. కానీ వాటిని ఈసీఐ గుర్తించడం లేదు. రాజకీయాలు చేయడంలో బిజీగా ఉంది. ఎందుకంటే... కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ త్వరలో పదవీ విరమణ చేయబోతున్నారు. రిటైర్‌మెంట్ తర్వాత రాజకీయాలు చేయానుకుంటున్నారేమో? ఈ సందర్భంగా చరిత్ర ఎప్పటికీ క్షమించదని ఈసీఐకి గుర్తు చేస్తున్నాను. ఎన్నికల కమిషన్‌ను నేను నమ్మను. ఈసీఐ ఎప్పుడో అపఖ్యాతి పాలైంది. త్వరలో అరెస్టు అవ్వొచ్చు. అయినా నేను భయపడను. దేశంలో ఇంతకుముందెన్నడూ ఇలాంటి ఎన్నికలు జరగలేదు. 'అమ్మోనియా స్థాయి 7 పీపీఎం ఉన్న మూడు యమునా నది వాటర్ బాటిళ్లను కేంద్ర ఎన్నికల సంఘానికి, కమిషనర్‌కు పంపుతా. ఆ నీటిని ముగ్గురు ఎన్నికల కమిషనర్లు మీడియా సమావేశంలో తాగాలి. అలా తాగితే మేము మా తప్పును ఒప్పుకుంటాం'అని కేజ్రీవాల్ అన్నారు. కాగా, యమునా నది కాలుష్యం అంశాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని కేజ్రీవాల్‌కు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ తాను ప్రాణాలతో ఉన్నంతవరకు కలుషితమైన యమునా నదిలోని నీటిని ప్రజలను తాగనివ్వనని స్పష్టంచేశారు. యమునా నదిలో నీటిపై తన వ్యాఖ్యల గురించి ప్రస్తావిస్తూ ఈసీ కేజ్రీవాల్‌కు నోటీసులు పంపింది. 'యమునా నది అంశంపై ఎన్నికల సంఘం నాకు పంపిన నోటీసుల్లో ఉపయోగించిన భాష సరిగా లేదు. ఈ అంశంపై నోటీసులు పంపి ఈసీ రాజకీయం చేయడం తగదు. నేను జీవించి ఉన్నంతకాలం దిల్లీ ప్రజలను కలుషితమైన నీటిని తాగనివ్వను' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. నీటి కాలుష్యం సమస్యను నరమేధం, రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని కేజ్రీవాల్‌కు ఈసీ సూచించింది. ఆయా వర్గాల మధ్య శత్రుత్వం పెంచడం, అశాంతిని కలిగించేలా వ్యాఖ్యానించారంటూ ఆయనపై మండిపడింది. ఈ వ్యాఖ్యలు చేసినందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది. ఈ సమస్యను విష ప్రయోగం అనే అంశంతో కలపకుండా... నదిలోని నీటి స్వభావం, పరిణామం, విషపూరితమైన విధానాన్ని గుర్తించే పద్ధతులపై సరైన సాక్ష్యాలు అందించేందుకు మరో అవకాశం కల్పించింది. శుక్రవారం ఉదయం 11 గంటలలోపు దిల్లీ జల్‌బోర్డుకు సాక్ష్యాలు సమర్పించాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది.

హర్యానా సీఎం యమునా నీటిని తాగలేదు

హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ యమునా నీటిని తాగినట్లు నటించారని కేజ్రీవాల్ విమర్శించారు. నోట్లోని నీటిని వెంటనే ఉమ్మేశారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దిల్లీలోకి ప్రవహించే యమునా నదిలో విషపదార్థాలను హర్యానా కలుపుతోందని కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించారు. హర్యానా నుంచి వచ్చే నీటిలో విషపూరిత అమోనియా ఉన్నట్లు తెలిపారు. కేజ్రీవాల్ ఆరోపణలను నయాబ్ సింగ్ సైనీ ఖండించారు. కేజ్రీవాల్ దీనిపై గురువారం స్పందించారు. నయాబ్ సింగ్ సైనీ యమునా నీటిని తాగినట్లు నటించారని, నోటిలోని నీటిని తిరిగి యమునా నదిలోకి ఉమ్మేశారని ఆరోపించారు. అమోనియా కాలుష్యం కారణంగా యమునా నీరు దిల్లీ ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిందన్న తనపై కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని విమర్శించారు. 'తాము తాగలేని అదే విషపూరిత నీటిని దిల్లీ ప్రజలతో తాగించాలని వారు కోరుకుంటున్నారు. నేను ఎప్పటికీ ఇది జరగనివ్వను' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థి పాదాలకు మోదీ నమస్కారం

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆసక్తికర ఘటన చోటు చేసుకొంది. సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ తన వద్దకు వచ్చిన బీజేపీ అభ్యర్థి పాదాలకు నమస్కరించారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై చర్చ జరుగుతోంది. బుధవారం దిల్లీలో బీజేపీ బహిరంగ సభ జరిగింది. దీనికి హాజరైన ప్రధానిని పార్టీ నేతలంతా కలిశారు. వేదికపై ఉన్న మోదీ వద్దకు బీజేపీ అభ్యర్థి రవీందర్ సింగ్ నేగి వచ్చారు. ఆయన పాదాలకు నమస్కారం చేశారు. వెంటనే అతడిని అడ్డుకున్న ప్రధాని... రవీందర్ పాదాలకు మూడుసార్లు నమస్కారం చేశారు. దీంతో అతడు ఎవరనే అంశంపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. రవీందర్ సింగ్ నేగి దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్. పట్‌పర్‌గంజ్‌లోని వినోద్ నగర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్, ఆప్ అభ్యర్థులు అనిల్ కుమార్, అవధ్ ఓజాకు పోటీగా బరిలోకి దిగారు. 2020లో మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియాకు ప్రత్యర్థిగా పోటీ చేసిన రవీందర్ రెండు శాతం ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2022లో జరిగిన దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థిపై రెండు వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు.

కేజ్రీవాల్ చిల్లర రాజకీయాలు: అమిత్ షా

న్యూఢిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకే ఆప్ అధినేత కేజ్రీవాల్ యమునా నదిలో బీజేపీ విషం కలిపిందని ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్‌షా గురువారం ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆప్ పాలనలో యమునా నది కలుషితమైపోయిందని, దిల్లీ ప్రజలతో మురికి నీటిని తాగిస్తోందని అమిత్‌షా విమర్శించారు. దిల్లీ ఎన్నికల్లో ఓడిపోతామని కేజ్రీవాల్ గ్రహించారని, అందుకే చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. దిల్లీలో ఆప్ పాలనను తరిమికొట్టేందుకు ఫిబ్రవరి 5 అనేది ఒక అవకాశమని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ అధికారంలోకి వస్తే దిల్లీని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. యమునా నది నీటిలో బీజేపీ విషం కలిపిందని కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నారని, ఏ ల్యాబ్‌లో పరీక్ష చేయించి ఈ ఆరోపణలు చేస్తున్నారో కేజ్రీవాల్ చెప్పాలని డిమాండ్ చేశారు.

దిల్లీలో గెలుపు మాదే: రాజ్‌నాథ్

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తంచేశారు. దిల్లీ కంటోన్మెంట్‌లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను అమలు చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. దిల్లీలో ఈసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. తమ గెలుపును ఏ పార్టీ అడ్డుకోలేదన్నారు. పదేళ్ల ఆప్ పాలనలో దిల్లీలో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు.

కేజ్రీవాల్ ఇంటి వద్ద స్వాతి మలివాల్ హల్‌చల్

న్యూఢిల్లీ: రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ వినూత్న నిరసనకు దిగారు. దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నివాసం వద్ద చెత్త పోశారు. దిల్లీ అంతా చెత్తమయంగా మారిందని, ఆప్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కేజ్రీవాల్, ఆప్ ప్రభుత్వంపై స్వాతి మలివాల్ ఆరోపణలు గుప్పించారు. 'ఈ నిరసన ఏ పార్టీకి వ్యతిరేకం కాదు. ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా నేడు దారుణమైన స్థితిలో దిల్లీ ఉంది. దిల్లీలోని ప్రతిమూల మురికిగా ఉంది. రోడ్లు నాశనమయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. నగరం మొత్తం చెత్త కుండీగా మారింది. నేను కేజ్రీవాల్‌తో మాట్లాడటానికి ఇక్కడికి వచ్చా. ఆయన గూండాలకు లేదా పోలీసులకు నేను భయపడను' అని అన్నారు. రోడ్డుపై చెత్త కుప్ప పేరుకుపోయినట్లు వికాస్‌పురికి చెందిన మహిళలు తనకు ఫిర్యాదు చేశారని స్వాతి మలివాల్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినప్పటికీ... శుభ్రం చేసేందుకు ఎవరూ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాగా, ఒకప్పుడు కేజ్రీవాల్ ప్రధాన అనుచరురాలిగా ఉన్న స్వాతి మలివాల్... ఆప్ మద్దతుతో రాజ్యసభ ఎంపీ అయ్యారు. ఆ తర్వాత ఆ పార్టీకి, కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా మారారు. గత ఏడాది మేలో కేజ్రీవాల్ ఇంటి వద్ద ఆయన అనుచరుడు దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాటి నుంచి కేజ్రీవాల్, పార్టీ నేతలకు వ్యతిరేకంగా స్వాతి మలివాల్ ఆరోపణలు చేస్తున్నారు.

ఇటు పవిత్ర స్నానాలు... అటు మద్య సేవనం

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లో 144 ఏళ్ల తర్వాత వచ్చిన మహాకుంభమేళా ఇది. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాను అందరూ గొప్పగా భావిస్తున్నారు. ఈ సమయంలో ఒక్కసారైనా త్రివేణి సంగమ జలాల్లో పవిత్ర స్నానం ఆచరించాలని దేశవిదేశాల్లో ఉన్న వృద్ధులు, మహిళలు, సాధువులు తరలివస్తున్నారు. జనాల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భక్తులు బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కిలోమీటర్ల పొడవునా టెంట్లు, తాగునీటి సౌకర్యం, పోర్టబుల్ టాయిలెట్లు వంటివి ఏర్పాటు చేసింది. రోజూ లక్షల మంది జనాభా వస్తున్నా పారిశుధ్యం పరంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటోంది. ఇన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినా కొందరు భక్తులు సంగం నది ఒడ్డున చేయరాని పనులు చేస్తూ కుంభమేళా పవిత్రతను దెబ్బతీస్తున్నారు. మహా కుంభమేళాలో అమృత స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయనే నమ్మకంతో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తున్నారు. ఆ విశ్వాసాన్ని దెబ్బతీసేలా కొందరు భక్తులు సంగం నది ఒడ్డున చేయరాని పనులను చేస్తున్నారు. ఇది కుంభమేళా పవిత్రతకు, విశిష్టతకు భంగం కలిగించేలా వీరు చేస్తున్న అసహ్యకరమైన పనులు చూసి అంతా నివ్వెరపోతున్నారు. కుంభమేళా సమయంలో గంగా నదీ జలాలు అమృతంతో సమానంగా మారతాయని అంటారు. దీనిని ఓ మందుబాబు మరోలా అర్థం చేసుకున్నాడు. చేతిలో బ్రాందీ సీసా, గ్లాసుతో నేరుగా సంగం నది ఒడ్డుకు వెళ్లిపోయాడు. అందరూ చూస్తుండగానే గంగా నదిలోని నీటిని గ్లాసుతో ముంచుకుని బ్రాందీ కలుపుకుని తాగాడు. ఇది చూసిన వారు పవిత్ర స్నానాలు చేసే చోట ఇవేం పనులు... వీళ్లకు బుద్ధి రాదా అని తిట్టి పోస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రాహుల్‌పై పరువునష్టం కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు విచారణ వాయిదా పడింది. ఆయన తరఫు న్యాయవాది అస్వస్థతకు గురికావడంతో ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 11కి వాయిదా వేస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి శుభమ్ వర్మ పేర్కొన్నారు. 2018 కర్నాటక ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నేత పరువు నష్టం కేసు దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరమని, తనకు వ్యక్తిగతంగా హాని కలిగించాయని పేర్కొన్నారు. రాహుల్ కోర్టుకు హాజరుకాకపోవడంతో 2023 డిసెంబర్‌లో ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. 2024 ఫిబ్రవరిలో రాహుల్ కోర్టులో లొంగిపోయారు. అదే ఏడాది జులై 26న కోర్టు ఆయన వాంగ్మూలం రికార్డు చేసింది. రూ.25 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. ఈ కేసు రాజకీయ కుట్రలో భాగమని రాహుల్ గాంధీ వాదిస్తున్న సంగతి తెలిసిందే.

ఉద్యోగాలు మృగ్యం... పెరుగుతున్న అసమానతలు

మోదీ సర్కారు అసమర్థ ఆర్థిక విధానాల ఫలితం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న అసమర్థ ఆర్థికవిధానాల కారణంగా దేశంలో నిరుద్యోగ కల్పన మృగ్యం కావడంతో పాటు ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. కేంద్ర బడ్జెట్‌కు ముందు, కాంగ్రెస్‌పార్టీ గురువారం ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరును దుయ్యబట్టింది. దేశంలో ఆర్థిక వృద్ధి మందగమనంలో ఉందని పేర్కొంది. గత సంవత్సరంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి 2 శాతం వరకు తగ్గవచ్చని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం అన్నారు. గురువారం అక్బర్‌రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మాజీ ఎంపీ రాజీవ్ గౌడ, అతని బృందం రూపొందించిన 'రియల్ స్టేట్ ఆఫ్ ది ఎకానమీ 2025' నివేదికను విడుదల చేసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉంది... దీన్ని ఏమాత్రం తిరస్కరించలేం. గత సంవత్సరం వృద్ధితో పోలిస్తే రెండు శాతం వరకు పడిపోవచ్చు' అని అన్నారు. "ఉద్యోగాలు లేవు. నిరుద్యోగం 40 శాతానికి దగ్గరగా ఉంది. ప్రధానమంత్రి ఎప్పటికప్పుడు ప్రజలకు లేఖలు అందజేస్తున్నప్పటికీ ఉద్యోగాలు లేవు. అది ఖాళీ పోస్టులను భర్తీ చేయడం మాత్రమే. కొత్త ఉద్యోగాల సృష్టి ఎంతమాత్రం లేదు" అని ఆయన అన్నారు. గత నాలుగు-ఐదు సంవత్సరాలుగా వేతనాలు స్తబ్దుగా ఉన్నాయని చిదంబరం అన్నారు. 'ఆహారం, విద్య, ఆరోగ్య సంరక్షణ ద్రవ్యోల్బణం రెండంకెలలో ఉంది. ద్రవ్యోల్బణం 2-3 సంవత్సరాలుగా పెరుగుతోంది' అని చిదంబరం పేర్కొన్నారు. ప్రజల మధ్య భారీ ఆదాయ అసమానత ఉందని పేర్కొంటూ, అగ్ర భాగాన ఉన్న 20-30 శాతం మంది మెరుగ్గా ఉండవచ్చని, కానీ మిగిలిన 70 శాతం మంది, దిగువన ఉన్న సగం మంది రోజుకు రూ. 100-150 తో జీవిస్తున్నారనేదానితో తాను ఏకీభవిస్తానని చిదంబరం అన్నారు. భారీ అసమానతలు ఉన్నాయి. ధనిక మరియు పేదల మధ్య అంతరం పెరుగుతోంది. దీనిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఏమీ చేయలేదని ఆయన అన్నారు. పార్టీ విడుదల చేసిన నివేదికలో పేర్కొన్న అనేక వాస్తవాలను కేంద్ర ప్రభుత్వం దాచిపెట్టిందని చిదంబరం అన్నారు. ఆర్థిక వ్యవస్థ యొక్క అవాస్తవ స్థితిని ప్రభుత్వం ప్రతిరోజూ, ప్రతి గంటకు ముందుకు తెస్తున్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థ యొక్క వాస్తవ స్థితిపై నివేదికను సమర్పించాలని ప్రొఫెసర్ రాజీవ్ గౌడ బృందం నిర్ణయించిందని ఆయన అన్నారు.

తమిళ జాలర్ల విడుదల

చెన్నై: శ్రీలంక జైలు నుండి విడుదలైన ఆరుగురు మత్స్యకారులు తమిళనాడు చేరుకున్నారు. మత్స్యకారులు తమిళనాడులోని రామేశ్వరానికి చేరుకున్నా రని చెన్నై విమానాశ్రయ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యంతో వారు విడుదలయ్యారని పేర్కొన్నారు. ఆరుగురు మత్స్యకారులతో కొలంబొ నుండి బయలుదేరిన విమానం బుధవారం రాత్రి చెన్నై విమానాశ్రయానికి చేరిందని ఆ ప్రకటనలో తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం స్వాగతం పలికిందని అన్నారు. రోడ్డు మార్గంలో వారు సొంత జిల్లాకు చేరుకునే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈనెల 12న చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులను సరిహద్దు దాటడంతో శ్రీలంక కోస్ట్‌గార్డులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వారి నౌకను కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచడంతో రిమాండ్‌కు తరలించారు. అరెస్టయిన మత్స్యకారులను విడుదల చేయడంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరుతూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు లేఖ రాశారు.

చండీగఢ్ మేయర్ పీఠం బీజేపీ వశం

చండీగఢ్: చండీగఢ్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. తనకు పూర్తిబలం లేకపోయినా... ఇతర పార్టీల కార్పొరేటర్లను తమవైపునకు తిప్పుకొని...అనైతికంగా మేయర్ కుర్చీని అక్రమించింది. నూతన మేయర్‌గా బీజేపీ అభ్యర్థి హర్‌ప్రీత్ కౌర్ బబ్లా ఎన్నికయ్యారు. ఆప్-కాంగ్రెస్ కూటమి అభ్యర్థి ప్రేమలతపై ఆమె విజయం సాధించారు. హర్‌ప్రీత్ కౌర్ బబ్లాకు 19 ఓట్లు రాగా, ప్రేమలతకు 17 ఓట్లు వచ్చాయి. రెండు ఓట్ల తేడాతో బబ్లా విజయాన్ని నమోదు చేశారు. వాస్తవానికి కార్పొరేషన్‌లో ఆప్‌కు 13 మంది, కాంగ్రెస్‌కు ఆరుగురు సభ్యుల బలం ఉంది. బీజేపీకి 16 మంది సభ్యులు, ఒక ఎంపీ ఉన్నారు. అయితే ఆప్-కాంగ్రెస్ కూటమి నుంచి ఇద్దరు బీజేపీకి ఓటు వేయడంతో బబ్లా విజయం సాధించారు.

జాతిపితకు ఘన నివాళి

న్యూఢిల్లీ : జాతిపిత, స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మాగాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం దిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా అనేకమంది కేంద్రమంత్రులు, ఆర్మీ, నేవీ, వైమానిక దళ అధిపతులు మహాత్మునికి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖడ్గే, కాంగ్రెస్ నాయకులు బాపూజీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... "పూజ్య బాపు పుణ్య తిథి సందర్భంగా ఆయనకు నివాళులు. ఆయన ఆదర్శాలు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి మనల్ని ప్రేరేపిస్తాయి. మన దేశం కోసం అమరులైన వారందరికీ నేను నివాళులు అర్పిస్తున్నాను. వారి సేవ త్యాగాలను గుర్తుచేసుకుంటున్నాను." అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని, దేశ స్వాతంత్ర్యానికి ఆయన చేసిన కృషిని గౌరవించుకుంటూ... భారతదేశం ప్రతి సంవత్సరం జనవరి 30న అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

మహాత్మా గాంధీకి ఘన నివాళి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కమీషనర్ ఇలంబర్తి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అహింసా మార్గంలో భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపించి దేశానికి స్వేచ్ఛను అందించిన మహాత్మా గాంధీ ఆదర్శాలను అందరూ పాటించాలన్నారు. ఆయన బోధనలు సమాజ సమతుల్యతకు మార్గదర్శకం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని గాంధీజీ ఆశయాలను స్మరించుకున్నారు.

మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దాం : కాంగ్రెస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మాగాంధీజీ అడుగు జాడల్లో నడుద్దామని డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్ అన్నారు. మహాత్ముడి వర్ధంతిని పురస్కరించుకొని మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం అశోక్ టాకీస్ చౌరస్తాలో గురువారం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహింస ఆయుధంగా సత్యం, ధర్మం, సైన్యంగా స్వాతంత్ర పోరాటానికి దిక్సూచి మహాత్ముడు అని అన్నారు. గాంధీజీ జీవనమే జాతికి సందేశమని అన్నారు. ఈ ప్రజాప్రభుత్వం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రతి పేదవాడి పెదాలపైన చిరునవ్వు చూడాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మూడా చైర్మెన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మీడియాసెల్ కన్వీనర్ సిజే బెనహర్, నాయకులు షబ్బీర్, ఫయాజ్, సాయిబాబా, అజ్మత్ అలీ, నాగరాజు, రాములు యాదవ్, అవేజ్, ఫహీం, ఫక్రు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆశా వర్కర్స్ కు ఫిక్స్ వేతనం రూ.18 వేల ఇవ్వాలని సీఐటీయు మల్కాజిగిరి నియోజకవర్గం ఆశ వర్కర్స్ యూనియన్ సమావేశం గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్‌లో రాణి అధ్యక్షతన జరిగింది. రాబోయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ సమావేశంలో ఆశా వర్కర్స్‌కు జీతాల పెంపుకు ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన కోసం సరిపడ నిధులు కేటాయించాలని సిఐటీయు జిల్లా నాయకులు మల్కాజిగిరి మండల కార్యదర్శి బి.నర్సింగ రావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం పోరాటం నిర్వహిస్తుందని ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇచ్చే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తామన్నారు. ఈ బడ్జెట్ సమావేశంలోనే ఆరోగ్య రంగానికి అధిక నిధులు కేటాంచలన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హేమలత మాట్లాడుతూ ఆశ వర్కర్స్ టార్గెట్ లేదని గతంలో హెల్త్ సెక్రటరీ చెప్పారని గుర్తు చేశారు. పారితోషకాలు లేని పనులను ఆశాలతో చేయించకూడదన్నారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ వసంత, సుమలత, హేమలత, రాణి, రాజ్యలక్ష్మి, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ ఫరుక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి సభా ప్రాంగణం తదితర వేదిక ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 15వ వార్షికోత్సవానికి వస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల కోసం అన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే శంకర్ తదితర అధికారులతో పాటు సభకు వచ్చే పూర్వ విద్యార్థులు ప్రజలు నాయకులు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎవరికీ ఏ ఇబ్బంది రాకుండా కార్యక్రమం విజయవంతం చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 420 హామీలపై గాంధీ విగ్రహానికి వినతిపత్రం

విశాలాంధ్ర - మేడిపల్లి: ఓ మహాత్మ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచి ఆలోచన ప్రసాదించి వారిచ్చిన 420 హామీలను వెంటనే నెరవేర్చే విధంగా బుద్ధి ప్రసాదించాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం నగర పరిధిలో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి నేటికి 420 రోజులు అయిన సందర్భంగా ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, నిర్మల, ప్రభు, ఆంజనేయులు, బాలరాజు, యాసారం శ్రీనివాస్, కర్రె కుమార్, వెంకన్న,శంకర్, కిరణ్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ బడ్జెట్ రూ.8,440 కోట్లు

2025-26 వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ 10వ సాధారణ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశంలో ముందుగా దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకు ముందు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశం ప్రారంభం కాగానే బిఆర్ఎస్ సభ్యులు సిఎం రేవంత్ రెడ్డి ప్లకార్డులు ప్రదర్శిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ప్లకార్డులు లాక్కుని చించివేశారు. ఈ క్రమంలో కొద్ది నిమిషాలు సభను వాయిదా వేశారు. తిరిగి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ అంచనా బడ్జెట్ రూ. 8,440 కోట్లకు ఆమోదించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 8,118 కోట్లతో రివైజ్డ్ బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. బడ్జెట్ ఆమోదించిన తర్వాత ప్రజా సమస్యలపై చర్చించుకుందామని మేయర్ అన్ని పార్టీల కార్పొరేటర్లకు సూచించారు. అయినప్పటికి బీఆర్ఎస్ సభ్యులు నిరసన దోరణిని ప్రదర్శిస్తుండడం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటున్న క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు కార్పొరేటర్లను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. బయటికి పంపిణి కార్పొరేటర్లను లోనికి అనుమతించాలని బిఆర్ఎస్ సభ్యులు కోరడంతో మేయర్ సమ్మతించారు. అయినా వారు రాకపోవడంతో మిగిలి బిఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసనలు ఆపకపోవడంతో సభ జరగకుండా అడ్డుకున్న బీ.ఆర్.ఎస్ సభ్యులను మేయర్ జీహెచ్ఎంసీ సెక్షన్ 89/1 ప్రకారం మార్షల్స్‌తో బీ.ఆర్.ఎస్ సభ్యులను బయటకు పంపించారు. సభ ప్రారంభానికి ముందు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ జీహెచ్ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివృద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తూ బల్దీయా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు. అందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నగర అభివృద్ధిపై దృష్టి సారిస్తూ, నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించాలని కోరారు. ప్రధానంగా శానిటేషన్ నిర్వహణ, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు, నగర శివారు ప్రాంతాల అభివృద్ధి పై చర్యలు తీసుకోవాలని, జీహెచ్ఎంసీకి అధిక ఆదాయ వనరులు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్పొరేటర్లు కోరారు. నగరంలోని పలు కార్పొరేట్ పాఠశాలలు ట్యాక్స్ కట్టడంలేదని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి ట్యాక్స్ రికవరీ చేయాలని సూచించారు. క్షేత్ర పరిధిలో పనులు జరిగేలా అధికారుల సేవలను వినియోగించాలని కోరారు. కమీషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ నగరంలోని పార్కులు, క్రీడా మైదానాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడా మైదానాలలో అవసరమైన ఆయా వసతులను సమకూర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఆయా వసతులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. స్ట్రీట్ లైట్లకు సంబంధించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని, లైటింగ్‌కు సంబంధించిన కాంట్రాక్టర్లను నియమించామని, త్వరితగతిన పూర్తి చేస్తారని తెలిపారు. ఎంపీ, ఎక్స్ అఫిషియో మెంబర్ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ పాలక మండలిపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండేలా పనిచేయాలని సూచించారు. నగర ప్రజల సమస్యల పరిష్కారంలో అందరూ సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, నగరంలో సౌకర్యాలకు నోచుకొని ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ్ చౌహాన్, ఉపేందర్ రెడ్డి, రవి కిరణ్, అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, గీత రాధిక, పంకజ, నళిని పద్మావతి, యాదగిరి రావు, సుభద్రాదేవి, సెక్రటరీ సత్యనారాయణ, ఈఎన్‌సి భాస్కర్ రెడ్డి, సిసిపి శ్రీనివాస్, ఆయా ఉన్నతాధికారులు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి : సీపీఐ

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా సికింద్రబాద్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో విద్యావంతులు, పట్టణ ప్రాంతాలకు పరిమితమైనటువంటి ఉద్యమాన్ని గాంధీ చేరిన తర్వాత సాధారణ ప్రజలను ఉద్యమంలోకి తీసుకువచ్చి ఒక మాస్ లీడర్‌గా ఉద్యమాన్ని నడిపాడు. అన్ని వర్గాల ప్రజలను ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకువెళ్లి దేశానికి బ్రిటిష్ వారు నుండి విముక్తి చేయడంలో గాంధీ పాత్ర మరువలేనిదనీ అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం గాంధీని చంపిన గాడ్సేను పేరును పాఠ్యాంశం నుంచి తొలగించడం అంటేనే ఈ దేశ పౌరులకు వాస్తవ చరిత్రను చెప్పకుండా చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తున్నారు. గాడ్సేను ఆరాధిస్తూ, కీర్తిస్తూ, పెద్ద ఎత్తున ఒక దేశభక్తునిగా ప్రచారం చేస్తూ గాంధీ పట్ల తీవ్రమైన అసూయను, వ్యతిరేకతను, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న శక్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. దేశ విభజన సమయంలో మత ఘర్షణలను నివారించడానికి గాంధీ చేసిన ప్రయత్నాలు నచ్చని దుర్మార్గపు శక్తులు అత్యంత దారుణంగా హత్య చేసిన విషయాలని ప్రజలు మర్చిపోరు. ఇప్పటికీ మతం పేరుతో ప్రజలను విభజించి రాజకీయాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొమురెల్లి బాబు, చెట్టు కింది శ్రీనివాస్, కళ్యాణ్, అనిల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర - హనుమకొండ : వరంగల్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్.బీ.సాంబశివరావు వైద్య శిబిరం గురించి ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపిల్లలలో వచ్చు గుండె సంబంధిత వ్యాధులను (డి.ఈ.ఐ.సి)- డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ద్వారా ముందుగానే గుర్తించి వారికి సంబంధించిన గుండె పరీక్షలు గాని, ఆపరేషన్ గాని, మేల్కొని చేయించినచో వారి భవిష్యత్తులో మంచి బాటలు వేసిన వారమవుతామని తెలిపినారు. హైదరాబాద్ అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారి ఆధ్వర్యంలో డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లో గుండె వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. చిన్న పిల్లలు వయసు సుమారు పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలందరికీ గుండె వైద్య శిబిరం నిర్వహించినారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి 218 మంది పిల్లలకు గుండె సంబంధిత వ్యాధులకు వైద్యులు పరీక్షలు చేశారు. ఇందులో చాలా మంది పిల్లలకు 2డి కో పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో చిన్నారులకు గుండె సంబంధిత ఆపరేషన్ చేయుటకు సూచనలను అక్కడికి వచ్చిన వారికి తెలియజేశారు. హైదరాబాదులోని అపోలో హాస్పిటల్ నందు ఆపరేషన్లు సాధ్యమైనంత త్వరలో నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డాక్టర్ సాంబమూర్తి డాక్టర్ ఉమామహేశ్వరి డాక్టర్ శ్రీరామ్ డాక్టర్ తమాసి మేనేజర్ అభిషేక్, ఎంజీఎం సూపరిండెంట్, డాక్టర్ మురళి, డిస్టిక్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డీ.ఐ.ఓ.) డాక్టర్.ఐ.ప్రకాష్ ఎంజీఎం ఆర్.ఎం.వో. డాక్టర్ అంబి శ్రీనివాస్, డాక్టర్ రవీందర్, డాక్టర్.సుమన్, డాక్టర్ శ్రీనివాస్, డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ సిబ్బంది పీడియాట్రిషన్ మంజుల నాయక్, డెంటల్ సర్జన్ డాక్టర్ శ్రీలక్ష్మి, డెంటల్ టెక్నీషియన్ నూర సంపత్ కుమార్, డైక్ మేనేజర్ అనిల్ కుమార్, ఫిజియోథెరపిస్ట్ పవన్ కుమార్, సైకాలజిస్ట్ ప్రశాంత్, ఆడియాలజిస్ట్ వనజ, ల్యాబ్ టెక్నీషియన్ మాధవి, నర్సింగ్ ఆఫీసర్ హేమ, సోషల్ వర్కర్ లావణ్య, స్పెషల్ఎడ్యుకేటర్ రమేష్ పాల్గొన్నారు

డీఎస్సీ 2024 ఎస్జీటీ స్పోర్ట్స్ కోటా పోస్టుల్లో

అవకతవకలపై విచారణ జరపాలి

విశాలాంధ్ర - హనుమకొండ : డీఎస్సీ 2024 ఎస్జీటీ స్పోర్ట్స్ కోటా పోస్టులలో జరిగిన అవకతవ కలపై విచారణ జరపాలని, స్పోర్ట్స్ కోటాలో అర్హత పొందిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యం లో ఎల్బీ స్టేడియం వద్ద ఉన్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయం ముందు అభ్యర్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ నియామకాలకు శ్రీకారం చుట్టిందని, ముఖ్యంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను పూర్తి చేశామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ రిక్రూట్మెంట్లో కొన్ని అవకతవకలు జరిగాయని వారు ఆరోపించారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన ఫామ్ 2 కండిషన్‌ను అడ్డుపెట్టుకొని కొందరు అక్రమార్కులు పంతుళ్ల పోస్టులను అమ్ముకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులకు డీఎస్సీ స్పోర్ట్స్ కోటా రిక్రూట్మెంట్లో ఉద్యోగాలు రాకపోవడంతో కొందరు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారని, న్యాయస్థానాలు ఈ ఆరోపణలపై డీఎస్సీ బోర్డును ప్రశ్నించడంతో పాటు ప్రభుత్వం వెంటనే వీటిపై నిగ్గు తేల్చాలని ఆదేశాలిచ్చినా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో స్పోర్ట్స్ కోటా రిక్రూట్మెంట్పై రీవెరిఫికేషన్ చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారని, స్పోర్ట్స్ కోటా ఎస్జీటీ టీచర్ పోస్టుల నియామకాలను రీవెరిఫికేషన్ చేయాలంటూ ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారన్నారు. రీవెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా ఆ లిస్టును స్పోర్ట్స్ అథారిటీ అధికారులు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులకు అందించకపోవడం వెనక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని స్పోర్ట్స్ కోటా రిక్రూట్మెంట్ లో జరిగిన అక్రమాలను వెలికితీసి అర్హులకు ఉద్యోగాలివ్వకుండా డబ్బులు దండుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగం పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధు, పి.శివకుమార్, కార్యవర్గ సభ్యులు కళ్యాణ్, అనీల్ కుమార్, హేమంత్ కుమార్, అరుణ్ అభ్యర్థులు రాజేష్, హరికృష్ణ వెంకటేష్, స్వామి, అనిరుధ్, కిరణ్, ప్రదీప్, నరహరి, విజయ్, ఉమ, జరీనా, హరీష్ పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఉద్యోగులు, కార్యదర్శి జి.రవి ఉద్యోగులు సిబ్బంది సమావేశమై వీర అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం.

రంగారెడ్డి జిల్లా ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ క్యాలెండర్‌ను కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గురువారం ఆవిష్కరిస్తున్న దృశ్యం

జర్నలిజం వృత్తిని అపవిత్రం చేస్తే ఊరుకునేది లేదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజ జ్ఞానం, జర్నలిజం విలువల పట్ల అవగాహనా లేకుండా, జర్నలిస్టుల పేరుతో సంచరిస్తూ, దోపిడికి పాల్పడుతూ పవిత్రమైన జర్నలిజం వృత్తికి మచ్చ తెస్తున్న నకిలీ ముఠాలకు తగినరీతిలో బుద్ధి చెప్పక తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ హెచ్చరించారు. గురువారం నాడు స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన గజ్వేల్ నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశం, యూనియన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల కాలంలో జర్నలిస్టుల పేరుతో కొన్ని అసాంఘిక శక్తుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, ప్రజలను, అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ముఠాల కదలికలపై తమ సంఘం కన్నేసి పెట్టిందని, చట్టపరంగా వారికి శిక్ష పడేలా చర్యలు చేపడుతున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేశారు. సుదీర్ఘ సామాజిక చరిత్ర కలిగి ఉన్న గజ్వేల్ ప్రెస్ క్లబ్ ను స్థాపించి 25యేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా రజతోత్సవాలు జరిపేందుకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే అవిశ్రాంతంగా కృషి చేస్తుందన్నారు. ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఇండ్లు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల మంజూరీ తదితర సంక్షేమ చర్యల అమలు కోసం ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. యూనియన్ నాయకులు సురేందర్, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, జగదీశ్, కిరణ్, మునీర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గురుమూర్తిని వెంటనే ఉరితీయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళను అతి కిరాతకంగా ముక్కలు ముక్కలుగా నరికి చంపిన గురుమూర్తిని వెంటనే ఉరితీయాలని భారత మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. ఎన్ ఎఫ్ ఐడబ్ల్యూ మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండికంటి పద్మావతి మాట్లాడుతూ కట్టుకున్న భార్యని క్రూరంగ కొట్టి ఆమె శరీర భాగాలని మొక్కలుగా నరికి ఉడకబెట్టి దంచి పొడిచేసి చెరువులో కలిపడం అతనిలోని పైశాచికత్వాని భయటపెదుతుందన్నారు. మరో ఘటనలో కాప్రా పరిధిలోని నిండుచూలాలు స్నేహ అనే అమ్మాయిని సచిన్ సత్య నారాయణ అనే అతను హత్య చేశాడని తెలిపారు. ఇంస్టాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకుని ఆమె నిండు గర్భిణీగా ఉన్న ఆమెపై అనుమానంతో కడుపుపై కూర్చోవడంతో ఊపి రాడకుండా చేస్తే కడుపులో పిండంతో పాటు స్నేహ కూడా చనిపోయిందన్నారు. మహిళా చట్టాలని పటిష్టంగా అమలు చేయాలి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా గురుమూర్తి అనే వ్యక్తిని వెంటనే ఉరితీయాలన్నారు. భారత మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కే.పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు భార్గవి, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అల్వాల్ రెడ్డి, భీమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొండపల్లి రాము, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా కమిటీ సభ్యులు ఇందిరమ్మ, మాధవి, ఇందిర, సత్యమ్మ, కొలిమి పద్మ, వరలక్ష్మి, చెన్నమ్మ, పార్వతమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

వైద్య సేవలు అంతంత మాత్రమే..!

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని పలువురు పేర్కొంటు న్నారు. సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారని, డాక్టర్లు అందు బాటులో ఉండని పరిస్థితి నెలకొంటుందని పలువురు రోగులు పేర్కొంటున్నారు. ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించ డంలో మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు విఫలమవుతు న్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇందులోనే ఉన్న వినాయకనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైతం సిబ్బంది లేకపోవడం గమనార్హం. మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సైతం సమయ పాలన పాటించక తమ ఇష్టానుసారంగా వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల రోగులు ఎవరు చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో రోగులు అయోమయానికి లోనవుతున్నారు. అంతేకాక గర్భిణీలకు పరీక్ష నిర్వహించే ఫెటల్ డాప్లర్ లాంటి పరికరాల సైతం అందుబాటులో లేవని తెలుస్తోంది. వీటిని సమకూర్చాల్సిన అధికారి పట్టించుకోకపోవడం వల్ల గర్భిణీలకు చేయాల్సిన పరీక్షలు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక ఇదే ఆసుపత్రిలో పని చేస్తున్నటువంటి సిబ్బందికి ఏవైనా అవస రాలు ఉన్నా కూడా స్థానిక వైద్యాధికారి పట్టించుకోకపోవడం పట్ల పలువురు సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంబంధిత విషయాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రోగులకు, సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన కేఫ్ షాపును ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్ నగర్ కాలనీలోని కార్నర్ కేఫ్ షాపును ముఖ్య అతిథిగా కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కార్నర్ కేఫ్ యాజమాన్యం ఏండి నవాజ్, మొహ్మద్ సలాఉద్దీన్‌కు కార్పొరేటర్ హమీద్ పటేల్ శుభాభినందనలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మి, షేక్ ఇమామ్, అజ్జు భాయ్, సంజు, కొండాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అబ్దుల్ వసీమ్, షాబుద్దీన్, అఫ్రోజ్, హనీఫ్ మాము, హనీఫ్, షఫీ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కోసం గొంతెత్తి మాట్లాడండి : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జనవరి 31 నుంచి జరిగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతెత్తి ఎక్కువగా నిధులు తేవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఎంపీలకు పిలుపునిచ్చారు. అందుకు ఈ సెషన్ పూర్తిగా వ్యూహాత్మకంగా తెలంగాణా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉపయోగించలానీ విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టేందుకు పోరాటం చేయాలని, ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, త్రిబుల్ ఆర్ రోడ్ పనులు, నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా, తదితర పనులు వెంటనే చేపట్టేందుకు ఎంపీలు కృషి చేయాలని ఆయన అన్నారు.

గోవర్ధనగిరి ఘటనపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మృతి చెందడం పట్ల మంత్రి సీతక్క తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు. ఘటన వార్త తెలిసిన వెంటనే జిల్లా డీఆర్డీఓ ను ఘటన స్థలానికి పంపించారు. జరిగిన ప్రమాదం పై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడిన సీతక్క వివరాలు తెప్పించుకున్నారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ఆ ప్రాంతంలో పనులు చేయొద్దని జిల్లా అధికారులు వారం రోజుల క్రితమే హెచ్చరించినా పనులు కొనసాగడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసారు. ఘటనపై శాఖ అధికారులతో సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మరణించిన, గాయపడిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని గ్రామీణాభివృద్ది శాఖ అధికారులను ఆదేశించారు.

అభివృద్ధిపై ప్రణాళికతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందని శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, జీహెచ్ఎంసి మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ సంవత్సరపు జిహెచ్ఎంసి నిధులు అని శాఖల సమన్వయంతో పనులు చేపట్టాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం ఏనుముల రేవంత్ రెడ్డికి,(గేటర్ హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి,రంగారెడ్డి జిల్లా మంత్రి దుద్దిల శ్రీధర్ బాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గురువారం ప్రవేశపెట్టిన గ్రేటర్ హైదరాబాద్ బడ్జెట్ సమావేశంలో నిధుల కేటాయింపుపై ప్రతి అంశంపై క్లుప్తంగా మాట్లాడి శేరిలింగంపల్లి అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని నగర మేయర్‌ని ఆయన కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నెలకొనే డ్రైనేజ మరియు మంచినీటి సమస్య పరిష్కారానికి, సీసీ రోడ్డు మరియు ఇతర మౌళికవసతుల సమస్యలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

వేగవంతంగా రోడ్డు నిర్మాణ పనులు

విశాలాంధ్ర- కొత్తూరు: ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన అభివృద్ధికి నోచుకోని జేపీ దర్గా పాత రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎవరికి ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. దీంతో గురువారం కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కొత్తూరు పట్టణ కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టడంలో బిఆర్ఎస్ పాలకులు ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ఈ పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో కూడిన రోడ్డును నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే మాటలు కాదు చేతల ప్రభుత్వమని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వారు తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్, నాయకులు దేవేందర్ ముదిరాజ్, జగన్, సురేందర్, చిల్కమారి నరసింహ, జనార్ధన్ చారి, మేదరి శీను, తేజేశ్వర్, అంజి నాయక్, శివ శంకర్ గౌడ్, శివ, అరవింద్, హసేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఎంపీ రఘువీర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే పెద్దగట్టు(గొల్లగట్టు) జాతరకు భారీగా నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విన్నవించారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 16 నుంచి పెద్దగట్టు జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లకు కావాల్సిన నిధుల ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జాతరకు దేశవ్యాప్తంగా భారీగా భక్తజనం తరలిరానున్న నేపథ్యంలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయనున్నారు. గత ప్రభుత్వాల హయాంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ ఈసారి శాశ్వత ప్రాతిపదికన పనులు చేయాలని సూచించారు. అవసరమైన చోట సీసీ రోడ్లు వేయాలని తెలిపారు. ఎంపీ రఘువీర్ రెడ్డి కి యాదవ సంఘం నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గొని రాజారామ్ రమేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పెద్దగట్టు జాతరకు సౌకర్యాలు కల్పించేలా నిధులు విడుదల చేయాలని ఎంపీ గారిని కోరుతూ వినతి పత్రం సమర్పించడంతో వెంటనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పెద్దగట్టు జాతర కు నిధులు విడుదల చేయాలని కోరారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అధికారులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.

పాఠశాలలో ఏఐ ఆధారిత డిజిటల్ విద్య

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ను పూర్తి స్థాయిలో ఉపయోగించడం ద్వారా రాష్ట్రంలో పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో పాఠశాల విద్యను మరింత నాణ్యతా ప్రమాణాలతో అందించ డానికి గాను ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (ఏ.ఐ), డిజిటల్ ఇనీషియేటివ్స్‌లను పాఠశాల విద్య శాఖ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. విద్యార్థులలో మరింత మెరుగైన అభ్యాస పద్ధతులను, సాంకేతిక ప్రమాణాలను పెంపొందించడం లాంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశ పెట్టనున్నారు. దీనిలో భాగంగా, బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎక్ స్టెప్ -ఫౌండేషన్‌ను రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి డా.యోగితా రాణా నేతృత్వంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో రాష్ట్ర ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ కమీషనర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహా రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ తదితరులున్నారు. విద్యా రంగంలో డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులలో విద్యా పరమైన నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంలో ఎక్ స్టెప్- ఫౌండేషన్ అగ్రగామిగా ఉంది. ఎక్ స్టెప్- ఫౌండేషన్ - విజనరీ టెక్నోక్రాట్, ఫిలాంత్రపిస్ట్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ అయినా నందన్ నీలేకని ఈ ఎక్ స్టెప్- ఫౌండేషన్ కు కో-ఫౌండర్ గానూ ఉన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాల్లో డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టి మరింత మెరుగైన సేవలను అందించడానికి ఈ ఎక్ స్టెప్- ఫౌండేషన్ ప్రారంభించారు. ఈ ఫౌండేషన్ ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, ఒడిస్సా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పనిచేస్తోంది. గురువారం బెంగుళూర్ లో ఎక్ స్టెప్- ఫౌండేషన్ ప్రతినిధులతో కలసి తెలంగాణా విద్యా శాఖ ప్రతినిధి బృందం విద్యారంగంలో చేపట్టాల్సిన పలు ఇన్నియేటివ్ లపై చర్చించింది. అందులో భాగంగా ఫౌండషనల్ లిటరసీ, న్యూమెరసీ ప్రాథమిక విద్యా స్థాయిలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఆధారిత డిజిటల్ పద్ధతుల ద్వారా ప్రాథమిక స్థాయిలో రాయడం, చదవడం, సంఖ్యా పరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎక్ స్టెప్ -ఫౌండేషన్ ను సందర్శించిన, రాష్ట్ర విద్యా శాఖ ప్రతినిధి బృందం 2024 లో కేరళ రాష్ట్రాన్నిసందర్శించి అక్కడి విద్యా రంగంలో చేపట్టిన ఆధునిక పద్ధతులను పరిశీలించింది. డిజిటల్ ఇనీటిటివ్స్, ప్రాథమిక స్థాయిలో అభ్యసన నైపుణ్యాల పెంపు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్నేహపూర్వక అభ్యసన పద్ధతుల్లో సహాయం అందించడం రంగాల్లో ఈ ప్రణాళిక ను రూపొందిస్తున్నారు.

స్నేహ చికెన్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ భూ కబ్జాలు, జల దోపిడీతో దౌర్జన్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న స్నేహ చికెన్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో కొన్నేళ్ల క్రితమే స్నేహా చికెన్ ఫ్యాక్టరీ పరిశ్రమను స్థాపించారని, చిన్నగా ప్రారంభమైన ఈ కంపెనీ ఇప్పుడు తన పరిధిని విస్తృతం చేసుకున్నదన్నారు. పెద్దమందడి మండలం వెల్టూరు శివారులోని 22/1లో ప్రభుత్వ భూమిని స్నేహ చికెన్ పరిశ్రమ ఆక్రమించి, అక్కడ కొన్ని నిర్మాణాలు కూడా చేపట్టిందని గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు సర్వే నిర్వహించి రికార్డులు పరిశీలించిన తర్వాత వెల్టూరు శివారులోని సర్వే నెంబర్ 22/1లో 1.25 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని నిర్ధారించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఎందుకు తొలగించకూడదో.. వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసి 10 నెలలు గడుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను నిలదీయగా మళ్ళీ సర్వే నిర్వహించిన పెద్దమందడి రెవెన్యూ అధికారులు ఎలాంటి ఆక్రమణ జరగలేదని రిపోర్టు ఇవ్వటం చూస్తుంటే భారీగా ముడుపులు తీసుకుని పరిశ్రమకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు తేటతెల్లమైందన్నారు. బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న గౌడ్, దేవర శివ, రామన్ గౌడ్, గౌతమ్ శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభివృద్ధిని చూసి వోర్వలేకనే ఆరోపణలు

విశాలాంధ్ర- కొత్తూరు: గతంలో ఎన్నడూ లేనివిధంగా షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే ఆయనపై ఆరోపణలు చేస్తున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి పై కొత్తూరు మండల కాంగ్రెస్ నాయకులు కన్నెర్ర చేశారు. షాద్నగర్ పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను స్పందించిన కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తన సొంత మండలమైన నందిగామకే రూపాయి ఇవ్వని నవీన్ కుమార్ రెడ్డి మొగిలిగిద్ద, చించోడు గ్రామాలను మండలాలుగా ప్రకటిస్తే రెండు కోట్లు ఇస్తానని చెప్పడం విడ్డూరంగ ఉందని విమర్శిం చారు. మొగలిగిద్దాలో పాఠశాల వార్షికోత్సవం, పలు అభివృద్ధి కార్యక్ర మాల్లో పాల్గొనేందుకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటానని చెబుతున్నారు కానీ అలా జరిగినట్టయితే నవీన్ రెడ్డితో పాటు బిఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటే ఏందో చూపిస్తామని, అంతేకాకుండా మేము తెలుసుకుంటే బయట తిరగడం కూడా కష్టంగా మారుతుందని వారు హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొంగోళ్ల హరినాథ్ రెడ్డి, కొత్తూరు మున్సిపాలిటి పట్టణ అధ్యక్షులు జే సుదర్శన్ గౌడ్, నాయకులు దేవేందర్ ముదిరాజ్, సురేందర్, చిల్కమారి నరసింహ, జనార్దన్ చారి, శివశంకర్ గౌడ్ పాల్గొన్నారు.

షకీల్‌హసన్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పెట్లబుర్జు, అసిస్టెంట్ డైరెక్టర్ షకీల్ హసన్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని బిజెపి నగర కార్యవర్గ సభ్యులు డా. రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులు, డాక్టర్లు, అడ్మిన్ విభాగంలో పనిచేసే మహిళ ఉద్యోగులపై లైంగిక వేధిస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకుంటుందా లేక నిమ్మకు నీరు ఎత్తినట్టు ఉంటుందా చూడాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమవడం సిగ్గుచేటు అన్నారు.

సచివాలయంలో నకిలీ ఉద్యోగి అరెస్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సెక్రటేరియట్ లో నకిలీ ఉద్యోగి ఉదంతం వెలుగుచూసింది. ఖమ్మంకు చెందిన భాస్కర్ రావు ప్రాజెక్ట్ శాఖలో ఉద్యోగిగా ఫేక్ ఐడీ కార్డుతో చలామణి అవుతున్న వైనాన్ని సెక్రటేరియట్ భద్రతా విభాగం ఎస్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. నకిలీ ఉద్యోగి కదలికలు అనుమానంగా ఉండటంతో సెక్రటేరియట్ సీఎస్ఓ దేవిదాస్ కారణంగా ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ నిఘా పెట్టింది. పూర్తి ఆధారాలు సేకరించాక ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ యూసుఫ్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు నకిలీ ఉద్యోగి భాస్కర్ రావును చాకచక్యంగా పట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిన్న సచివాలయంలో ప్రెస్ మీట్ పెట్టిన రోజునే భాస్కర్ రావును ఎస్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. భాస్కర్ రావుకు మైనార్టీ డిపార్ట్మెంట్ సెక్షన్ ఆఫీసర్ వి. ప్రశాంత్ కారు డ్రైవర్ రవి ఫేక్ ఐడీ కార్డు తయారు చేసినట్లుగా ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ గుర్తించింది.ఆ శాఖ జూనియర్ అసిస్టెంట్ గా ఫేక్ ఐడీ కార్డుతో చలామణి భాస్కర్ రావుతో పాటు అతనికి సహకరించిన డ్రైవర్ రవిని ఇంటెలిజెన్స్ ఫిర్యాదుతో సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి ఏ1గా భాస్కర్ రావు..ఏ2 గా డ్రైవర్ రవిపై ఎఫ్ ఐఆర్ చేశారు. నిందితులు ఇద్దరు సెక్రటేరియట్‌లో కీలక మంత్రుల పేర్లు చెప్పి పనులు చేయిస్తాం, ఫైల్ క్లియర్ చేయిస్తాం, ఉద్యోగాలు ఇప్పిస్తామని పెద్ద మొత్తంలో డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు నిందితులు ఏమేమి అక్రమాలు చేశారన్న వివరాలతో పాటు ఎవరికైనా ఫేక్ ఐడీ చూపించి ఆర్థికంగా మోసం చేశారా అన్న వివరాలపై విచారిస్తున్నారు. అలాగే వారి వెనుక సెక్రటేరియట్ లో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా, వారికి ఎవరు సహకరించారు, వారి బాధితులు ఎవరైనా ఉన్నారా, అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. రాష్ట్ర సచివాలయంలోనే ఈ తరహా నకిలీ ఉద్యోగి వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికార వర్గాలు అప్రమత్తమయ్యాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారి గుర్రం విజయలక్ష్మి అరెస్ట్

విశాలాంధ్ర- దుండిగల్: గ్రేటర్ కమ్యూనిటీ పేరుతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం మల్లంపేట్ గ్రామం ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 170/3, 170/4, 170/5లో ఉన్న భూమిని ఆక్రమించి, సుమారు 325 అను మతి లేని విల్లాలను అక్రమంగా నిర్మించి, దాదాపు 400 కోట్ల రూపాయల ఆర్థిక నేరానికి పాలుపడిన శ్రీ లక్ష్మీ శ్రీనివాస నిర్మాణ సంస్థ అధినేత్రి గుర్రం విజయలక్ష్మి విదేశాలకు వెళ్లిపోతుండగా లుక్ ఔట్ నోటీస్‌లో ఉన్న పాస్‌పోర్ట్ స్టేటస్‌ను గమనించిన విమానాశ్రయ సిబ్బంది, గురువారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దుండిగల్ పోలీసులకు సమాచారం తెలియజేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. 2021వ సంవత్సరం నుండి దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమాలపై పలు సెక్షన్ల క్రింద కేసులు నమోదు అయ్యి ఉండడంతో పాస్పోర్ట్ రద్దు చేశారు. అధికారులు గత అక్టోబర్‌లో కూడా ఆమె బౌరంపేట్ కత్వా చెరువులో నిర్మించిన 17 విల్లాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. గుర్రం విజయలక్ష్మి అరెస్ట్ అయిన వార్తలు రావడంతో విల్లాలు కొన్న బాధితులు దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని తమకు న్యాయం చెయ్యాలని కోరారు. లక్ష్మి శ్రీనివాస నిర్మాణ సంస్థ ఆస్తులు జప్తు చేసి వెంటనే నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం తిరిగి చెల్లించాలని స్థానిక నేతలు డిమాండ్ చేశారు.

ఘనంగా మహాత్మగాంధీ వర్ధంతి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: మంత్రుల నివాస ప్రాంగణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా మంత్రు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అహింసా మార్గంలో నడిచి, సత్యాన్ని ఆయుధంగా మార్చి దేశానికి స్వాతంత్ర్యం అందించిన గొప్ప వ్యక్తి అన్నారు.

విశాలాంధ్ర - ఆమనగల్లులో: బాపూజీ అహింసా మార్గం అందరికీ అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అహింస,శాంతి సిద్ధాంతాల ద్వారా దేశ ప్రజలను ఏకం చేసి స్వాతంత్రాన్ని సాధించిన మహాత్మా గాంధీ చిరస్మరణీయుడని ఆయన కొనియాడారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు హైదరాబాదులోని ఎమ్మెల్యే కసిరెడ్డి నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మాజీ జెడ్పీటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్ రెడ్డి, వెంకటేశ్వరరావులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి ఎమ్మెల్యే కసిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ చూపిన శాంతి బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగి సమాజ శాంతి స్థాపనకు బాటలు వేయాలన్నారు. నాయకులు పెంటారెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శంకర్, భీష్మ చారి, దేవయ్య, వెంకటరమణ, సాయిలు, జంగం సుగుణ, సత్యనారాయణ, అంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. జిల్లా నాయకులు రామ్‌రెడ్డి, రమేష్, ఖాదర్, సురేష్, అలిమ్, జిల్లా కార్యదర్శీ ఫరీద్ ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్లు నాజర్, మహేష్, ఖాదర్ ఖాద్రి, శీను, శ్రీధర్, రఫీ, శీను, కృష్ణయాదవ్ శివ, అంజత్, నరసింహ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : మహాత్మాగాంధీ ఆచరించిన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని టీపీసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం బాపు ఘాట్ వద్ద ప్రముఖులతో కలిసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. మహాత్ముని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిఈ బిక్షపతి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాసులు, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి బిసి ఐక్యవేదిక కార్యాలయంలో..

శేరిలింగంపల్లి బిసి ఐక్యవేదిక కార్యాలయం ముందు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బిసి ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ శ్రీనివాస్ యాదవ్ రమేష్ యాదవ్ రవి ఆర్కే రాము బీసీ నాయకులు అభిమానులు పాల్గొని ఘనంగా నివాళులర్పించడం జరిగింది. యోగా గురువు గారెల వెంకటేష్ ముదిరాజ్, కే నరసింహ యాదవ్, రవి నాయక్, రాయుడు, జయ రెడ్డి, చిట్టెమ్మలాల్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ భువన్ డీజే, నాగరాజు, అశోక్, వేలు, కృష్ణ, జస్వంత్, రాజు, ఆర్కే సాయన్న వందన మర్పణతో ముగిసింది.

అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేయాలి

ఎంపి ఈటెల రాజేందర్

విశాలాంధ్ర- దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కృషి చేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. గురువారం బీజేపీ జిల్లా ఇంచార్జి అధ్యక్షులు డా.ఎస్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌ని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడుతూ పడుతూ, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని సూచించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న దుండిగల్ మున్సిపాలిటి పరిధి ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని, మారుమూల గ్రామమైన నాగులూరు నందు రోడ్లు, స్మశాన వాటిక, ఆర్టీసీ బస్సు సౌకర్యం, విద్యార్థులు, ఉద్యోగులు, రేషన్ షాప్ ఇతర సౌకర్యాలు లేకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలపై బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, నాగులూరు చెందిన మధుసూదన్ ఈటెల రాజేందర్‌కు మెమోరాండం అందజేశారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులుగా నియమితులై పీసరి కృష్ణారెడ్డిని శాలువాతో సత్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుండిగల్ విగ్నేశ్వర్, జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబెర్ మల్లేష్ యాదవ్, నల్ల రామచంద్రరెడ్డి, డి.ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ బీసీ మోర్చా అధ్యక్షులు ఎంబరి ఆంజనేయులు, యువమోర్చ నాయకులు ఆకుల విజయ్, భాను గౌడ్, వెంకటేష్ నాయక్, అతీష్ బాబు, మురళిదర్, కొమ్ము ప్రశాంత్, శ్రీధర్ గౌడ్, చిన్నముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోకిల ఉద్యోగ విరమణ అభినందన సభ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 34 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన బి కోకిల ఉద్యోగ విరమణ అభినందన సభలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో కలిసి శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గడ్డం ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి గడ్డం ప్రసాద్‌ని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు. అనంతరం పదవి విరమణ చేస్తున్న కోకిలని శాలువాతో సత్కరించి నూతన వస్త్రాలు అందజేసి అభినందనలు తెలియజేయడం జరిగింది. అనంతరం సాయి బాబాని పాఠశాల సిబ్బంది సత్కరించి మెమొంటోతో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి ప్రైమరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్యామల, సురేష్ గౌడ్, ఎపిపిసి చైర్మన్ వీణమ్మ, రంగారెడ్డి జిల్లా పిఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, శేర్లింగంపల్లి మండల అధ్యక్షులు హనుమంత్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి ఉపాధ్యాయ నాయకులు గాలి నరహరి, శివరాజ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ సంఘం కొత్తూరు నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - కొత్తూరు : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం కొత్తూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నట్టు ఆ సంఘం సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్నగర్ నియోజకవర్గం సలహాదారుడు ఎమ్మే సత్తయ్య, మండల కమిటీ నాయకులు కళ్లెం నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకోవడం జరిగిందని పేర్కొన్నారు. మండల కమిటీ నూతన అధ్యక్షులుగా బోకుల శ్రీరాములు, ఉపాధ్యక్షులు రాయకొండ వేణుగోపాల్ చారి, దేశాల భీమయ్య, సర్పే చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి జొల్లు బాలయ్య, కార్యదర్శిలుగా ఎమ్మే నరసింహ, ఎర్ర అర్జున్, ఖయ్యుమ్ ఖాన్, కోశాధికారి మామిడి దామోదర్ రెడ్డి, మీడియా ఇంచార్జ్ కమ్మరి ఓం ప్రకాష్, కార్యవర్గ సభ్యులు చెన్నయ్య, దేవేందర్ గౌడ్, రమేష్, మోహన్ నాయక్, నాగరాజ్ గౌడ్, అంబటి కృష్ణ, గౌరవ అధ్యక్షులు రంగా రెడ్డి, మహేందర్ రెడ్డి, బ్రహ్మచారి, మల్లేష్, సలహాదారులు మహిపాల్ రెడ్డి, నవీన్ చారి, మాధవరెడ్డి, పాండు, రాములు గౌడ్‌లను ఎన్నుకున్నట్లు వారు ప్రకటనలో వివరించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషిచేస్తామని కార్యవర్గం సభ్యులు తెలిపారు. దేశాల జైపాల్, ఉద్యమకారులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న కొలను



విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతి నగర్ సాయి బాబా ఆలయం నందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్ని వారి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని, ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని ప్రతి గురువారం ప్రారంభిం చడం ఎంతో సంతోషకరమని, ఎల్లప్పుడూ అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చేస్తున్న సేవలను అభినందించారు. డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుదీర్ రెడ్డి, అరవింద్ నాయుడు, రాములు నాయక్, ఇంద్రజిత్, సల్మాన్ రాజ్, రంగయ్య, మల్లికార్జున్, రవీందర్, తులసి దాస్ పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పర్యవేక్షించిన అమర్ సింగ్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 3లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను గురువారం పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. కాలనీ అధ్యక్షుడు జి.వెంకటేష్‌చారి, ప్రధాన కార్యదర్శి గొడుగు నరేందర్ మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి సహకరించిన మాజీ మేయర్ అమర్ సింగ్‌కి, బండి శ్రీనివాస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, 20వ వార్డు ఇన్‌చార్జ్ బండి శ్రీనివాస్ గౌడ్, మోహన్ రావు, హనుమంతరావు, బేతి నర్సింహారెడ్డి, రాంబాబు, దామోదర్ రెడ్డి, రాజ్‌కుమార్, లింగం, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే విడుదల చేయొద్దు: నెతన్యాహు

టెల్అవీవ్: గాజా కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా సాగుతున్న క్రమంలో ఇజ్రాయిల్ కీలక ప్రకటన చేసింది. గురువారం విడుదల చేయాల్సిన బందీలను అప్పుడే వదిలి పెట్టకూడదని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయిల్‌కు చెందిన బందీలను సురక్షితంగా అప్పగిస్తామని హమాస్ హామీ ఇచ్చేంత వరకు పలస్తీనియన్లను విడుదల చేసే ప్రసక్తే లేదని నెతన్యాహు స్పష్టం చేసినట్లు తెలిపింది. ముగ్గురు ఇజ్రాయిలీలను హమాస్ విడుదల చేసింది. అందుకు బదులుగా 110 పలస్తీనియన్లను ఇజ్రాయిల్ అప్పగించాలి కానీ, నెతన్యాహు అడ్డుతిరిగారు. హమాస్ నుంచి స్పష్టమైన హామీకి డిమాండ్ చేశారు.

ఇంటింటి ప్రచారంలో ఓక్లా అభ్యర్థి ఇంజామాముల్ హసన్, వికాస్‌పురి అభ్యర్థి షిజో వర్గీస్

దిల్లీలో సీపీఐ ప్రచార హోరు

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థుల ప్రచారం క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున సాగుతోంది. తమకు అవకాశం ఇవ్వాలని దిల్లీ ప్రజలను లెఫ్ట్ అభ్యర్థులు కోరుతున్నారు. ఐదుగురు ఉమ్మడి లెఫ్ట్ అభ్యర్థులు ఇంటింటికి ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. సీపీఐ దిల్లీ నాయకులు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్, మహిళా నాయకులు, యువ నేతలు, యువత వెంట నడవగా ఎర్ర జెండా గెలుపు కోసం వీధి వీధి, వాడ వాడల్లో ప్రచారం చేస్తున్నారు. ఓక్లా అసెంబ్లీ స్థానం నుంచి ఇంజామాముల్ హసన్, వికాస్‌పురి అభ్యర్థి షిజో వర్గీస్, పాలం బరిలో నిలిచిన దిలీప్ కుమార్, ఆదర్శనగర్ అభ్యర్థి సంజీవ్ కుమార్ రాణా, వజీర్పూర్ అభ్యర్థి దేవేంద్ర కుమార్ ప్రచారంలో బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రత్యామ్నాయ శక్తిగా వామపక్షానికి మద్దతు కూడగడుతున్నారు. ప్రజల్లోకి మరింతగా వెళుతూ తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. ఇంజామాముల్ హసన్ వెంట సీపీఐ దిల్లీ కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బర్ అహ్మద్, సీపీఐ దక్షిణ దిల్లీ కార్యదర్శివర్గ సభ్యుడు పర్వేజ్ ఆలం, ఏఐవైఎఫ్ బీహార్ రాష్ట్ర కార్యదర్శి రౌషన్ కుమార్ సిన్హా, సంయుక్త కార్యదర్శి శంభు దేవా, యువ కార్యకర్తలు సరితా విహార్, మదన్‌పూర్ ఖదర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. అభ్యర్థి దిలీప్ కుమార్ ప్రచారం రాజాపురిలో సాగింది. సంజీవ్ కుమార్ రాణా... మూల్‌చంద్ కాలనీ, ఆదర్శనగర్, ఇందిరా నగర్, మజ్లిస్ పార్క్, పిపల్తాలా గ్రామం, ధీర్పూర్‌లో ప్రచారం నిర్వహించారు. సీపీఐ ఉత్తర దిల్లీ సమితి సభ్యులు, శ్రేయోభిలాషులు ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. వజీర్పూర్ అభ్యర్థి దేవేంద్ర కుమార్ తన ప్రచారాన్ని వజీర్పూర్ పారిశ్రామిక వాడలో నిర్వహించారు. సీపీఐ ఉత్తర దిల్లీ సభ్యులు, కార్యకర్తలు ఆయనతో కలిసి ప్రచారం చేశారు. వికాస్‌పురి అభ్యర్థి షిజో వర్గీస్ ప్రచారం పెద్దఎత్తున సాగింది. వికాస్‌పురి నగర్, కువర్ సింగ్ నగర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఐ పశ్చిమ దిల్లీ సమితి సభ్యుడు సూర్జిత్ గాంధీ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పశ్చిమ జిల్లా నాయకురాలు రెహానా ఖాతూన్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థులు, మహిళా సభ్యులు, యువ నేతలు ఆయన వెంట నడిచారు. ముమ్మరంగా ప్రచారం చేశారు.

సాయుధ దళాల సిబ్బందిని కోర్టుకు లాగొద్దు

కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూదిల్లీ: సాయుధ దళాల్లో పనిచేసి రిటైరైన సిబ్బందిని కోర్టుకు లాగవద్దని సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒక రేడియో ఫిట్టర్‌కు వైకల్య పెన్షన్ మంజూరు చేస్తూ సాయుధ దళాల ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను గురువారం విచారించిన సుప్రీం ధర్మాసనం... ఈ మేరకు కేంద్రాన్ని మందలించింది. 'భారత ప్రభుత్వం రిటైర్డ్ సాయుధ దళాల సభ్యులను ఇలా కోర్టుకు లాగకూడదు. అటువంటి అప్పీళ్లపై ఖర్చులు విధించకుండా ఉండటంలో మేము ఉదారతను ప్రదర్శిస్తున్నాము' అని జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సాయుధ దళాల ట్రిబ్యునల్ ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు దాఖలు చేయడంపై తదుపరి విచారణ తేదీకి ముందుగానే ఒక విధానాన్ని తీసుకురావాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. 'కొంత విచక్షణ ఉండాలి. ఎవరిని సుప్రీంకోర్టుకు తీసుకెళ్లాలనే దానిపై ఒక విధానం ఉండాలి.ట్రిబ్యునల్ నుండి వికలాంగుల పెన్షన్ మంజూరై ఉపశమనం పొందిన ప్రతి సాయుధ దళాల సభ్యుడిని ఈ కోర్టుకు లాగవలసిన అవసరం లేదు.పన్ను విషయాల విషయంలో మాదిరిగా, కేంద్రప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించాలని మేము భావిస్తున్నాము. సాయుధ దళాల సభ్యులను సుప్రీంకోర్టుకు లాగడానికి నిర్ణయం తీసుకునే ముందు కొంత పరిశీలన జరగాలి.' అని ఉత్తర్వులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ధర్మాసనం తదుపరి విచారణ తేదీ లోగా నిర్ణయం తీసుకుని కోర్టుకు తెలియజేయడానికి కేంద్రానికి సమయం ఇచ్చింది. 2013లో జమ్మూ కశ్మీర్‌లో నియంత్రణ రేఖకు సమీపంలో ఒక ఆపరేషన్ సమయంలో గుండెపోటుతో మరణించిన జవాను భార్యను కేంద్రం కోర్టుకు లాగడంపై గత సంవత్సరం డిసెంబర్‌లో జస్టిస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తన అసంతృప్తి వ్యక్తం చేసింది. సైనికుడి మరణాన్ని మొదట యుద్ధ ప్రమాదంగా వర్గీకరించి... 'భౌతిక ప్రమాదం' గా మార్చారు. వితంతువుకు ఖర్చులకింద రూ. 50,000 చెల్లించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఆమెకు ఫ్యామిలీ పెన్షన్ మినహా అన్ని టెర్మినల్ ప్రయోజనాలు మంజూరు చేసింది. సాయుధ దళాల ట్రిబ్యునల్ ఆమెకు అనుకూలంగా తీర్పు ఇస్తే... దీనిని ప్రభుత్వం సవాలు చేయడంతో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇప్పుడు ఇలాంటిదే మరొక కేసు రావడంతో సుప్రీం ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసింది.

లౌకికవాదానికి బీజేపీ తూట్లు

గాంధీ స్ఫూర్తితో ప్రజాస్వామ్య రక్షణకు కృషి: రాజా

విశాలాంధ్ర- విశాఖ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జీవీఎంసీ వద్ద గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ మహాత్మాగాంధీ అన్ని తరాలవారికీ ఆదర్శమని, అన్ని మతాల వారినీ ఏకతాటిపైకి తెచ్చిన ఘనత గాంధీకి దక్కుతుందన్నారు. గాంధీని చంపిన గాడ్సేకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు దండలు వేసి నివాళులర్పించడమంటే... లౌకికవాదం, ప్రజాస్వామ్యం పట్ల వారికి ఏమాత్రం గౌరవం లేదని అర్థమవుతోందని విమర్శించారు. గాంధీ స్ఫూర్తితో ప్రజల హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ పోరాటాలు చేస్తోందని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. గాంధీ ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అనీరాజా, అమర్‌జిత్ కౌర్, బాలచందర్ కాంగో, కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల పాల్గొన్నారు.

నిర్మలమ్మ ముందున్న బడ్జెట్ సవాళ్లు

న్యూదిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సర (2025-26) వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు సర్వం సిద్ధమైంది. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశ పెడుతున్న ఎనిమిదో బడ్జెట్ ఇది. బడ్జెట్ రూపకల్పనలో ఆర్థికశాఖ కార్యదర్శి తుహిన్ కాంతా పాండేతోపాటు కీలక అధికా◌ులు అవిశ్రాంతంగా పని చేశారు. రూ.50 లక్షల కోట్లపై చిలుకు విలువ గల బడ్జెట్‌ను సిద్ధం చేశారు. అయితే పతనమవుతున్న ఆర్థిక వృద్ధిరేటు, అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం, వినియోగ డిమాండ్‌లో పెరుగుదల వంటి సవాళ్లను ఈ బడ్జెట్ పరిష్కరించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధిరేటు నాలుగేళ్ల కనిష్టం 6.4 శాతానికి పడిపోతుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక వృద్ధి రేటు నెమ్మదిస్తుందన్న సందేహాలు ఉన్నాయి. 2019-20లో యావత్ ప్రపంచాన్ని చిన్నాభిన్నం చేసిన కరోనా మహమ్మారి ప్రభావం తర్వాత అతి తక్కువ ఆర్థిక వృద్ధిరేటు నమోదు కావడం ఇదే తొలిసారి. వినియోగం డిమాండ్‌లో మెరుగుదల, ఆర్థిక వృద్ధిరేటు క్షీణత, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, స్తంభించిన ప్రైవేట్ పెట్టుబడులు తదితర సమస్యల నుంచి ఆర్థిక వ్యవస్థను ముందుకు నడపటానికి కేంద్ర ఆర్థికమంత్రి ప్రయత్నిస్తున్నారు. ఈ నెలలో ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ జీవిత కాల గరిష్టం రూ.86.7లకు పతనమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీలో ద్రవ్యలోటు 4.5 శాతానికి దిగువకు తేవడం సర్కార్ లక్ష్యంగా కనిపిస్తోంది. కేంద్ర వార్షిక బడ్జెట్ రూపకల్పనలో ఆర్థిక మంత్రికి రెవెన్యూ విభాగం కార్యదర్శి పాండే, ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అజయ్ సేథ్, వ్యయాల కార్యదర్శి మనోజ్ గోవిల్, డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) కార్యదర్శి అరుణీశ్ చావ్లా, ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు, ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ సహకరించారు.

'ఫొటో జర్నలిస్ట్' క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్-2025 క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. క్యాలెండర్‌లో పొందుపరిచిన ఫొటోలను ఆయన ఆసక్తిగా తిలకించారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ భాస్కర్, నారాయణ, మహేశ్, ప్రశాంత్, సతీశ్ ఉన్నారు.

తెలంగాణ నుంచి రూ.50 కోట్లు ఇప్పించండి

సీఎంకు వక్ఫ్ బోర్డ్ వినతి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తెలంగాణ నుంచి ఏపీ వక్ఫ్ బోర్డ్‌కు రావాల్సిన రూ.50 కోట్ల బకాయిలను ఇప్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఏపీ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం సీఎంను కలిసి వివిధ సమస్యలను వివరించారు. అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర వక్ఫ్ బోర్డ్ కు చెందిన అన్ని రికార్డులు, పత్రాలు తెలంగాణ నుంచి బదిలీ చేయలేదని, ఆస్తులను అప్పగించలేదని తెలిపారు. తమ వద్ద రికార్డులు లేని కారణంగా చట్టపరమైన విషయాలలో కోర్టుల్లో కౌంటర్లు దాఖలు చేయలేక పోతున్నామని పేర్కొన్నారు. 2014లో నెల్లూరులోని బారా షహీద్ దర్గా ప్రాంగణంలో రొట్టెల పండుగ-ఇస్లామిక్ కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధికి రూ.20 కోట్లు విడుదల చేశారని, దానిని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. దర్గా అభివృద్ధికి రూ.ఐదు కోట్లు విడుదల చేయాలని కోరారు.

67 మంది దుర్మరణం

వాషింగ్టన్: అమెరికాలో రెప్పపాటులో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని వాషింగ్టన్ డీసీలో రోనాల్డ్ రీగన్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద సైనిక బ్లాక్ హాక్ హెలికాప్టర్... అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం గాల్లోనే ఢీకొన్నాయి. ఆపై పొటామక్ నదిలో విమానం కూలిపోయింది. విమానంలోనూ, హెలికాప్టర్‌లో గల మొత్తం 67 మందిలో ఏ ఒక్కరు ప్రాణాలతో లేరని అధికారులు ప్రకటించారు. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో నలుగురు సిబ్బంది, 60 మంది ప్రయాణికులు ఉన్నారని వైమానిక సంస్థ వెల్లడించింది. బ్లాక్ హాక్ హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారని అమెరికా రక్షణ శాఖాధికారి వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతుండగా ఇప్పటివరకు 28 మృతదేహాలను నదిలో నుంచి వెలికితీశారు. అయితే ఎవరు ప్రాణాలతో ఉండే అవకాశం లేదని సహాయ సిబ్బంది తెలిపారు. కాగా, బాధితుల సమాచారం కోసం హాట్‌లైన్‌ను విమానయాన సంస్థ ఏర్పాటు చేసింది. పీసీఏ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 5342 విమానం బుధవారం రాత్రి 9 గంటలప్పుడు ప్రమాదానికి గురైనట్లు పౌర విమానయాన శాఖ అధికారులు వెల్లడించారు. విమానం కన్సాస్ నుంచి వాషింగ్టన్‌లోనీ రీగన్ విమానాశ్రయానికి వస్తుండగా దుర్ఘటన జరిగిందన్నారు. బ్లాక్ హాక్ హెలికాప్టర్ వర్జీనియాలోని ఫోర్ట్ బెలివర్ బేస్‌కు చెందిందని సైనిక అధికారి ఒకరు అన్నారు. మృతులను ధ్రువీకరించలేమని టెక్సాస్ సేనేటర్ టెడ్ క్రూజ్ చెప్పారు. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. హెలికాప్టర్, విమానం ఢీకొన్నప్పుడు పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగడం ఆ వీడియోలో ఉంది. 30 సెకన్లలోపు ఈ ఘోరం జరిగినట్లు అధికారులు చెప్పారు.

విమానం దిగేందుకు కొన్ని నిమిషాల ముందు పైలట్‌ను విమానాశ్రయంలోని ఎయిర్ ట్రాఫిక్ సిబ్బంది సంప్రదించారు. కొత్తగా నిర్మించిన రన్‌వే 33పై ల్యాండ్ చేయగలరా అని అడిగారు. పైలట్లు ఒప్పుకోవడంతో కొత్త రన్‌వేపై విమానం దిగేందుకు ఏటీసీ అనుమతి ఇచ్చింది. అంతలోనే స్కిరోస్కీ హెచ్-60 ఆర్మీ హెలికాప్టర్ ఆ మార్గంలోకి వచ్చింది. అప్రమత్తమైన ఏటీసీ అధికారి వెంటనే హెలికాప్టర్ పైలట్‌కు సమాచారం ఇచ్చారు. 'మీ ముందు ఓ విమానం వస్తోంది కనిపిస్తుందా అని అడిగారు. కొన్ని క్షణాల్లోనే మరో రేడియో సందేశం పంపారు. అయితే రెప్పపాటులో దుర్ఘటన జరిగిపోయింది. రన్‌వేకు 2,400 అడుగుల దూరంలో విమానం నుంచి రేడియో ట్రాన్స్‌పాండర్ డేటా నిలిచి పోగా... విమానం సరిగ్గా నది మధ్యలో ఉన్నప్పుడే సిగ్నల్స్ ఆగాయి. విమానం, హెలికాప్టర్ ఢీకొన్న తర్వాత విమానం రెండు ముక్కలు కాగా హెలికాప్టర్ తలకిందులుగా కూలిందని అధికారులు వెల్లడించారు.

హెలికాప్టర్ ఎలా వచ్చింది: ట్రంప్

తాజా ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం వేదికగా స్పందించిన ఆయన హెలికాప్టర్ ప్రయాణించిన తీరును తప్పుపట్టారు. విమానాశ్రయానికి వెళ్లే దారిలో విమానం సరైన దిశలో వెళుతుంటే ...హెలికాప్టర్ చాలా సేపు తిన్నగా విమానం వైపునకు ఎలా వెళ్లిందని ట్రంప్ ప్రశ్నించారు. 'ప్రమాదం జరిగినప్పుడు ఆకాశం నిర్మలంగా ఉంది. విమానం దీపాలన్నీ వెలుగు తున్నాయి. అలాంటప్పుడు హెలికాప్టర్ నేరుగా విమానం వైపునకు ఎలా వెళ్లింది. కిందకో, పైకో... పక్కకో ఎందుకు వెళ్లలేదు. ఎదురుగా విమానం ఉన్నది చూశారా అని అడగడానికి బదులు ఏం చేయాలో కంట్రోల్ రూమ్ చెప్పాల్సింది. ఇది నివా రించదగ్గ ప్రమాదం' అని అధ్యక్షుడు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. మరొక పోస్టులో మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు

దంపతుల కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూదిల్లీ: దేశంలో ఎవరూ చట్టానికి అతీతులు కారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఓ కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఇలా స్పందించింది. భర్త తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆ మహిళ ఐపీఎస్ అధికారి కావడంతో తన క్లయింట్ ఎప్పుడూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కోర్టుకు తెలిపారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ 'దేశంలో ఎవరూ చట్టానికి అతీతులు కారు' అని పేర్కొంది. రెండు పక్షాలు కూర్చొని చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించింది. భర్త వ్యాపారవేత్త అని, ఆమె ఐపీఎస్ అధికారిని అని పేర్కొన్న కోర్టు... కోర్టు సమయాన్ని వృథా చేసే బదులు ఇద్దరూ కూర్చొని వివాదానికి ముగింపు పలకాలని సూచించింది. ఎవరైనా బాధితులుగా మారితే... వారిని రక్షించేందుకు తాము ఉన్నామని తెలిపింది. వ్యాపారవేత్త తరపున న్యాయవాది మాట్లాడుతూ తన క్లయింట్‌తో పాటు తండ్రిపై ఐపీఎస్ మహిళా అధికారి కేసు దాఖలు చేసిందని, దాంతో ఇద్దరూ జైలు పాలయ్యారని తెలిపారు. జూన్, 2022లో అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వుల్లో ఆ వ్యక్తి తల్లిదండ్రులపై నమోదైన క్రిమినల్ కేసును త్వరగా ముగించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ఐపీఎస్ అధికారి సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. విచారణ సందర్భంగా ఐపీఎస్ అధికారి పోలీస్ సర్వీస్‌లో చేరిన సమయంలో తనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని తప్పుడు సమాచారం అందించారని, ఆ సమయంలో మహిళా అధికారిపై రెండు కేసులు నమోదైనట్లుగా డిఫెన్స్ న్యాయవాది ఆరోపించారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేస్తూ 'మీ ప్రాణాలు కాపాడుకోవడం కోసం కంటే మహిళా అధికారి తన ఉద్యోగాన్ని ఎలా కోల్పోతారనే దానిపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లుగా కనిపిస్తోంది. కానీ, మహిళా అధికారి జీవితాన్ని నాశనం చేసే క్రమంలో మీ సొంత జీవితం కూడా నాశనమవుతుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మహిళా అధికారి ఏదైనా తప్పు చేసి ఉంటే హోం మంత్రిత్వశాఖ చర్యలు తీసుకుంటుందని ధర్మాసనం పేర్కొంది. కేసు విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

మహాత్ముడికి చంద్రబాబు నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అహింసను పరమ ధర్మంగా చెప్పిన మహాత్ముడు చిరస్మరణీయుడని అన్నారు. ఆయన బోధనలు అనుసరణీయమన్నారు.

మరోసారి సునీతా విలియమ్స్ 'స్పేస్‌వాక్'

న్యూయార్క్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగామి సునీత విలియమ్స్ మరోసారి 'స్పేస్‌వాక్' చేశారు. మరో వ్యోమగామి విల్‌మోర్‌తో కలిసి ఆమె నడిచారు. సునీత విలియమ్స్, విల్‌మోర్ ఎనిమిది రోజుల మిషన్‌లో భాగంగా గతేడాది జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో 'ఐఎస్ఎస్'కు వెళ్లిన సంగతి తెలిసిందే. అదే నెల 14న వారు తిరిగి భూమికి రావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు ఎదురవ్వడంతో అక్కడే చిక్కుకుపోయారు. ప్రస్తుతం స్టేషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న ఆమె.. నాసాకు చెందిన మరో వ్యోమగామితో కలిసి ఐఎస్ఎస్‌కు సంబంధించి కొన్ని మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. 2012లో ఆమె చివరిసారి స్పేస్‌వాక్ నిర్వహించారు. ఈ ఏడాది మార్చి చివర్లో లేదా ఏప్రిల్‌లో భూమికి సునితా విలియమ్స్ తిరిగు వస్తారని సమాచారం.

కుంభమేళాలో మరో అగ్నిప్రమాదం

కాలి బూడిదైన 15 గుడారాలు

యూపీ సర్కారు దిద్దుబాటు చర్యలు

లక్నో: మహాకుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో మరోసారి అపశృతి చోటు చేసుకుంది. ఇప్పటికే ఒకసారి అగ్ని ప్రమాదం జరగ్గా... మౌని అమావాస్య సందర్భంగా బుధవారం తెల్లవారుజామున తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. అయితే తాజాగా మరోసారి అక్కడ ప్రమాదం జరిగింది. గురువారం మహా కుంభమేళాలో మళ్లీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్-22లోని ఛట్‌నాగ్ ఘాట్ వద్ద ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు స్థానికులు వెల్లడించారు. ఈ అగ్ని ప్రమాద ఘటనలో అక్కడ ఏర్పాటు చేసిన దాదాపు 15 గుడారాలు కాలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గతంలోనూ కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది. 11 రోజుల క్రితం మహా కుంభమేళాలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఒక్కసారిగా భారీగా మంటలు వ్యాపించాయి. ఆ ఘటనలో 18 టెంట్లు దగ్ధం అయ్యాయి. మహాకుంభమేళాలో వరుస అగ్ని ప్రమాదాలు జరగడం భక్తులను ఆందోళనకు గురిచేస్తున్నా... ప్రయాగ్ రాజ్‌కు భక్తుల తాకిడి మాత్రం తగ్గడం లేదు.

మహాకుంభమేళాలో మౌని అమావాస్యనాడు (జనవరి 29) జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో యూపీ సర్కార్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తొక్కిసలాట నేపథ్యంలో సీఎం యోగి ఆదిత్యనాథ్... ప్రయాగ్‌రాజ్, కౌశాంబి, వారణాసి, అయోధ్య, మీర్జాపూర్, బస్తీ, జౌన్‌పూర్, చిత్రకూట్, బందా, అంబేద్కర్ నగర్, ప్రతాప్‌గఢ్, సంత్ కబీర్ నగర్, భదోహి, రాయబరేలి, గోరఖ్‌పూర్‌కు చెందిన సీనియర్ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వివిధ శాఖల మధ్య సమన్వయం కుదిర్చేందుకు ఐదుగురు ప్రత్యేక అధికారులను నియమించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివిధ మార్గదర్శకాలు జారీ చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

కీలక మార్పులు ఇవే...

మహా కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్ ప్రాంతంలోకి ఎలాంటి వాహనాలు ప్రవేశించకుండా నిషేధం విధించారు. ఈ ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా ప్రభుత్వం పేర్కొంది. వాహనాల ఎంట్రీకి ఎలాంటి మినహాయింపులు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే వీవీఐపీ, స్పెషల్ పాస్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాగ్‌రాజ్ పొరుగునున్న జిల్లాల నుంచి వచ్చే వాహనాలను సరిహద్దుల వద్దే నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాల రద్దీని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఫిబ్రవరి 4వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్ నగరంలోకి నాలుగు చక్రాల వాహనాలు ప్రవేశించకుండా నిషేధం విధించారు. భక్తుల సౌకర్యార్థం కుంభమేళా జరుగుతున్న ప్రాంతంలో వన్-వే రూట్ ట్రాఫిక్ వ్యవస్థను అమల్లోకి తెస్తున్నట్లు యూపీ సర్కార్ తెలిపింది. చిరు వ్యాపారులు రోడ్లపై దుకాణాలు పెట్టుకుంటే వాటిని వెంటనే ఖాళీ స్థలాల్లోకి మార్చాలని స్థానిక యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించింది. మేళా ప్రాంతంలో పెట్రోలింగ్‌ను పెంచాలని పోలీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. భక్తులు ఎక్కడా ఆగకుండా వారికి అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల గురించి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.